రామాయణం

# పాదుకా పట్టాభిషేకం



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్

www.freegurukul.org


సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్( డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్చంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్ధం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.


Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org

Facebook: www.facebook.com/freegurukul Help Line / WhatsApp: 904 202 0123

" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

**http://www.new.dli.ernet.in**



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

# పాదుకా పట్టాభిషేకము

## (SPIRIT OF SUBMISSION AND SINCERITY)

Acc. No. 28187

రచన

డాక్టర్. జి. ఎల్. ఎన్. శాస్త్రి, M. Sc., M. Phill, Ph. D.

భౌతికశాస్త్ర శాఖాధ్యక్షులు, టి. జె. పి. యస్. కళాశాల, గుంటూరు.

జగద్గురుపీఠము - గుంటూరు శాఖ

(The World Teacher Trust - Guntur Branch)

గుంటూరు - 522 002.

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. | ముందుమాట | i |
| 2. | ఆశీస్సులు | iv |
| 3. | పట్టాభిషేక గంగాజలము | v |
| 4. | కృతజ్ఞతలు | viii |
| 5. | "రఘురామ్" | x |
| 6. | స్మృతివేదన | xii |
| 7. | సాధకులకు మాత్రమే ! | xiv |
| 8. | భరతుని అభ్యర్థన | 1 |
| 9. | భరతుని హృదయం | 3 |
| 10. | గుహుని గూఢాలోచన | 5 |
| 11. | భరతుని ఆవేదన | 8 |
| 12. | గుహుని నివేదన | 9 |
| 13. | లక్ష్మణుని ఆందోళన | 11 |
| 14. | భరతుని సేవ | 14 |
| 15. | భరద్వాజుని చమత్కారం | 16 |
| 16. | భరద్వాజుని విందు | 17 |
| 17. | తల్లుల పరిచయము | 19 |
| 18. | భరతుని జాగ్రత్తలు | 21 |
| 19. | అనురాగ వచనాలు | 26 |
| 20. | దశరథుని మరణవార్త | 27 |
| 21. | రాముని వేదన | 28 |
| 22. | కర్తవ్య నిర్వహణ | 30 |

23. భరతుని ఔచిత్యము 31
24. రాముని పలకరింపు 32
25. భరతుని ప్రార్థన 34
26. రాముని సమాధానము 35
27. రెండవ ప్రయత్నము 36
28. రాముని ధర్మ ప్రవృత్తి 37
29. మరో ప్రయత్నం 39
30. రాముని ధర్మప్రబోధం 40
31. మరో ప్రయత్నం 41
32. రాముని సమాధానం 42
33. కైకేయి లౌక్యం 13
34. జాబాలి నాస్తికవాదం 46
35. రాముని సమాధానం 47
36. వశిష్ఠుని ప్రయత్నము 49
37. రాముని సమాధానం 49
38. భరతుని చివరి ప్రయత్నము 50
39. రాముని సమాధానం 52
40. తుది నిర్ణయం 54
41. లక్ష్మణుని పశ్చాత్తాపం 56
42. భరతుని తిరుగు ప్రయాణము 58
43. భరతుని భక్తి 60

# ముందుమాట

భౌతికశాస్త్రంలో పరిశోధనా నిమిత్తం నేను విశాఖపట్టణంలో వున్న పుడు మా గురువు గారైన శ్రీమాన్ ఎక్కిరాల కృష్ణమాచార్యులవారి పర్యవేక్ష. ఇలో ప్రతినెలాప్రచురింపబడి, విడుదలయ్యే "నావాణి" మాసపత్రికలో 1978 సంవత్సరము శ్రీరామనవమి సందర్భంగా "రాముడు–రామాయణం" అనే శీర్షికతో ఒక చిన్న వ్యాసాన్ని వ్రాశాను. మాష్టారు ఆ వ్యాసాన్ని చదివి ఆనందించి– "శాస్త్రీ! నువ్వు ఈ శీర్షికమీద రామాయణం ప్రతినెలా వ్రాస్తూ వుండు" అన్నారు. ఆ మాటను నేను ఉపదేశంగా, ఆదేశంగా, శిరసా వహించి అయోధ్యాకాండలోని "పాదూ ఖండము" దగ్గఱ నుండి వ్రాయడం ప్రారంభించాను. అక్కడ నుండి మిగిలిన అయోధ్యాకాండ, అరణ్యకాండ కిష్కింధాకాండలను ఇప్పటికి పూర్తిచేశాను. ప్రస్తుతం సుందరకాండ వ్రాస్తున్నాను. ఈ సుందరకాండను వ్రాస్తున్నప్పుడే ప్రస్తుత పుస్తకం 'పాదుకా పట్టాభిషేకం' అచ్చుకు నోచుకుంది !. ఇలా జరగడం– నేను సుందరకాండను వ్రాస్తున్నందువల్ల వచ్చిన సద్యఃఫలితంగా భావిస్తున్నాను. ఎందుకంటే–

ఎప్పుడో 1978వ సం॥లో పాదుకా పట్టాభిషేకం వ్రాయబడినా ఇంతవరకు అది పుస్తకరూపంలో అచ్చుకాబడకపోవడం ఏమిటి? దేనికైనా "టైం" రావాలి. దానికి సంబంధించిన వారు రావాలి. సుందర కాండను వ్రాస్తున్నప్పుడుగాని అ టైము రాలేదు, దాన్ని అచ్చువేయించే వ్యక్తి తారసపడలేదు. ఇంకో సంగతి వినండి :-

సుందరకాండలో ప్రధానంగా 'హనుమంతుని' భక్తి, యుక్తి, శక్తి సామర్థ్యాలను గుఱించి వుంటుంది. అంటే– సుందరకాండకు "హనుమ" నాయకుడని చెప్పుకోవచ్చు. అలాగే ప్రస్తుతం ఈ "పాదుకా పట్టాభిషేకం" పుస్తకాన్ని అచ్చువేయించడానికి ముందుకువచ్చినవ్యక్తిగూడా "హనుమ"యే!

విచిత్రంగా లేదూ! హనుమంతుడు వానరుడే! కాని అవసరమైనపుడు వైశ్వానరునిలా విజృంభిస్తాడు. మన 'హనుమ' కూడా పొట్టివాడే! కాని గట్టి గట్టి కార్యాలను గూడా గుట్టు చప్పుడు కాకుండా చక్కబెట్టుకు రాగలడు. ఇంకా వినండి—

నేను గుంటూరు, శ్రీశైలం, ఖమ్మం, ఖరగ్‌పూర్, కడప, రాజమండ్రి లలో రామాయణంమీద ధారావాహిక ప్రసంగాలు చేశాను. కాని మొట్ట మొదటగా గుంటూరు శ్రీనివాసరావుతోట లోని ఒక దేవాలయంలో 3 సంవత్సరాలు చెప్పాను. ఆ గుడి దేవుని పేరేమిటో తెలుసా? హనుమంతుడు!

ఈ పుస్తకాన్ని ఎక్కడ అచ్చుకు ఇవ్వాలి అన్నపుడుగూడా గూడా ఎన్నో ప్రెస్సులు, ఎంతోమంది నా దృష్టిలో మెదిలారు. అందరూ తెలిసిన వారే! ఎవర్నీ కాదనలేము. కాని చివరకు ఎవరి ప్రెస్సులో ముద్రణ జరిగిందో తెలుసా ? "హనుమ" ద్వారా కొనిరాబడిన "సంజీవని" ని తన పేరుగా గలిగిన చిరంజీవి సంజీవరావు ప్రెస్సులో జరిగింది!

ఈ 'పాదుకా పట్టాభిషేకం' గురించి పుస్తకావిష్కరణ సభలో మాట్లాడడానికి, పుస్తకంలో అభిప్రాయం వ్రాయించడానికి కూడా ఎవర్ని ఎన్నుకోవడం జరిగిందో తెలుసా? అప్పుడే "సుందరకాండ" ను వ్రాసి గ్రంథ రూపంలో అచ్చువేయించి, ఆ పుస్తకాల నడుమ పునీతులైన డా॥ మైలవరపు శ్రీనివాసరావుగారు!

రామ సంబంధ కార్యం అంటే ఆ "రామభక్త హనుమాన్" ఎంతటి విశ్వరూపందాల్చి విజృంభిస్తాడో చూశారా? సాధనా మార్గంలో వున్నవారికి తప్ప ఇతరులకు పైన చెప్పిన విషయాల్లోని సమన్వయ మాధుర్యం అంతగా రుచించక పోవచ్చు. అయినా ఇంకా నేను చెప్పేది వినండి. ముందు ముందు అరణ్యకాండ, కిష్కింధాకాండలు గూడా వాటికి తగిన వారి ద్వారానే వెలుగులోకి వస్తాయని నా దృఢమైన విశ్వాసం.

1992 నాటి విశాఖ గురుపూజలలో నేను "పాదుకా పట్టాభిషేకం" మీద ప్రసంగించాను. లక్ష్మణుని సేవ, భరతుని భక్తి, జాబాలి నాస్తిక వాదం, రాముని న్యాయబద్ధమైన ధర్మ నిర్ణయం, ఋజుత్వం మొదలైన విషయాలతో సాగిన ప్రసంగాన్ని సాంతం సావధానంగా 'S. హనుమాన్ ప్రసాద్' విన్నాడు. అతనికి వాళ్ళ కుటుంబ చరిత్ర, అకాల మరణం పొందిన తన అన్నగారైన రఘురామమూర్తి, అతని ద్వారా జరిగిన సేవా కార్యక్రమాలు అన్నీ ఒక్కసారి బుర్రలోమెదిలాయి. ఆ అన్నగారు 'రఘురామ మూర్తి అండ్ కంపెనీ, టాక్స్ కన్సల్టెంట్స్' అనే ఆఫీసు పెట్టి నడపకపోతే తానూ, తమ్ముళ్ళు ఏమైపోయేవారు? నిజానికి ఏ విధంగా చూసినా అన్నగారి బలవల్లనే గదా నేడు తమ కాళ్ళమీద తాము నిలబడగలిగింది. ఈ కృతజ్ఞతా భావం కలిగి వెంటనే నన్ను కలిశాడు. 'మాస్టారూ! ఈ పాదుకా పట్టాభిషేకాన్ని ఒక పుస్తకరూపంలో తీసుకురావాలి. మీకు కనక అభ్యంతరం లేకపోతే మా అన్నయ్య రఘురామమూర్తి స్మృతి చిహ్నంగా ఈ పుస్తక ముద్రణా బాధ్యతను నేను వహించ దలచాను' అన్నాడు. అని తన మానాన తను వూరుకోలేదు. అప్పటి నుండి గ్రంథావిష్కరణ జరిగేవరకు నిరంతరం నాకన్న ఎక్కువగా ఆపనిలో నిమగ్నమై పూర్తి అంకితభావంతో బాధ్యతను నిర్వర్తించాడు. మధ్యలో ఎన్నో అనుభవాలు. అవన్నీ అనుభూతి పరమైనవే! ఈ స్థలాన్ని వాటికోసం కేటాయించటం సముచితం కాదనే భావనతో ఆ విషయాన్ని వదలివేస్తున్నాను. సాధకులకు, జిజ్ఞాసువులకు ఈ పుస్తకం చక్కగా ఉపయోగపడగలదని ఆశిస్తున్నాను.

విజయదశమి, 6-10-92.

—జి. ఎల్. ఎన్. శాస్త్రి

# ఆశీస్సులు

ఈ చిన్న వచన గ్రంథము పేరు 'పాదుకాపట్టాభిషేకము'. రచయిత జి. ఎల్. ఎన్. శాస్త్రి. కథ అందరికీతెలిసిన రామాయణమే! కానీ, రచయిత యొక్క నేర్పు, చాకచక్యము ఈ గ్రంథములో అడుగడుగునా కనిపిస్తుంది. ఏ విషయమునైనా సుస్పష్టముగా, సూటిగా హృదయములోనికి నాటుకొను నట్లు చెప్పగలిగినవాడు శాస్త్రిగారు. సహజముగా సంస్కార వంతుడు. సరస్వతీ వరప్రసాదుడు, పరిపూర్ణ గుర్వనుగ్రహ సంపాదకుడు ఐన "శ్రీ శాస్త్రిగారి" చేతిలో ఈ గ్రంథములోని మాటలు మెలికలుతిరిగి సుందర నాట్యముచేసిసినవి. వచన కావ్యములోకూడా దృశ్యమును కళ్ళకు కట్టినట్లుగా నాటకీయముగా గోచరించుచు, తిక్కన భారతమును జ్ఞప్తికి తెచ్చుచున్నది. సామాన్య మానవులకు కూడా అర్థమవు రీతిలో రమ్యముగా గ్రంథమును చిత్రీకరించినారు. తన శాస్త్రీయమైన పరిజ్ఞానముతో మన సనాతన ధర్మము ఎంత సశాస్త్రీయమో కళ్ళకు కట్టినట్లు చెప్పగల ధీశాలి శాస్త్రిగారు. ఆయన చేతిలో ఈ పాదుకాపట్టాభిషేక గాథ మెరుగులు దిద్దుకున్నది. బాలురకు, యువకులకు, స్త్రీలకు, వృద్ధులకు, విద్యావంతులకు, విద్యావిహీనులకు అందరికీ అర్థమై, అందరినీ ఆనందింపజేయగల గ్రంథమిది. సర్వులను ఇది ఆనందింపచేయ గలదనుటలో ఎట్టి సంశయమూ లేదు. శాస్త్రి గారికి వారి కుటుంబమునకు ఎల్లవేళలా గుర్వనుగ్రహము, దైవానుగ్రహము కలదని తెలియపరుస్తూ నా దివ్యాశీస్సులను అందచేస్తున్నాను. వారి లేఖిని నుండి ఎన్నో ఎన్నో అత్యుత్తమ గ్రంథములు వెలువడాలని అకాంక్షిస్తూ ఆంధ్ర పాఠకలోకం ఈ గ్రంథమును సహృదయముతో ఆదరించగలదని ఆశిస్తూ, గ్రంథకర్తను, గ్రంథ ప్రచురణకు సహకరించినవారినీ ఆశీర్వదిస్తున్నాను.

విశ్వమందిరం — విశ్వయోగి విశ్వంజీ

కృష్ణనగర్, గుంటూరు.

# పట్టాభిషేక గంగాజలము

'రామాయణ ప్రవచన సుధాకర'
'భాషాప్రవీణ'
డా॥ మైలవరపు శ్రీనివాసరావు
ఎమ్మే (తెలుగు & సంస్కృతం) పి.హెచ్.డి.
ప్రిన్సిపాల్, సంస్కృత కళాశాల, తెనాలి.

5-21-37
2/6 బ్రాడీపేట
గుంటూరు.

ఈ గ్రంథకర్తా, అభిప్రాయదాతా మేమిద్దరము డాక్టర్లమే! అయితే గ్రంథకర్తలోని డాక్టరుతనం భౌతిక వైద్యానికి కూడ న్యాయం చేకూర్చేది. ఆ వైద్యంలోని 'భౌతిక పదం ఆయనచేసే ఉద్యోగ ధర్మానికి ఆధారభూత మైనది' ఇలా ఆయన 'Three in one'. ఇలాంటి వీరు గ్రంథ రచన చేశారంటే ఆశ్చర్యపడాల్సిన పనిలేదు. నాకు వీరు వీరి తైత్తిరీయోపనిషద్ వ్యాఖ్య ద్వారా ఆత్మీయులు. ఆధ్యాత్మిక ప్రచారం ద్వారా సతీర్థులు. ఇక గ్రంథాన్ని గూర్చి రెండు మాటలనుకుందాం.

'బిభర్తీతి భరతః' – రాజ్యాన్ని రాముడు వద్దనిఅన్నప్పుడు అనిష్టంగా తన భుజాలపై రాజ్యాన్ని భరించవలసి వస్తాడు కాబట్టి భవిష్య కథ తెలిసిన వసిష్ఠుడు 'భరతః' అని వీరికి పేరు పెట్టాడు. ఇతని తల్లి కైక. కా+ఏకా అని పద విభాగం. 'రాముణ్ణి సీతాలక్ష్మణ సమేతంగా అరణ్యాలకు పంపిన దుర్మార్గురాలు' అనే నిందని తనపై వేసుకొని రాముణ్ణి పంపి శూర్పణఖ ద్వారావిరోధాన్ని రావణునితోకల్పించి, సీతాపహరణానికి ఆధారభూతురాలై రావణ వధకి పాత్రురాలై, రాముని అవతారానికి ప్రయోజనాన్నీ, సార్థకతనీ కల్గించిన సాధ్వి. అందుకే ఈమె 'కా+ఏకా' ఎంతటి అసామాన్యురాలు!– నిందకి భయపడే జనం మంచి పనికైనా వెనుకడుగు వేస్తారు. ఈ విషయాన్ని గమనించిన భరద్వాజుడు 'రామ ప్రవ్రాజనాదేవ

శుభోదర్కం భవిష్యతి'– రాముణ్ణి కైక పంపడమే లోక శుభానికి కారణమౌతుందని పల్కాడు. అయోధ్యాకాండ శరీరంలో 'గుండె'వంటిది. అనేక రహస్యాలతో ఇమిడివుండడమే కాక ఎక్కడి చిక్కుముడి విడదీయాలన్నా ఇక్కడికి రాక తప్పదు. అన్నీ చెప్పడం అసాధ్యం కాబట్టి ఒక్కటి అనుకుందాం.

'నావస్సారురుహుశ్చాన్యే..............అన్యేతేరుశ్చబాహుభిః' రాముణ్ణి చూడడానికి అయోధ్యా ప్రజ బయలుదేరారు. కొందరు నావలు, కొందరు తెప్పలు, కొందరు బోర్లించిన కుండలు, కొందరు చేతులతో ఆ గంగను దాటివెళ్ళారు. అందరూ భగవద్దర్శనాన్ని చేశారు.

'కేవలం యజ్ఞాలవలననే భగవద్దర్శనంకాదు. స్తోత్రాలు, సంకీర్తనలు, మౌనప్రార్థనలు ఇవన్నీకూడా భగవంతుని చూపించగలవు' అనే విషయాన్ని పై గంగానదిని దాటిన వివిధ పద్ధతులద్వారా భగవద్దర్శనమైన సంఘటన ఆధారంగా వాల్మీకి మహర్షి చూపాడు. 'Prayers' ద్వారా శ్రీ శాస్త్రిగారు అనేకులకి సాధనభూతులౌతున్నారు.

జాబాలి నాస్తికవాదం విషయం ఎత్తుకుంటే ఒక పుస్తకమౌతుంది. ఇవన్నీ నా 'అయోధ్యాకాండ' వ్యాఖ్యలో పొందుపరచాను. అయితే విశేషాంశాలన్నీ మనస్సుకి అవగతం కావాలంటే చెప్పేధోరణి నచ్చే విధంగా ఉండాలి. బరువు విషయాలు తెలియాలంటే తేలిక భాషలో వ్రాయాలనే దృక్పథమే వీరికీఉండడం నాకానందాన్ని కల్గిస్తుంది. అలాటిరచనకు ఈ గ్రంథం ముంజేతి కంకణమ్.

వాల్మీకి రామాయణంలోలేని విషయాలు ఒండు రెండు ఉన్నా వ్యక్తిపై విషయ ప్రభావం పడితేనే గాని ప్రచారం సాగదు. ఆ ఉన్నవి సంప్రదాయాన్ని భంజింపచేసేవి కావు.

ఇవరఉన్న నాటకం ప్రచారానికి వజ్రాయుధం వంటిది. లోకంలో ఎల్లెడలా సర్వహృదయ క్షేత్రాల్లోనూ రామ బీజాలని వేసేందుకు వీలైనది. ఈ నాటకం వ్రాయడంలో వ్యక్తిలోనికి రామభక్తిని రచనా శక్తిద్వారా పంపాలనే తపన తెలుస్తుంది. ఆ తపన లేనినాడు ఈ దేవాలయాలూ లేవు—ఆరాధనలూ వుండవు.

ఆ ఆర్తి వీరికి మంగళాన్ని కల్గించాలనీ, రామకృపకు మరింతగా పాత్రుల్ని చేయించాలనీ, ఎన్నెన్నో ఇలాటి వానిని వ్రాయించాలనీ పరమాత్మను ప్రార్థిస్తూ—

ఇతిశమ్,

మైలవరపు శ్రీనివాసరావు

అంగీరస అశ్వయుజ శుద్ధ దుర్గాష్టమి, 4-10-92

# కృతజ్ఞతలు

జ్ఞానభిక్షను పెట్టి, అనురాగ వాత్సల్యాలతో నన్ను తీర్చిదిద్ది తమ రామాయణ ప్రసంగాలతో ప్రభావితుణ్ణి చేసిన గురువర్యులు ఎక్కిరాల కృష్ణమాచార్యుల వారికి—

రామాయణ కల్పవృక్ష కావ్యంతో ప్రభావితుణ్ణయి నేను పరోక్ష గురువుగా ఆరాధిస్తున్న బ్రహ్మశ్రీ విశ్వనాథ సత్యనారాయణగారికి—

నామీద, నాకుటుంబ సభ్యుల మీద అపారమైన ప్రేమాభిమానాలను వర్షింపచేస్తూ ఈ గ్రంథప్రచురణ సందర్భంలో తమ దివ్యాశీస్సులనందించిన శ్రీ విశ్వయోగి విశ్వంజీవారికి—

అడిగిన తోడనే అమితమైన అభిమానంతో "పట్టాభిషేక గంగాజలం" అనేశీర్షికతో తమ అమూల్యమైన అభిప్రాయాన్ని సాదరంగా అందజేసిన ఆత్మీయులు, 'రామాయణ ప్రవచన సుధాకరులు' అయిన డాక్టర్ మైలవరపు శ్రీనివాసరావు గారికి—

గుండె నిండిన నిండు ప్రేమతో నమస్సుమనస్సులను సమర్పిస్తున్నాను.

ఈ గ్రంథం "ఇలా రావాలి" అని సంకల్పించి అదిసరిగ్గా "అలానే వచ్చేవఱకు" అహర్నిశలు ఆనంద క్రీడాత్మకంగా కృషిచేసి నాకంటె ఎక్కువగా బాధ్యతను వహించిన చి॥ S. హనుమాన్ ప్రసాద్‌కు—

సమర్పణ భావనతో సమైక్యకృషిని సాధించి సకాలంలో పుస్తకాన్ని అందంగా అచ్చువేసి అందించిన మాస్టర్ ప్రింటింగ్ ప్రెస్ అధినేత చి॥ జె. సంజీవరావు అతని ముద్రణాలయ సిబ్బందికి—

అంకిత భావంతో అందమైన ముఖచిత్రాన్ని చిత్రించి అందించిన వేవీ స్క్రీన్స్ అండ్ డిజైనర్స్ (అరండల్ పేట, గుంటూరు) అధినేత చి॥ శ్రీనివాసరావు, అతని సోదరులకు—

ముఖ చిత్రాన్ని అందంగా ఆదర భావంతో ఆధునిక పరిజ్ఞానంతో ముద్రించిఇచ్చిన కంప్యూటరైజ్డ్ ప్రింటింగ్ సెంటర్ (అరండల్ పేట, గుంటూరు) వారికి—

ఈ గ్రంథాన్ని ఇలా ప్రచురిస్తున్నామని తెలియంగానే S. రఘురామ మూర్తిపై గల అత్యంత ప్రేమాభిమానాలతో గ్రంథ ప్రచురణార్థం రూ. 1116/- సమర్పించిన చి॥ మారెళ్ళ సేతు మాధవరావుకు—

ఈ గ్రంథ ప్రచురణాసత్కార్యంలో తమ వంతు సహాయంగా రూ. 1116/- సమర్పించిన శ్రీ కె. రామాంజనేయరెడ్డి (భాగ్యలక్ష్మి ఎంటర్ప్రైజస్, గుంటూరు) —

అలాగే తమవంతు సహాయంగా రూ. 516/- సమర్పించిన శ్రీ కొత్త సాంబశివరావు మరియు సోదరులకు (అన్నపూర్ణా డ్రెస్సెస్, గుంటూరు) మరియు ప్రచురణ పూర్వ మూల్యాలను సేకరించిన వారికి —

నా కృతజ్ఞతాపూర్వక శుభాశీస్సులు

వీరందరూ సర్వతోముఖాభివృద్ధిని పొందునట్లు అనుగ్రహించవలసినదిగా శ్రీరామచంద్రుని ప్రార్థిస్తున్నాను.

ఇట్లు

జి. ఎల్. ఎన్. శాస్త్రి, గ్రంథకర్త

# "రఘురామ్"

'రఘురామ్' పూర్తి పేరు 'రఘురామమూర్తి'. ఇంటిపేరు సూరపరాజు. శ్రీమతి రత్నమ్మ, శ్రీ సూర్యనారాయణ పుణ్య దంపతులకు ప్రకాశం జిల్లా కనిగిరి తాలూకా 'రామగోవిందాపురం' లో 9-6-1949 నాడు జన్మించాడు. తండ్రి సూర్యనారాయణగారిది పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తి. సొంత వూరిలో రామమందిరం నిర్మించుకొని రామచంద్రుని పాదారవిందాల సేవ చేసుకొంటూ, 1950 సంవత్సరములో గుంటూరు లోని రామనామక్షేత్రంతో తమ జీవితాన్ని ముడిపెట్టుకుని పునీతం చేసుకున్నారు. తన ఇష్టదైవం పేరునే తన ద్వితీయ పుత్రుడైన ఈ రఘురామ్‌కు పెట్టుకున్నారు.

తండ్రి శిక్షణలో సొంతవూరిలో రఘురాం ప్రాథమిక విద్యనభ్యసించి అటుపైన VII ఫారం వరకు కనిగిరిలో చదివాడు. 1966లో గుంటూరు వచ్చి డా॥ కొలచల వెంకట కృష్ణమూర్తిగారి పూర్తి సహకారంతో హిందూ కళాశాలలో B. Com., చదువు పూర్తిచేసి అటుపైన శ్రీ C.V.L. నరసింహారావుగారి పర్యవేక్షణలో C. A. పూర్తిచేశాడు.

తండ్రి రిటైర్ అవంగానే 1974 లో కుటుంబ భాద్యతను తాను చాలా బాధ్యతాయుతంగా నిర్వర్తించాడు. తల్లిలేని తన తమ్ముళ్ళను, చెల్లెళ్ళి తన పోషణలోనే సాకుతూ, తన చదువు తాను చదువుకుంటూ వుండేవాడు. 1978 మార్చిలో తన చెల్లెలికి పెళ్లి జరిపించిన తర్వాతనే ఆ సంవత్సరంలోనే ఆగష్టు నెలలో – చంద్రమౌళినగరం (గుంటూరు వాస్తవ్యులు శ్రీ కంచెర్ల రంగారావు, శ్రీమతి సావిత్రి పుణ్య దంపతుల షష్టమ కుమార్తె అయిన చి॥ అనూరాధారాణిని పెళ్ళి చేసుకున్నాడు. ఆమె తన ఇంటికి వచ్చిన వేళావిశేషం వలన వృత్తిపరంగా

బాగా అభివృద్ధిని పొందాడు. ముగ్గురు ఆడపిల్లలకు తండ్రి అయ్యాడు. ముద్దుగా వారికి మాధవి, మైథిలి, మానస అని పేర్లు పెట్టుకున్నాడు.

పుటకనిచ్చిన తల్లిదండ్రుల సంస్కారంతో పాటు 1975వ సంవత్సరంలో శ్రీమాన్ ఎక్కిరాల కృష్ణమాచార్యులవారి దివ్యసాన్నిధ్య, సంస్పర్శల వల్ల బాగా ప్రభావితుడై వారి పర్యవేక్షణలో నడిచే జగద్గురు పీఠము **(The World Teacher Trust)** అనే ఆధ్యాత్మిక అంతర్జాతీయ సేవా సంస్థను అంటిపెట్టికొని ఆ సంస్థ కార్యకర్తలకు 'తలలో నాలుక' లాగా వ్యవహరిస్తూ, తన సహాయ సహకారాలను అందిస్తూ వుండేవాడు. సంపాదించిన ధనాన్ని వివిధ సేవాసంస్థల సేవా కార్యక్రమాలకు, ఎంతో మంది పేద విద్యార్థుల ఉపకార వేతనాలకు ప్రత్యక్షంగాను, పరోక్షంగాను విరాళాలుగా ఇచ్చి సద్వినియోగ పరిచేవాడు.

ఇంకా అతని ద్వారా ఎన్నో సత్కార్యాలు జరిగివుండేవే, కాని అకస్మాత్తుగా హృద్రోగంవల్ల 14-12-1987 లో నిండుగా నలభై ఏళ్ళు గూడా నిండకుండానే బంధుమిత్రాదులను వదలి ఈ భౌతిక లోకానికి దూరమై పోయాడు.

రఘురాం తమ్ముళ్ళు, ముగ్గురిలో ఏ ఒక్కరూ రఘురాం స్థాయికి ఎదగలేదు. వాళ్ళకి వృత్తిపరంగా అవసరమైన విద్యార్హతలు గూడాలేవు. అయినా, చి॥ సత్యం గడించిన వ్యాపార శాస్త్ర బోధనానుభవానికి— చి॥ హనుమ, చి॥ శ్రీనివాసుల సంస్థ నిర్వహణా దక్షతలకు శ్రుతి కుదిరింది. అందుచేతనే ఆ అనుజులు ముగ్గురూ అన్నగారి పేరుతోనే, అన్నగారు పెట్టిన కంపెనీని సమర్థవంతంగా అంకిత భావంతో నిర్వహిస్తూ, అన్నగారి సాన్నిధ్యాన్ని, అనుభవిస్తూ ఆశీస్సులను పొందుతున్నారు.

# స్మృతి వేదన

సీ॥ గుంటూరులో జగద్గురుపీఠ శాఖను
నెలకొల్పుటకు ముందు నిలిచినావు
స్మారక సప్తాహ జ్ఞాన యజ్ఞమ్ముకై
ఎనలేని సేవ లందించినావు
మండు వేసవిలోన మంచినీళ్ళందించు
గట్టి పథకమును చేపట్టినావు
సమైక్య సిద్ధిని స్వచ్ఛంద సంస్థల
సాధించి సత్కృతుల్ సలిపినావు

తే॥ గీ॥ శాంతి పాఠము, ప్రేయరు, పావనీరు
తైత్తిరీయము, గాయత్రి మొత్తమన్ని
పుస్తకము లచ్చు బొందె నీ స్ఫూర్తి వలన
మఱచి పోలేము నీ మేలు మదిని నెపుడు

ఆ॥ వె॥ నీవు కలవనియెడి నిండు ధైర్యమ్ముతో
బ్రతికినారు నీదు వారలెల్ల
నీవు విడిచి పోవ నీరైరి తమ్ముళ్లు
దిక్కుతోచని యట్టి దిగులు తోడ

ఆ॥ వె॥ అక్క సుబ్బలక్ష్మి, అమ్మను మించిన
ప్రేమతోడ వారిఁ బెంచు చుండ
బావ రామమూర్తి, బరువు బాధ్యతలతో
తపవ చెంది పోకె తండ్రికన్న

తే॥ గీ॥ బాధ నిల్ద్రొక్కుకొని అనూరాధ ఇపుడు
మధుర మాధవి, మైథిలి, మానసలను
పెంచి పోషించు చున్నది ప్రేమతోడ
నీదు గుర్తులు వీరని నిండుగాను

తే॥ గీ॥ నీవు లేకపోవుటచేత నిలయమందు
పెద్ద తమ్మునిపై పడె పెద్దఱికము
'వంశ మర్యాద నిలిపెడు వనితయైన
నగలుగా నొప్పు సుగణాల నాగ సిరిని
ఇచ్చి శ్రీనివాసుని జేసె నింటివాని
నాకు కూతురుగా నొప్పు నాగ సిరియు
హనుమ, సత్యము, శ్రీనివా సనుజులంత
అగుదు రల్లుళ్లుగాను నా కాత్మయందు

తే॥ గీ॥ కసిగ కలి పురుషు లెందరో కాటువేసి
అన్నదమ్ముల బంధమ్ము నణగ ద్రొక్క
చేటు మాటల వారిని చీలదీయ
చూచినప్పటికిని గూడ - 'సుంతయైన
భేద భావమ్ము మా మధ్య రాదటంచు'
భరత, లక్ష్మణ, శత్రుఘ్న భక్తుల వలె
కలిసి కట్టుగ నున్నారు కనుక నీవు
చింత విడువుము రఘురామ! శాంతి బొందు!!!

# సాధకులకు మాత్రమే

శ్రీమద్రామాయణంలోని అయోధ్యాకాండ శ్రీ రామచంద్ర పట్టాభిషేక ప్రయత్నంతో ప్రారంభమౌతుంది. ఇది అందరూ ఆనందించే విషయమైనా కైకేయి దాసి మంథరకు నిరాశను, నిస్పృహను, అసూయను కలుగ చేస్తుంది. సీతారాముల యొక్క అత్రి, అనసూయల సందర్శనంతో అయోధ్యా కాండ సమాప్త మౌతుంది. అంటే అసూయతో మొదలైన అయోధ్య కాండ అనసూయా సందర్శనంతో ముగిస్తుందన్న మాట! అంటే సాధకులకు తెలుసుకోవలసిన, తెలుసుకుని ఆచరణలో పెట్టవలసిన సాధనా రహస్యాలు చాలా ఈ అయోధ్యాకాండలో వుంటాయని జాగ్రత్తగా ఆలోచిస్తే అర్థమౌతుంది.

అయోధ్యాకాండలోని 'పాదూఖండం' అనసూయాఖండానికి ముందు వస్తుంది. అంటే పాదూ ఖండాంత పఠనానికి ఫలప్రతిగా, అనసూయా దర్శనం— అంటే అసూయ ప్రక్షాళనం జరుగుతుందని అర్థంచేసుకోవాలి. అంతగా మార్పును తీసుకురాగల ఈ పాదూఖండంలోని కొన్ని సాధనా రహస్యాలను పరిశీలిద్దాం.

పితృకర్మలు పూర్తి చేసిన భరతుడు రాముణ్ణి అయోధ్యకు ఎనుకు రావడానికి నిర్ణయించుకుంటాడు. తానొక్కడేకాక అందర్నీబయలుదేరదీస్తాడు. దైవ దర్శనానికి స్వార్థం పనికిరాదని తనతో పాటు అందరూ, అందరితో పాటు తనూ అనే భావన వుండాలని ఈ నిర్ణయం తెలియజేస్తుంది. (Co-operation and Adjustment are the key notes of Spiritual life but not selfishness and Compitition) అదీ గాక బయలు దేరే వాళ్ళలో ఏ ఒక్కరి సంకల్ప సిద్ధి పనిచేసి అయినా రాముడు తిరిగి రావడానికి అవకాశం వుండవచ్చు నేమో అనే సద్భావనగూడావుంది.

సాధనా మార్గంలో ఎన్నో అవరోధాలు, అంతరాయాలు, పరీక్షలు. ప్రక్షాళనాలు, ప్రలోభాలు తప్పని సరిగా వుంటాయనే సంగతి– గుహుని దగ్గఱకు, భరద్వాజుని దగ్గఱకు భరతుడు వచ్చినపుడు తెలుస్తుంది. సాధకునికి అప్రమత్తత ఎంత అవసరమో గుహుడు లక్ష్మణునికి పెట్టిన పరీక్షలోను. భరతునికి పెట్టిన పరీక్షలోను తెలుస్తుంది. అంతవరకు లోకంలో ఎవ్వరూ ఎఱుగని రీతిలో భరద్వాజుడు విందు బోజనాలు పెట్టి ప్రలోభ పెడతాడు. అందరికీ మరో నాలుగురోజులు అలాహాయిగా గడి పేద్దామనే వుంటుంది, కాని భరతుడు మాత్రం వచ్చినపని మరచి పోకుండా భరద్వాజుని ప్రలోభానికీ లొంగడన్న విషయాన్ని ఒక సాధనా రహస్యంగా తీసుకోవాలి.

ఒక్కొక్కళ్లకు ఒక్కొక్క చోట తెగవలసిన పట్లు, ముడులు వుంటాయి. అవి విడి వడి తెగితే గాని సాధకుడు ముందుకు వెళ్ళలేడు తన తల్లి విష యంలో భరతునికి వున్న దురభిప్రాయమే భరతునికి తెగవలసిన పట్టుగా భరద్వాజుడు భరతునితో కైక గురించి అన్నమాటలను పట్టి సాధకుడు గ్రహించాలి. భరద్వాజుడు భరతునికి తల్లిపై గల నీచభావాన్ని ప్రక్షాళన చేసి కైక అంతర్యాన్ని సూచాయగా తెలియజేసి ముందుకు పంపిస్తాడు. ఎందుకంటే మలినభావాలు, నీచభావాలు గల మనస్సుతో దైవ సందర్శ నానికి వెళ్లరాదు. అందులోను సాక్షాత్తు తనను కన్న తల్లి మీద నీచ భావంతో అసలు వెళ్ళరాదు.

అడవిలో వున్నా– అవకాశం వున్నంత మేరకు త్రికరణ శుద్ధిగా రాముడు పితృకర్మలు యథాశక్తి చేస్తాడు. అంతే గాని ఇక్కడ కాలసిన ఏర్పాట్లు లేవని ఎగగొట్టి తప్పించుకోడు. విధ్యుక్త ధర్మాన్ని విధిగా యథాశక్తి పాటించి తీరాలని ఈ ఘట్టం చెబుతుంది.

నాస్తిక వాదంతోనూ, హేతువాదంతోనూ ఎవరైనా సంస్కృతీ పరమైన సంప్రదాయ మార్గానికి విఘాతం కలగ జేయడానికి ప్రయత్నిస్తే ఆ నాస్తిక వాదాన్ని ఉపయోగించే నాస్తిక వాదానికి సమాధానం ఎలా చెప్ప వచ్చో రాముని చేత జాబాలికి చెప్పిన మాటల ద్వారా గ్రహించి నేర్చుకుని వుండాలి.

ధర్మాన్ని ఉపదేశం చేసి, తీరా ఆ ధర్మాన్ని ఆచరించడానికి వచ్చే టప్పటికి- చెప్పిన ధర్మానికే దెబ్బతగిలే విధంగా మరోసలహా ఇస్తే— 'ఆ సలహా ఇచ్చిన వాడు సాక్షాత్తు గురువే అయినా గూడా— అయన్ని సరిదిద్ద వచ్చు' అని సూచనప్రాయంగా రాముడు వశిష్ఠునికి చెప్పిన మాటలను బట్టి గ్రహించాలి.

ఒకరికి వేసిన శిక్షను అనుభవించడానికి వారికి బదులుగా వేరొకరిని ఒప్పించి కేటాయించేయడం ధర్మాచరణం కాదని, శిక్షను తప్పించు కునే ప్రయత్నంచేసి అధర్మాన్ని ఆచరించి నట్లే అవుతుందని— తన బదులు భరతుడు అరణ్యవాసం చేస్తానన్న సందర్భంలో రాముడు చెప్పిన మాటలను బట్టి గ్రహించాలి.

చివరకు భరతుడు రాముని పాదుకలను శిరస్సు పై పెట్టుకుని వెళ్లి ఆ పాదుకలకే పట్టాభిషేకం చేసి కేవలం తానొక ప్రతినిధిగా వుండి రాజ్యాన్ని పాలిస్తాడు. ఈ చివరి ఘట్టం చాలా సున్నితమైన ఉపదేశాన్ని అందిస్తుంది. అది అన్ని కాలాల వారికి పనికి వస్తుంది.

'సింహాసనం' ఎవరు ఎక్కాలి? అనే విచికిత్స ఎప్పుడైనా వస్తే — వస్తే ఏమిటి వివిధ కాలాలలో, వివిధ సందర్భాలలో వచ్చింది, వస్తోంది, వస్తుంది గూడా!— ఈ విచికిత్సా రుగ్మతకు చక్కని చికిత్స ఈ ఘట్టంలో నిర్ణయించి, ఆచరించి భరతుడు తేల్చి చెప్పేశాడు.

సింహాసనాన్ని అధిరోహించడానికి రాముడొక్కడే తగినవాడు. అను జులైనా (తమ్ముళ్లు), ఆత్మజులైనా (కొడుకులు), అంతేవాసులైనా (శిష్యులు) ఆ సింహాసనానికి ఆశపడడం అవివేకమే! ఒకవేళ రాముడు దగ్గర లేక పోయినా ఆయనకూ, ఆయన నడచిన మార్గానికి ప్రతీకలైన ఆయన పాదుకలను సింహాసనాన్ని ఎక్కించాలి. 'రాముడు వీటి వెనక వుండి నడిపిస్తాడు' అనే నమ్మకం లేకపోతే— ఎవరు ఎక్కాలి ఈ సింహాసనం అనే కొట్లాటలు ప్రారంభమౌతాయి. అది తేలకపోతే ఎవరికి తగ్గ సింహాసనం వారు ఏర్పాటు చేసుకొని, ఎవరి పాదుకలు వారు ఆ సింహాసనంపై పెట్టు కుని, పూజా చేసు కుంటూ ఆత్మాభిమానాన్ని పెంపొందించుకుంటూ పులక రించి పోతూ వుండడం జరుగుతుంది. అంటే మన మందరం అనుచరులమే! అందరికీ అధినాథుడు ఒక్కడే. అని గుర్తించుకోవాలి.

1) దేవుడిచ్చిన ఈ దేహమనే రాజ్యానికి వాస్తవానికి దేవుడే నిజమైన యజమాని, అధినాథుడు, జీవుడు కేవలం దానికి ప్రతినిధిమాత్రమే అనీ,

2) 'మనదేహమనే దేవాలయానికి అధినాథుడు దేవుడే, దేహబద్ధమైన జీవుడు ధర్మకర్త మాత్రమే' అనీ— ఈ పాదుకా పట్టాభిషేక ఖండంలో వాల్మీకి సాధనా రహస్యాన్ని ధ్వనింప జేస్తున్నాడని తెలుసుకోవాలి!

"నమస్కారమ్స్ మాస్టర్ టు యువర్ లోటస్ ఫీట్"

# పా దు కా ప ట్టా భి షే క ము

## భరతుని అభ్యర్థన

భరతుడు పితృ కర్మలు పూర్తిచేశాడు. భరతునికి గల నిష్ఠకు, శ్రద్ధకు, తండ్రిపైన, అన్నగారి పైనగల గౌరవాభిమానాలకు ప్రజలు తమ హృదయాల్లోనే తృప్తిపడ్డారు. భరతుణ్ణి రాజ్యాభిషిక్తుని చెయ్య డానికి కార్యకర్తలు అభిషేచన ద్రవ్యాలు ఏర్పాటు చేసుకొని వినయ విధేయతలతో భరతుణ్ణి అర్థించారు. "ఇన్నినాళ్ళుగా మోయలేని రాజ్య భారాన్ని వశిష్ఠులవారు తప్పించుకోలేక మోయవలసి వచ్చింది. ఇక మీకు తప్పదు. సిద్ధపడండి పుణ్యజలాలతో అభిషిక్తులు కావడానికి" అని ప్రార్థించారు. ఆ అభిషేచన ద్రవ్యాలకు ప్రదక్షిణ చేసి మునిం నమస్కరించి వారితో భరతుడు—

"మీరందరూ రఘువంశ భక్తులు. రాజనీతి తెలిసినవారు. నిజానికి నేను మీకు చెప్పవలసిన పనిలేదు. ఈ రాజ్యం జ్యేష్ఠుడైన రామునిది. 'అవకాశం వచ్చింది కాబట్టి ఆ రాజ్యాన్ని మీరు కాస్త దొంగి లించండి' అన్నట్లుంది మీరు నన్నడగడం. దొంగిలించడానికి గూడా శక్తిచాలనివాణ్ణి. ఎందుకొచ్చిన పని అది ? ఈ అభిషేచన ద్రవ్యా లన్నిటినీ బండ్లమీదకు పట్టించండి. అందరూ పోయి యజ్ఞానికి అగ్ని హోత్రం తీసుకు వచ్చేటట్లు బ్రతిమాలి రాముణ్ణి తీసుకు వద్దాం పదండి. పోయే మార్గం సుగమంగా ఉండేటట్లు అన్నివిధాలైన ఏర్పాట్లు చేయిం చండి. అయోధ్యాపురవాసు లందఱికీ ఈ విషయం తెల్పండి" అన్నాడు.

"అబ్బా! ప్రజా హృదయాల లోతును చూచినవాడవు గదయ్యా! ఎంత చల్లని, తియ్యని మాట చెప్పావు." అన్నారు అక్కడున్నవారందరూ. భరతుడు నవ్వి, "చూశారా! చూశారా! ఇల్లాంటి భావం మీలో ఉంచుకుని నన్ను అభిషిక్తుణ్ణి కమ్మంటున్నారా ?" అన్నాడు. భరతుడలా అనగానే ప్రజలందరూ సిగ్గుపడిపోయి ఒకళ్ళ ముఖాలు ఒకళ్ళు చూసుకొన్నారు తమ తెలివితక్కువ మాటకు. అందరూ వెళ్ళిపోయారు. ఏర్పాట్లు ప్రారంభమైనాయి.

మరునాడు ఉదయం సౌఖశాయనికులు భరతుణ్ణి స్తోత్రాలతో మేలు కొలుపు ప్రారంభించారు. భరతుడు మేల్కొని– "ఇవి అన్నీ నాకు కాదు చెయ్యవలసింది. నేను రాజును కాను వెళ్ళండి" అని వారించి వెళ్ళి పోయాడు. శత్రుఘ్నుడు భరతుణ్ణి చూడ కలిశాడు.

అప్పుడు భరతుడు శత్రుఘ్నునితో "చూశావా తమ్ముడూ! ఈ రాచ రికపు నీతి, మర్యాదలు! రాము డరణ్యవాసం వెళ్ళాడు. అంతే! రాముణ్ణి మరచి పోయారు. నన్ను పొగడ్డం ప్రారంభించారు. మా తల్లి తెలీక కోరింది అనుకో! దానిని సమర్థిస్తూ నేను సింహాసనం అధిష్ఠిస్తానని ఎలా అనుకున్నారో వీరు ? నన్ను రాఘవేయునిగా గుర్తించలేదేమో ఈ ప్రజలు! రఘు వంశీయులనే, అయోధ్యా పురవాసులే ఇలా అపార్థం చేసుకుంటే ఇంక మిగిలిన రాజుల సంగతి చెప్పాలా, మిగిలిన దేశ ప్రజల గురించి ఊహిం చాలా ఎలా ప్రవర్తిస్తారో ? సరే నువ్వెళ్ళు ముందు సభకు. నేను ఇదిగో ఇప్పుడే వచ్చేస్తున్నాను" అన్నాడు.

సభ నిండుగా ఉంది. వశిష్ఠాది బ్రాహ్మణోత్తములు, క్షత్రియులు, వైశ్యులు, అమాత్యులు అందరితోను సభ కిటకిట లాడింది. అప్పుడు వశిష్ఠుడు పూవులున్న బంగారు పళ్ళెం పట్టుకుని భరతుని సమీపించి–

"ఇక్ష్వాకులు పరిపాలించవలసిన ఈ రాజ్య భారం దశరథుని మరణానంతరం తాత్కాలికంగా నేను మొయ్యవలసి వచ్చింది. ఇది నా వల్ల అయ్యే పనిగాదు. ఇంకెన్ని రోజులు ఈ మోయలేని భారాన్ని మోయగలను? నిజంగా మోయవలసిన రాముడు అడవికి వెళ్ళిపోయాడు.– మరి ఇంక నీకు తప్పదు. నీ తండ్రి సత్యవాక్య పరిపాలనము రాముని కెంతో నీకూ అంతే! కాబట్టి మా విన్నపాన్ని అంగీకరించి రాజై మమ్మల్ని సుఖపెట్టు" అన్నాడు.

వశిష్ఠు డా విధంగా చెప్తూవుండగా భరతునికి కన్నీళ్ళు కాలువలైనాయి. కంపిత స్వరంతో–

# భరతుని హృదయం

"ఈ రాజ్యానికి ప్రభువు అన్నగారైన రామచంద్రుడే. మధ్య నేనెవర్ని ? నన్ను పరాభవించడానికి అలా అంటున్నట్లుంది మీరు. అయినా ఆ కైకేయీ తల్లి ఏ మడిగిందో ఆ రాజు ఏమి ఇచ్చి వెళ్ళిపోయాడో నాకేం తెలుసు ? అయినా దాన్తో నాకేం ప్రసక్తి ? 'తండ్రి పోయిన తరువాత రామచంద్రుడు రాజు' నాకు తెలిసిందల్లా ఇది ఒక్కటే! అడిగినప్పుడల్లా ఆకాశంలో మేఘాల్ని సృష్టించి వర్షాన్ని పిండగలవాణ్ణా నేను ? ప్రజా భావాలనే నదుల్ని ఇముడ్చుకోగల జ్ఞాన సాగర మూర్తినా ? నా వల్లగాని పనికి నన్ను ప్రోత్సహించకండి. ఆ పయోదా కారుడైన రాముడికే చెల్లు అవన్నీ. చేతగాని పనిని, మోయలేని భారాన్ని వృథాగా 'తలపైన పెట్టుకోడం దేనికి, అటుపైన శక్తి ఉడిగి మీరు సాయం పట్టండి అని అందరి కాళ్ళా వేళ్ళా పడడం దేనికి ? ఆ రఘురాముని పాదారవింద దాసుణ్ణి మాత్రమే నేను. ఈ భూమి నా కక్కరలేదు. అనవసరంగా నన్ను పొగిడి

ములగ చెట్టు ఎక్కించే ప్రయత్నం చెయ్యకండి. రాముడు అన్నగారు. ఆపైన నేను ఆయన తమ్ముణ్ణి. ఒకవేళ—రాముడు కాదన్నా, కుదరదన్నా ఇక నేనే అర్హుణ్ణి అనే ఊహలో ఉన్నా ననుకుంటున్నారేమో ఈ ప్రజలు! రాముడు పరంధాముడైన పరమాత్మ. నేను జీవుణ్ణని మాత్రమే తెలుసు నాకు. అటుపైన మా ఇద్దరి మధ్య ఇంకే వరసా తెలీదు. అదల్లా ఉంచండి. సకలాగమవేది, వేదాంత విశారదుడు, చరితాఖిల ధర్మ పథుడు అయిన ఆ శ్రీరామునికి కొంతకాకపోయినా కొంతైనా సరిపోగల నేమోనని ఊహ చెయ్యడానికి గూడా తగనే! అంత నీచబుద్ధి గూడా లేదే నాకు ? నాతల్లి ఎలాంటి దైతే ఏం ? చేతన్సులో నా తండ్రిని సేవించినదే గద! ఆ తండ్రిని పోలి పుట్టాను. ఈ చేతస్సు సమస్త ధర్మ సేవానిధి. మరోమాట ఎందుకు ఇంక ? ఈ రెండు చేతులూ ఎత్తి నమస్కరిస్తున్నాను. అడవుల్లో ఎక్కడున్నాడో రాముడు. ఆ స్వామి పద పద్మాలకు నన్ను సమర్పించండి. నేను ఆయన బంటుని. నేను మిమ్మల్ని కోరేది, మీరు చేయ గలిగింది అది ఒక్కటే. మీరు చెయ్యవలసిందీ అదొక్కటే" అన్నాడు. సభలోని వారంతా ఒక్కసారి "మేలు! మేలు!" అంటూ ప్రశంసించారు! అవును. "మహ బాగా మాట్లాడావు" అని వృద్ధులు పలికారు. అపుడు భరతుడు మళ్ళీ ఇలా అన్నాడు.

"అరణ్యాల్లోంచి ఆ రాముణ్ణి అయోధ్యకు తీసుకు వచ్చే ప్రయత్నం చేస్తాను. ఒకవేళ నా ప్రయత్నం విఫలమైతే నేనూ ఆయనతోపాటు అరణ్యాలలోనే తిరుగుతాను. ఏం, లక్ష్మణునితోపాటు నన్నుగూడా ఆ మాత్రం గుర్తించడా ? ఇంతకు ముందే అన్ని ఏర్పాట్లు చేయవలసిందిగా చెప్పాను. ఆ రాముణ్ణి చూస్తే గాని నా ప్రాణాలు నిలవవు. ఇంక ఆలస్యం దేనికి ? ఓ సుమంత్రా! నీ సాయం తప్పదు. అయోధ్యా పురవాసులందరికీ తెలియపరచు. ఉదయాన్నే అందరం ప్రయాణం. వేగంగా వెళ్ళి రాముణ్ణి

అర్థిద్దాం. ఏమో, ఎవరు చెప్పగలరు ? మనందరిలో ఒకరివల్ల కాకపోయినా ఏ ఒకరి అభ్యర్థన వలన అయినా పని జరగవచ్చు. త్వరగా వెళ్ళ సిద్ధం కండి":

సభ ముగిసింది. అందరూ ఎవరిండ్లకు వాళ్ళు వెళ్ళారు. సుమంత్రుడు చాటింపు వేయించాడు. భరతుని అభ్యర్థనా పూర్వకమైన ఆజ్ఞను, చాటింపు విన్న ప్రజలందరూ—ఒకరితో—ఒకరు—

"నేం చెప్పలా, ఎవరూరుకున్నా భరతుడూరుకోడని. రాముణ్ణి ఎలాగైనా అయోధ్యకు తీసుకువస్తాడుచూస్తూవుండు" అని అనుకున్నారు పట్టలేని సంతోషంతో.

అందరూ ఎవరిక్కావలసిన సామాను వారు సర్దుకోడంలో మునిగిపోయారు. ప్రతి ఇల్లు ప్రయాణ సన్నాహంలో సందడిగా వుంది. మరునాడు ఉదయానికల్లా సర్వాయోధ్యా ప్రయాణమైంది.

## గుహుని గూఢాలోచన

గంగ ఒడ్డున శిబిరాలు ఏర్పడ్డాయి. అయోధ్యా పురవాసులతో, రథ, తురగ, గజ, పదాతి సైన్యంతో అక్కడ భూమంతా నిండి పోయింది. ఏనుగుల ఘీంకారాలు, గుఱ్ఱాల సకిలింపులు, ఒండొరుల స్వేచ్ఛా సంభాషణా ధ్వనులు శృంగిబేరపురానికి విన్పడ్డాయి. నిషాద రాజు గుహునకు ఒక్కసారి అనుమానం కలిగింది. తన వారితో ఆలోచించి వెంటనే దగ్గరలో వున్న చెట్టెక్కి చూశాడు. "ఎవరది, భరతుడు కాదుగదా! వనాలకు పంపించింది చాలదన్నట్లు రామునిపై దండయాత్ర సలపడం కోసం వచ్చినట్లుంది ఆ కోలాహలం అంతా. చూడాలి అసలు సంగ

తేమిటో. ఆ మహాతల్లి రాముణ్ణి అడవులకు పంపింది ఇంతకు పూర్వమేగా! ఊరునుంచి వచ్చిన ఆవిడగారి సుపుత్రుడు రాముణ్ణి ఇలాగూడా బ్రతకనివ్వ దలచుకోలేదు గావును. గుహుడున్నా డిక్కడని తెలీదల్లే వుంది. గంగ దాటింతర్వాత మాటగదా ఏదైనా. అ గంగ ఎలా దాటుతాడో చూద్దాం. అయినా భరతుడి లోపల ఉద్దేశ్యమేమిటో? తొందరపడి ఏమేమో అను కుంటున్నాను. ముందెళ్ళి అతని చిత్తాన్ని తెలుసుకోవాలి. ఒక వేళ ఏదైనా చెడ్డ తలంపుతోవుంటే గోతులు వేరే తియ్యాల్సిన పని లేకుండానే అందర్నీ ఈ యేట్లో పారేస్తాను. లేదా మంచి భావతోవస్తే మంచిదే! ఈ లోగా మీరొక పని చేయండి. గంగకు ఆ ఒడ్డున వున్న పడవ లన్నిటినీ ఇటుచేర్చి అంతగా మరీ అవసరం అయితే పగులగొట్టండి. అయినా అంతదాకా రాదనుకోండి. అవతల సుమంత్రుడు గూడా వున్నట్లు న్నాడు. సుమంత్రుడు మన పక్షమే! ఏది ఎలావున్నా నేను అక్కడికి వెళ్ళిగాని ఇదమిద్ధమని తేల్చుకొని గాని ఏ సంగతి చెప్పలేను. అక్క డేమన్నా పరిస్థితి వేరే విధంగా అనిపిస్తే మరుక్షణంలో వార్తను అందిస్తాను కూతవేసి. అప్పుడు నేను చెప్పినట్లు చేయండి. శూలాలు, బల్లాలు, కత్తులు, బాణాలతో సకల శబర, కిరాత, పుళింద, వ్యాధ సైన్యాలు తెల్లవారే వరకు ఇక్కడ ఉండవలసినది. ఇది నా ఆజ్ఞ అని చెప్పండి" అన్నాడు గుహుడు. భరతుని అసలు సంగతేమిటో తెలుసుకు నేందుగ్గాను ఇప్పపువ్వు, జారపప్పు, మత్స్య మాంసాదుల్ని, ఏనుగు దంతాలను కానుకలుగా తీసుకొని ఒకే ఒక పడవ మీద అవతలి ఒడ్డుకు వెళ్ళి తనతో వచ్చిన వారిని ఆ ఎక్కి వచ్చిన ఒక్క పడవలోనూ వెళ్ళిపొమ్మని, అనుకూల మైన వాతావరణం అయితే తనే ఈదుకు వస్తానని లేదా కూతతో సంకే తాన్ని అందచేస్తానని చెప్పి పంపించి వేశాడు. ఇంతలోనే కొందరు ఎదురు వచ్చి—

"ఏం నిషాద రాజా! రాముడే త్రోవమ్మట అడవిలో కెళ్ళాడు? మేము వెళ్ళాలి. ఈ గంగ నువ్వే దాటించాలి సుమా!" అని అడగనే అడిగారు. గుహుణ్ణి చూడగానే వాళ్ళకి ప్రాణం లేచి వచ్చినట్లయింది. ఎంతో కలుపుగోలుగా అడిగారు. కాని గుహుడు తెచ్చికోలు నవ్వుతోనే 'సుమంత్రుడు ఎక్కడ దొరుకుతాడు?' అన్నాడు. వాళ్ళు తీసుకొని వెళ్ళారు. సుమంత్రుడు కూడా గుహుని కోసమే అన్నట్లు ఎదురు చూస్తున్నాడు. గుహుడు కన్పడగానే ఎక్కడ లేని సంతోషంతో "నువ్వా! రా! రా!! ఏమిటి విశేషాలు? మన వాళ్ళంతా క్షేమమేనా? సరేగాని మన రాముడెలా వెళ్ళాడు? ప్రస్తుతం ఎక్కడున్నట్లు? ఏమైనా వార్తలుఅందుతున్నాయా? కాస్తచెప్పవయ్యా! ప్రస్తుతం అవసరం వచ్చింది." అన్నాడు. అందుకు గుహుడు—

"మర్రిపాలతో జుట్టును బంధించి ఆరణ్యక వ్రతానుసారి యైన ఒక్క రాముణ్ణి తెలుసుకునేందుకు ఇంత సైన్యం ఇంత బలగంతో రావాలా? ఇంతమందితో వచ్చిగూడా నా సహాయం కావాలా! చిత్రంగా వుందే? భయపడ్డారా ఏమిటి కొంపదీసి?" అన్నాడు.

గుహుడలా చిత్రంగా మాట్లాడగానే సుమంత్రుడు చిరునవ్వుతో— "భరతుణ్ణి చూడ్డాని కొచ్చినట్లున్నావు. అదిగో ఆ ధరాధిపతి తమ్ముణ్ణే చూద్దువుగాని ముందు" అంటూండగా శత్రుఘ్నుడు కన్పడ్డాడు.

"పృథ్వీపతి తమ్ముణ్ణి ముందు చూద్దువుగాని అంటాడు ఈ సుమంత్రుడు. తీరా చూస్తే శత్రుఘ్నుడు కన్పడ్డాడు. అయితే ధరాధిపతి అంటే భరతుడనా ఈ సుమంత్రుని ఉద్దేశం?" అని కొద్దిగా ఆలోచనలో పడ్డాడు. ఇదంతా ఏమీ గమనించకుండానే సుమంత్రుడు శిబిరంలోపలికి వెళ్ళి "దాశరాజు వచ్చాడిక్కడకు. తీసుకురానా?" అన్నాడు భరతునితో. భరతుడు వెంటనే లేచి బయటకువచ్చి—

"ఓ నిరంతర రామచంద్ర సాన్నిధ్యాభిలాషీ! రావయ్యా నీ కొఱకే చూస్తున్నాము. వచ్చి ఇలా కూర్చో" అన్నాడు. గుహుడు కూర్చుంటూనే ఈ దెబ్బతో తాను రాజు ననుకుంటున్నాడో లేదో తెలిసిపోతుందని-తనతో తీసుకువచ్చిన జారపప్పు, ఇప్పపూవ్వు మొదలైనవాటిని సమర్పించి "ఇవి నీ కోసమే తెచ్చాను. నీవు రాజువి గాదా! ఈ అడవిలో కాసిన దుంపలు, కాయలు, ఇంకా మత్స్య మాంసాలు ఇవన్నీ నీవే. తినండీ మీరంతా ఇవన్నీ. మీ ఇల్లే అనుకోండి. మోహమాట పడకుండా తినండి. ఈ రాత్రికి ఇక్కడే వుండి రేపు పోవచ్చు. మీ పరివార మంతా క్షేమమేనా?" అన్నాడు.

గుహుడలా అనగానే భరతుడు "ఈ రాత్రి మా సైన్యాని కంతకీ గూడా అతిధ్యమిస్తావా?.... నేను ఎల్లప్పుడూ తాతగారి ఇంటివద్దే వుండడం వల్ల నీతో మైత్రికి అంతగా నోచుకోలేదు. నాన్నగారు, అన్నగారే నీకు బాగా దగ్గర నేస్తాలు. నీ మాటలు మైత్రికి అర్థం చెపుతున్నాయి: మరి ఇపుడు నిన్నే నమ్ముకొని వచ్చాను. దేవనదిని దాటించాలి నువ్వు." అన్నాడు. గుహుడు విని ఆలోచిస్తూనే "అల్లాగా, మంచిదే! మీరంతా ఈ రాత్రి ఇక్కడ అతిధ్యం స్వీకరించిన తరువాత మాట గదా. రేపు వెళ్ళడ మనేది!" అన్నాడు. అదివిని భరతుడు– "సరేగాని నీ విప్పుడు మాట్లాడు మాటలతీరు చూస్తుంటే నిజంగా స్నేహంతో చెప్పినట్లుగా లేదే?" అన్నాడు.

## భరతుని ఆవేదన

సుమంత్రుడికీ అనుమానం వేసింది. "మొదటినుంచీ చూస్తున్నాను ఈ గుహుని ముఖం. ఏమిటో అనుమానిస్తున్నవాడిలా కన్పడుతున్నాడు. ఒక్క రాముని కోసం ఇంతమంది సైన్యంతో రావాలా అన్నాడు." అన్నాడు

మెల్లిగా భరతునితో. వెంటనే భరతుడు "అదంతా నా ఖర్మ. అయినా నన్ను మొదట్నుంచీ ఎవరు సరిగా అర్థం చేసుకున్నారు గనుక! అమ్మ మొదలు ఇప్పుడు గుహునిదాకా వరుసగా అందరూ నన్నపార్థం చేసుకున్న వారే గద! ఈ భరతుడెలాంటివాడో ఆ మాత్రం తెలుసుకోలేక పోయారు అంటే అదంతా నా దురదృష్టమే. ఛీ! మా తల్లి వల్ల ఈ రాజ్య పాలనాధికారం సంక్రమించటంవల్లనే కదా ఇంత ఇరకాటంలో పడ్డాను. నా మనస్సు ఆ రాజ్యం మీదకు పోనే పోదు, ఎంతసేపు ఆ రాముని పాదారవిందాల్ని తప్పించి" అని అంటూనే గుహుని వైపు తిరిగి "నన్ను మరోలా అర్థం చేసుకున్నా నీ మీద నాకు కోపం లేదు. దంతా నాలోనే వుంది లోపమంతా. నిజం చెప్పెయ్యమంటావా? ఆ స్వామిని, నా యేలికను ఆ రాముణ్ణి అయోధ్యకు తీసుకొని రావడానికి పోతున్నాను. ఇంతమందితో వెళ్తున్నామంటే అందఱూ ఆయన్ని చూడవచ్చు. ఈ అందరిలో ఎవరో ఒక పుణ్యాత్ముడి ప్రార్థన అయినా ఆ రాముణ్ణి తీసుకు రాగలదేమో అని. నీవుకూడా రా! అయినా హృదయంలోని ఈ కోర్కె, తపన నా ముఖంలో ప్రతిబింబించటం లేదా? అవునులే. మేము రాజపుత్రులం. లోపలి భావాలు ముఖంలో చచ్చినా వ్యక్తమవవు. అది మా కర్మ" అన్నాడు. అపుడు గుహుడు సిగ్గుతో స్థిమితపడి ఇలా అన్నాడు.

## గుహుని నివేదన

"అవునవును మీ గుండెలు పూర్తిగా పండి పరిపక్వ స్థితిలోనికి వచ్చేసినవి. ఇంక రావలసిన మార్పులు చేర్పులతో అవసరం లేనివి. కాని, మావి ఇంకా అంత పరిపక్వ స్థితికి రానివి. ఇంకా ఎన్నో మార్పులు రావలసినవి. నువ్వు చెప్పినట్లు మేము రాజపుత్రులం కాము. రాజ్యాలు లేవు. అయినా నాకు తెలియక అడుగుతాను ఆ రాముడు ఎక్కడ ఉంటే

అక్కడే ఉండి పోరాదా ? ఆయన్ని అయోధ్యకు తీసుకురావాలి అనే పట్టు దేనికి చెప్పు ?. నా కంటావా ఈ దాశరాజ్యం అల్పమైనా చాలా ప్రియమైందై పోయె" అన్నాడు. గుహుడలా అనగానే భరతుడతని మాట ల్లోని మర్మాన్ని గ్రహించి గుహుణ్ణి కౌగలించుకొని "నిన్ను నేను ఎఱగనా? ఎందుకలా మాట్లాడుతావు ? నీ బుద్ధి ఎంత పండి పరిపక్వ స్థితిలో వుందో నాకు తెలీదూ !" అన్నాడు. అప్పుడు సుమంత్రుడు—

" ఓయి గుహుడా! రాముని వెంట పోకుండా ఇక్కడే వుండమన్న ప్పుడు నువ్వు ఆనాడు మానావా చెప్పు నాకు? ఎందుకొచ్చిన అబద్ధాలయ్యా" అని అనంగానే గుహునికి జలజలా కళ్ళ నీళ్ళు కాలువలయాయి. భరతుని హృదయం ద్రవించింది. అప్పుడు గుహుడు భరతుని జూచి—

"నా తండ్రీ! నా ప్రభూ! ఏడవకు. నిన్ననవసరంగా అపార్థం చేసుకు న్నానుగదయ్యా! ఇప్పుడే వస్తాను. మీరంతా నా ఆతిథ్యం స్వీకరించా ల్సిందే." అంటూ ఎప్పుడు వెళ్ళాడో గంగ ఒడ్డుకు వెళ్ళి ఒక్క కూత పెట్టాడు. ఆ కూతలో ఏం సంకేతం ఉందో ఏమో అవతలి ఒడ్డు నుంచి తినుబండారాలు సమస్తంతో ఒక్కసారి ఈవలి వడ్డుకు వచ్చి పడ్డారు అనుచరులు. మరుక్షణంలో గుహుని ఆతిథ్యం స్వీకరించారు అందరూ. అందఱూ అలసిఉన్నారేమో అన్నీ తిన్న వెంటనే నిద్రలోకి వెళ్ళిపోయారు. గుహుడు కూడా భరతుని దగ్గర సెలవు తీసికొని ఇంటికి వెళ్ళాడు.

భరతునికి రాత్రల్లా నిద్ర పట్టలేదు. హృదయం ఉడికిపోయింది. గుహుడు గూడా తనని అపార్థం చేసుకున్నందుకు మరింత బాధఎక్కువైంది. ఎల్లాగో చివరకు తెల్లారింది భరతునికి. ఎప్పుడు వచ్చాడో మరి గుహుడు ఒక ఇంగుదీ వృక్షం క్రిందకు సోదరులిద్దరినీ, తల్లులు ముగ్గుర్నీ తీసుకొని వెళ్ళి, ఆ వైపుగా లోగడ రాముడు వెళ్ళిన, శయనించిన ప్రదేశము చూపిస్తూ —

"చూశారా! ఇవి నా తండ్రి పాదాలగుర్తులు, వేదాలు, ఉప నిషత్తులు, యజ్ఞవేదికలు, నిత్యమూ నా పూజలందుకునే దైవ ప్రతిమలు. ఆ రోజు స్వామి నా ఆతిథ్యం స్వీకరించకుండా కనీసం ఇంటికైనా రాకుండా వుంటే ఈ ప్రదేశంలో ఆయన పాదాలు స్పృశించి ముద్రించే అవకాశాన్ని కల్గించుకున్నాను. ఆ ప్రక్కనే శయనించాడు నా స్వామి ఆ రోజు" అంటూ అంతకు మునుపు సీతారామ లక్ష్మణులు వచ్చినప్పటి సంఘటనలను గుర్తు చేస్తూ ఇంకా చెప్పసాగాడు.

"రాత్రికి ప్రభువు ఎంత ప్రతిమాలినా నా ఆతిథ్యం స్వీకరించలేదు. కేవలం నీళ్ళు మాత్రం త్రాగి పడుకున్నాడు. సౌమిత్రి రామ పాదసేవలో నిమగ్నమైపోయాడు. రాముని చెయ్యి సీతమ్మకు తలగడ, సీతమ్మ వక్షం రామునికి తలగడ. అలా ఆదమరచి నిద్రిస్తున్నారు. ఆ తల్లి దండ్రులకు నిద్రా భంగం కాకుండా నేను, లక్ష్మణుడు, సుమంత్రుడు కొంచెం దూరంగా పోయాము. నిరాహారుల మైన ముగ్గురము ఏవేవో రహస్యాలు మెల్లిగా చెప్పు కున్నాం. లక్ష్మణ్ముడు మాతో మాట్లాడుతున్నాడన్న మాటే గాని రెండువేల కళ్ళతో ఆ స్వామిని కనిపెడుతూనే వున్నాడు. ఏమైనా నిద్రా భంగ మౌతుందేమోనని, దూరంగావుండి నిరీక్షిస్తూనే రక్షరేకులా పరిరక్షిస్తున్నాడు. అప్పుడు నేను "ప్రభూ! లక్ష్మణా! ఎలాగూ రేపటినుండి నీకు తప్పదు గదా ఈ రక్షణ, నీ నిరీక్షణ! ఇవాల్టికి నిద్రపో, నేనున్నాను కదా! చూచుకుంటాలే!. గుక్కెడు నీళ్ళు గూడా పుచ్చుకోలేదు, కనీసం కంటికి నిద్రైనా పో!" అన్నాను. అప్పుడు లక్ష్మణుడు ఏమన్నాడో తెల్సా?

## లక్ష్మణుని ఆందోళన

"నాకా నిద్ర వచ్చేది? ఎలా వస్తుందనుకున్నావయ్యా? అవతల పడుకున్నది ఎవరనుకున్నావ్? వదిన నా దేహం, అన్న నా ప్రాణం,

ఎక్కడో, అంతఃపురంలో— హంసలు ఆడుతూ వుండగా అలవోకగా ఊడిన రెక్కల్ని ఏకి కుట్టించిన పరుపుపై— సమస్త సుగంధ ద్రవ్య పరిమళాల మధ్య పవళించవలసిన వారు అలా కటిక నేల మీద పడుకుని ఉంటే నాకు నిద్ర ఎలాపడుతుంది? అన్నమెలారుచిస్తుంది? దీనికితోడు అవతల ఇంటివద్ద తండ్రి ఎలావున్నాడో, తల్లులెలా వున్నారో, వూహించడానికే భయంగా వుందే.... అదేమి సావాసమో! నేను, అన్న ఎలా వుంటామో, భరతుడు, శత్రుఘ్నుడు అల్లా వుంటారు. ఈ జంటలు విడదీయలేనివి. అయినా ఏదో భయం. ఎవరు చెప్పగలరు? ఏ హేతువు ఎవర్ని ఎలా ఏడిపిస్తుందో, ఎవర్ని ఎలా చెడగొడ్తుందో అని ఒకటే ఆలోచనతో నాకిక ఏమీ తోచకుండా లలాటం ఉడుకెక్కుతోంది. అన్నాడు. అలనాటి ఆ సౌమిత్రి కోపం సముద్రపు పోటులా ఎంత భీకరమో తెల్పింది. ఆ పోటు ఎంత భీకరమో అటు అంత సౌమ్యమూ అన్నట్లు ఆ కోపరేఖను బిగించి పట్టినది ఈ చింతారేఖ. ఈ రెంటితోనూ లక్ష్మణుడు అన్నగారితో అడవులకు వెళ్ళాడు. అటువంటి లక్ష్మణుడు వెంట వెళ్ళాడు. ఇక పర్వాలేదు, అనుకొని నేను ఆరోజు రామునితో పాటు వెళ్ళలేదు గాని లేకపోతే నేను రామునితో వెళ్ళి పోకుండా ఇక్కడే ఉండిపోతానా? అన్నాడు. లక్ష్మణుడా రోజున అన్న మాటలు గుహుడు చెప్తుండగా వింటున్న భరతుడు మూర్ఛ పోయాడు. తల్లులు ముగ్గురూ భరతుని దగ్గఱకు చేరారు. అప్పుడు కౌసల్య ఇలా అన్నది.

"కన్నకొడుకు అడవులపాలైనా, చేసుకున్న భర్త అమరలోకం పోయినా ఇంకా ఇలా బ్రతుకుతున్నానంటే కారణం నిన్ను చూపెట్టుకొనే గదయ్యా! నాకూ, సర్వాయోధ్యకు ప్రాణం నీవొక్కడవు. మళ్ళీ ఈ అయోధ్యా రాజ్యానికి మరో ప్రళయాన్ని సృష్టించబోకురా నాయనా! కళ్లు తెరవరా తండ్రీ! మీరు నల్గురు అన్నదమ్ములు, కాని నాకు మీరందరూ ఒక్కటే! నాకు ప్రాణాలు సడలుతున్నాయి లేవరా నాయినా!" అంటూ ఏడ్చింది. అప్పుడే స్పృహవస్తూ ఆ మాటలను చూచాయగా విన్న

భరతుడు "నాది–రాముని తల్లి ప్రాణాలు నిలబెట్టగలజన్మ అన్నమాట! నా యీ పాడు బ్రతుక్కి రామునితల్లిని బ్రతికించగల విలువ ఉన్నదంటే తప్పకుండా బ్రతికి తీరుతాను" అని అనుకుంటూ కౌసల్యను చూచి–

"అమ్మా, మరేం భయంలేదు. ఏదో పైత్య ప్రకోపంవల్ల ఇలా అయింది. అంతే" అంటూ తన మెడ చుట్టు ఉన్న కౌసల్య హస్తాల్ని మృదువుగా పట్టుకొని లేచాడు. లేస్తూనే ఎదురుగావున్న గుహుణ్ణిచూస్తూ–

"ఓయీ స్నేహితుడా! లక్ష్మణుడు ఎంత అమృత హృదయుడయ్యా! ఎంతటి మిత్రభావాన్ని వ్యక్తం చేశాడు సుమిత్రా తనయుడు! నిజమే! సీతా పరిచర్యకు నోచుకున్న సాధుచిత్తంగల్గిన ఆ లక్ష్మణుడలా వ్యక్తం చేయగలిగాడంటే ఆశ్చర్యమేముంది? నా బరువు తాను మోస్తున్నాడు లక్ష్మణుడు. వేయి జన్మలకు సరిపోయే అప్పు పెట్టాడు నాకు. ఇక లాభం లేదు. ఆ బరువుదించి నేనెత్తుకోవాలి. సరే! చెప్పు అటుపైన కథ! వింటూ ఈ గుండెల్లో కత్తులు పొడుచుకున్నట్లు శిక్షించు కుంటాను" అన్నాడు. అప్పుడు దాశరాజు–

"నా ఎడదలోని బల్లాలతో నీగుండెను చీల్చిక్లేశపెట్టాను ఇంత వరకూ" అన్నాడు. కళ్ళనీళ్ల కట్టలు తెగి ప్రవహించాయి. "అటుపైన జరిగింది చెప్పు" అన్నాడు భరతుడు.

దాశరాజు– "ఏముందీ, అటుపైని స్వామి మర్రిపాలు తీసుకురమ్మ న్నాడు. లక్ష్మణుడు తెచ్చాడు. ఇద్దరూ జటలు బిగించి కట్టుకున్నారు ఆ పాలతో. అంతే! ఆ ముగ్గుర్నీ గంగ దాటించాను." అంటూ సమయోచితంగా కథను ముగించేసి– "ఆ ముగ్గుర్నీ అటుపైన గంగను దాటించినవాణ్ణి నేనే! ఈ నా చేతుల్ని నరికెయ్యి. ఇవే వాళ్ళని గంగను దాటించాయి. కంటికి కన్పడేంత వరకు వాళ్ళు వెళ్ళిన వైపు అలా చూస్తూ

నిల్చుండి పోయాను. తోడుగా సుమంత్రుడు మిగిలాడు. ఏదో వంక బెట్టి మూడు రోజులాపాను– వియోగ భాధను ఒక్కణ్ణి భరించలేక. ఇప్పుడు రాముణ్ణి తీసుకు రావడానికై నిర్ణయించుకున్న మీ రాకతో నా యీ వియోగ దుఃఖ సముద్రానికి ఒక ఒడ్డు ఏర్పడుతుందా అన్న ఆశ కలుగు తోంది." అన్నాడు– అప్పుడు. భరతుడు

## భరతుని సేవ

"ఓయీ గుహుడా! లక్ష్మణుడూ, నువ్వూ రామచంద్రునికి పూవు లుగా మీ జీవితాన్ని సమర్పించుకున్నారు గదయ్యా! ఇక నేను చేయ వలసిందేమిటి? ఆ రాముని నేలను దొంగిలించటం ఒక్కటి నాకు మిగి లింది. 'చేసుకున్నవారికి చేసుకున్నంత మహాదేవా !' నాకక్కరలేని ఈ భూమిని నా కంటగట్టజూచి, నాకక్కఱకొచ్చే రాముని దయ నాకు కాకుండా చేశాడు తండ్రి. నేను నా తాతల ఇళ్ళ అంగళ్ళలో అమ్ముడు పోయాను. మీరు నా భాగమైన రామ పరిచర్యను సొమ్ము చేసుకున్నారు. కానీండి" అంటూ సీతారాములు శయనించిన చోటుకు తల్లుల్ని పిలిచి–

'ఇవి నా తండ్రి పాదాల చిహ్నాలు. వేదాలు, ఉపనిషత్తులు. యజ్ఞ వేదికలు. ఇక్కడే నా తండ్రి నిద్రపోయాడు' అంటూ అక్కడ ఉన్న పాద ముద్రలను స్పృశిస్తూ వంటికి రాసుకొన్నాడు. లోగడ లక్ష్మణుడు రాముని భౌతిక శరీర స్పర్శతో సేవా సుఖాన్ని పొందాడు. ఈ రోజు భరతుడు పాదాంకాలనుస్పృశిస్తూ సేవాసుఖాన్ని పొందుతున్నాడు.(శ్రీరాముడు తురీయావస్థకు, లక్ష్మణుడు జాగ్రదవస్థకు, భరతుడు స్వప్నావస్థకు, శత్రు ఘ్నుడు గాఢ సుషుప్తికి ప్రతీకలు. అందుకే ఆ లక్ష్మణుడు రాముని భౌతిక మైన పాదాలను స్పృశించి సేవించుకున్నట్లు, ఇప్పుడు భరతుడు రాముని

పాదాంకాలను స్పృశిస్తూ సేవిస్తున్నట్లు చెప్పబడినది.) ఆ రాత్రి భరతుడు నీరు త్రాగి, రేయెల్ల రామ పాదాంక సేవలో గడిపాడు. అది చూచిన తల్లుల కళ్ళనీరు ప్రవహించింది. ముగ్గురూ "నాయనా! శ్రీరాముని పాదాలు ఒత్తావు. అతడు నిద్రించాడు. నీ సేవ నచ్చిందయ్యా రామునికి! ఇంకలే!' అంటూ శత్రుఘ్నుని చూసి. 'నాయనా! నువ్వు నీ అన్నగారి చెయ్యిపట్టుకొని తీసుకురా! ఇక్కడే గుండె పూర్తిగా నీరు కారిపోతే ఎలా? అవతల అసలైన పని వుంది. కానలోనికి వెళ్ళాలి' అనంగానే శత్రుఘ్నుడు భరతుని తోడ్కొనివచ్చాడు. పగలల్లా రాముని అరణ్యవాసం గురించే ఆలోచించాడు. సూర్యాస్తమయ సమయానికి కౌసల్య ప్రేమతో నిర్బంధపెట్టి పెట్టిన నాలుగు మెతుకులు ఎంగిలి పడ్డాడు భరతుడు.

ఆ రాత్రి భరతుడు ఒంటరిగా వున్న సమయం చూచి, కైకేయి- "జాగ్రత్త బిడ్డా! రాముడు చాలా గంభీరుడు. చిన్న చిన్న ఉపాయాలతో, అభ్యర్థనలతో వస్తాడనుకుంటున్నావేమో! నీ ప్రశ్నలన్నిటికి అన్నీ చెప్పి నిన్నింటికి త్రిప్పి పంపిస్తాడు. 'నువ్వే రాజువి నాకు రాజ్యం అక్కర్లేదు' అని నిక్కచ్చిగా చెప్పు. అ మాటమీదే నిలబడాలి" అంది — దానికి భరతుడు- 'నీవు చాలా బుద్ధి కౌశలంతో చెప్పావ్. వనాలకు పంపించగలిగినా తిరిగి రప్పించగలిగినా నీ బుద్ధికే తగును. అదీ నీ ధీచాతురి' అని అంటుండగానే కౌసల్య అక్కడకు రావడంతో ఆ ప్రస్తావన అక్కడకు ముగిసింది.

రాత్రంతా రాముణ్ణెలా తీసుకువద్దామా, ఎలా ప్రారంభిద్దామా అనే ఆలోచనతో నిద్రపోలేదు భరతుడు. మరునాడుదయం గుహుడు తెచ్చిన నావల్లో ఎక్కారు. గంగదాటుతుండగా-

"ఓ గంగమ్మ తల్లీ! మా మీద నీకు దయ కల్గుతుందా? యమున మా సూర్యవంశపు ఆడపడుచు. నువ్వూ, ఆమె చెట్టాపట్టాలు వేసుకుని పరుగెత్తే ఇష్ట సఖులు. అట్లాంటి నీ స్నేహితురాలి వంశస్థులమైన మా పైన కరుణించి ఆ శ్రీరాముణ్ణి తీసుకురాగల్గేట్లు చూడవమ్మా!" అన్నాడు భరతుడు.

అందరూ ఒడ్డుకు చేరారు. సమస్త సంబారాలతో, రథాలెక్కి బయల్దేరారు గుహుని వద్ద శెలవు తీసుకొని. దూరంగా భరద్వాజ ఆశ్రమం కన్పడంగానే క్రోసెడు దూరంలోనే ఎల్ల సేనను ఆపి అక్కడే వుండమని. భరతుడు, వశిష్ఠుడు, సుమంత్రుడు ఆశ్రమానికి దారితీశారు.

వశిష్టులవారిని చూడంగానే భరద్వాజముని పట్టరాని సంతోషంతో—"ఓయీ గాలవ! ఓయీ కాశ్యప! ఎక్కడున్నారు, త్వరగా రండి. ఈనాడు మన తపస్సు ఫలించింది. సాక్షాత్తు ఆ మహేశ్వరుడే కరుణించి మన ఆశ్రమానికి వచ్చాడు. తీసుకురండి వశిష్ఠులవారికి అర్ఘ్యపాద్యాలు."అన్నవెంటనే బిలబిలమంటూ శిష్యగణం చుట్టుముట్టారు. వశిష్ఠునికి అర్ఘ్యపాద్యాలు పూర్తి చేసి ఆయనతో వచ్చినవాడు భరతునిగా తెలుసుకొని – యోగక్షేమాలు అడిగాడు. భరతుడు భరద్వాజుని పాదాలకు తన శిరస్సునాన్చి స్వామీ ! మీ దయవల్ల, మీ తపః ప్రభావం వల్ల సర్వమూ భద్రమే ! మరి మీ శిష్యులు, మీ ఫలవృక్షాలు, ఆశ్రయించుకొనివున్న జంతువులు అన్నిటికి క్షేమమే గద!' అన్నాడు అప్పుడు, భరద్వాజుడు–

## భరద్వాజుని చమత్కారం

"ఆఁ! అందరికీ కుశలమే! అదిసరేగాని నువ్వు ఇలా వచ్చేశావు, మరి అవతల రాముడు అరణ్యాలకు వెళ్ళాడు గదా! దిగంతాలకు వ్యాపించిన

రాజ్యానికధికారివి. నీకేం తక్కువ ఇప్పుడు ? ఇలా రావలసిల అవసరం ఏమిటో? పైగా చూడొస్తే సైన్యాన్ని ఎక్కడో దాచివచ్చినట్లుంది. అడవులు పట్టిన రాముడు నిన్నేమన్నా చేస్తాడనా ఈ విధంగా చెయ్యడం ? లేకపోతే రాజ్యాన్ని నిష్కంటకం చేసుకోవాలనే తలంపుతో ఇలా వచ్చావా ? అయినా నీ పిచ్చిగాని రాముడు నీ వశమౌతాడా ? ఎందుకొచ్చిన పని ఇది. నీకు రాముడు చిక్కడు. నీవు చిక్కించుకోలేవు.... ఏం అలా బిక్కమొగం పెట్టావు. మీకు ఇలాంటి నీచభావం కలుగుతుందా, మీ రఘువంశ గౌరవం నాకు తెలియనిదా? నాయనా! రాముణ్ణి పీఠమెక్కించ టానికి గాదూ ఈ సన్నాహమంతా నాకు తెలుసులే! నీవు పరమ సాత్త్వికు డవు. దాసీది ఇంత చేసిందిగాని, రాముడంటే నీకు సిగలో పూవని నాకు తెలీదూ! అయినా ఇక్కడ వుండమంటేనే వినకుండ వెళ్ళిపోయాడు. నీవు అలాంటివాణ్ణి తెస్తానంటున్నావు, ఆలోచించుకో మరి" అన్నాడు.

## భరద్వాజుని విందు

భరద్వాజుని మాటలకు క్రిందామీదా పడ్డట్లైంది భరతునికి. చివరి దాకా ముని చమత్కృతికి గురి అయ్యాడు. అప్పుడు భరద్వాజుడు మళ్ళీ "ఏం చాదస్తుడివయ్యా! ఎక్కడో సైన్యాన్ని అట్టేపెట్టి వస్తావా? అన్నగారి పైన నీకున్న సౌహార్ద్రం, గౌరవాలకు నాకు చాలా ఆనందంగా వుంది. ఈ నీకు తగిన ఆతిధ్యమిస్తాను అరణ్య మధ్యంలో వెజ్జిబ్రాహ్మడు ఇంత సైన్యా నికేం ఆతిధ్యం ఇస్తాడనుకోబోకు. వెళ్ళి వెంటనే సమస్త సైన్యాన్ని తోడ్కొ నిరా!" అని అంటూనే అగ్నిగృహం ప్రవేశించి తన తపశ్శక్తి చేత సమస్త అధిదేవతల్ని ఆవాహనచేసి భక్ష్య, భోజ్య, చోష్య, లేహ్య, పానీయాదు లన్నిటినీ, ఎవరు ఏది కోరితే అవి వెంటనే సిద్ధించేట్లు ఏర్పాట్లు చేశాడు.

అందరూ తిన్న తరువాత ముత్యపు భస్మంతో తమలపాకు లందిస్తూ, సంగీత, నృత్య గానాలాపనలతో అప్సరసలు అందరినీ ఆహ్లాదపరిచారు. పన్నీరు జల్లారు. వింజామరలు వీచారు. రాత్రి ఇట్టే గడిచిపోయి తొలిసంజ ఎఱ్ఱదనం చిగురించింది. అందరూ మత్తులో మునిగి నిద్రా ముద్రితులై నేలమీద పడివున్నారు. (నేటి శాస్త్రజ్ఞులు శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలను అన్నిటినీ జయించలేదు, వాటిని తమ అధీనంలోకి తెచ్చుకోలేదు. కేవలం శబ్దాన్ని ఆడియో క్యాసెట్టు రూపంలో, రూపాన్ని వీడియో క్యాసెట్టు రూపంలో జయించి కేవలం తమ యంత్రాధీనంలో పెట్టుకోగలిగారు. పూర్వం భారతీయ ఋషులు ఈ ఐదింటినీ జయించి తమ మంత్రాధీనంలో పెట్టుకోగలిగారు. భరద్వాజుడు ఇచ్చిన విందులో ఈ విషయాన్ని సమన్వయ పరచుకోవాలి.) భరతునికవేమీ పట్టినట్లు లేదు. సరాసరి మునిదగ్గరకు వెళ్ళి నిలబడ్డాడు.

"నా ఆతిథ్యము మీవాళ్ళందర్నీ తృప్తి పరచినట్లేనా?" అన్నాడు ముని. భరతుడు భక్తివినమ్రతలతో– స్వామి! నేను మళ్ళీ నోరుపెట్టుకొని చెప్పాలా 'బావుంది తృప్తి పరచింది' అని, మావాళ్ళు రాచనగరులోనే ఇటువంటి విందు తినలేదన్నంత తృప్తిగా, ఉత్సాహంగా, వచ్చిన పని గూడామరచిపోయినంత మత్తులోమునిగివుంటేను! వాళ్ళపరిస్థితి చూస్తూంటే. మా వాళ్ళు ఆశ్రమం కదిలి నాతో వస్తారనుకోను, ఎందుకు నన్ను పరీక్షిస్తారుస్వామి? ఎందుకింక ఆలస్యం? నాకింక రాముని త్రోవ చూపండి." అని ప్రార్థించాడు. భరద్వాజుడు భరతుని ఏకాగ్రతకు, పట్టుదలకు లోలోపలే సంతోషించి... "ఇదిగో! ఈ గంగ ఒడ్డమ్మటే ఒకటిన్నర యోజనాల దూరం, ఈఅడవి వెంబడేపొండి. అప్పుడు చిత్రకూటం కన్పడుతుంది. అక్కడ మన రాముణ్ణి మీరు చూడగలరు. పోని ఈ రాత్రికి కూడా ఇక్కడ ఉండి రేపు పోరాదూ" అన్నాడు. వెంటనే భరతుడు–

"స్వామీ! మీకు తెలియనిదేముంది? చాలా దూరం పోవాలి అని మీరేగదా చెప్తున్నారు. శ్రీరాముడేం చేస్తున్నాడో? ఎలావున్నాడో? ఈ గుండెకు ఆ రాముణ్ణి చూసేవరకు తీరికలేదు. ఇక నన్నేం చెప్ప మంటారు, సర్వం తెలిసిన మీరు?" అన్నాడు. భరద్వాజుడు చాలా సంతోషించి "సరే! వెళ్ళండి!" అని ప్రసాదమిచ్చాడు. అంతలోనే ప్రయాణం అని తెలియగానే ముగ్గురు రాణులు అక్కడకు వచ్చి మునికి పాదపూజ చేశారు. కైకేయీ తనయుడైన భరతుడు తన తల్లీవాళ్ళను చూచి కొంచెం సిగ్గుతో ముఖం క్రిందకు దించుకోగా- భరద్వాజుడు, నాయనా భరతా! మీ తల్లులపేర్లు తెలుసునేగాని ఎవరెవరో నాకుతెలియదు. చెప్పు నాయనా" అనగానే భరతుడు కొద్దిగా కౌసల్యదగ్గరగా వచ్చి నిల్చి మునీంద్రునికి నమస్కరించి-

## తల్లుల పరిచయము

"సుబాహు ప్రాణహరుడు, హరధనుర్భంగకారుడు, హరికోదండ శక్తిగ్రహీత, క్షత్రియ ధర్మరక్షా విలాసత్యాగి, తరుణ వానప్రస్థధర్మరాగి అయిన ఆ రామచంద్ర ప్రభువును కన్నతల్లి, దశరథ భూపాలుని పట్ట మహిషి ఈయమ్మ కౌసల్య. తన కొడుకు అరణ్యాలు పట్టిన నన్ను చూడంగానే తన కొడుక్కీ నాకు భేదం తోచని ఈవిడ సౌజన్యం, సుమనసత్వం ఇంతటిదని చెప్పగలమా! ఇలాంటి అమాయకురాలగు తల్లి ఎక్కడైనా ఉంటుందా" అని కౌసల్యాదేవి చేతులలోకి వాలిపోయాడు. ఆయమ్మ భరతుని శిరస్సుని ప్రేమతో ఆఘ్రాణించింది. అప్పుడు భరతుడు సుమిత్రా పాదారవిందాలకు నమస్కరించి-

"కొడుకు అరణ్యాలపాలై భర్త పోయినపుడు ఒక్క కౌసల్యకు మాత్రమే కాక సర్వాయోధ్యకు, అందలి నగరవాసులకు అండగా, అంబగా నిల్చినట్టిది; అన్నగారు రామచంద్రునితోను, నాతోను సమానమైన స్నేహాన్ని పంచుకొనేట్టుగా కవలపిల్లల్ని కన్నతల్లి, ఈయమ్మ సుమిత్రా దేవి", అని చెప్పి తల్లి కైకేయి వంక చూచి వెంటనే చూపు మరలించి చూడనట్టు, మాటలాడక నిలుచుండి పోయాడు. అప్పుడు ముని నవ్వి— "నీవు చెప్పక పోయినా ఈమె గుఱించి నాకు తెలుసులే. ముగ్గుఱిలో ఇద్దర్ని గురించి చెప్పావ్. ఇంక మూడవ ఆమె గుఱించి నువ్వు చెప్పినా చెప్పక పోయినా తెలుస్తుంది. అయినా నువ్వు ఈమె గుఱించి చెప్పడానికి ఎందుకో బిడియ పడుతున్నావు, అయితే నేను చెప్తాను విను—

"దేవదానవయుద్ధంలో దేవతలకు సహాయంగా వెళ్ళిన మీ తండ్రి దశరథునికి రథ సారథ్యం వహించడమే కాకుండా, ఆయన ప్రాణాల్ని రక్షించినది, మంత్రాంగంలో చక్కని సలహాల్నిచ్చి రహస్య మంత్రిగా అండగా నిలిచినది, శ్రీరాముని చేత ప్రప్రథమంగా ధనువు చేపట్టించినది. తనతో ఎక్కువ చనువుగావున్న రాముణ్ణి పెంచి, పోషించి, లాలించిన దైనప్పటికి దేవకార్య సంధానకర్త్రి కావల్సివచ్చి తనచేతుల్తోనే గంపెడు దుఃఖం గుండెలోకుక్కుకుని అడవుల్లోకి రాముణ్ణి పంపించినది, ఆమె నీకు గౌరవనీయురాలుకాదా! ఏమిచేసినా తల్లి పూజ్యురాలేనే? నీకు శరీరాన్నిచ్చింది, మరి ఆయమ్మకు తిరిగి ఏమి ఈయగలవో ఆలోచించుకుని అటుపైన ఏమన్నా చెప్పేదుంటేచెప్పు.... సరేలే బాధపడకు. అంతా సంతోషంగా సుఖవంతంగా అవుతుంది. రాముని దయ పొందగలవు. వెళ్ళిరండి" అన్నాడు. ముని వాక్యాలకు భరతుని హృదయంలో ఏమన్నా మాలిన్య భావం వుంటే అదికాస్తా క్షాళనం అయింది. ముడి విడివడింది.

భరతాదులు ముందుకు సాగిపోతుండగా కైకేయి వెనక్కివచ్చి భరద్వాజుని పాదాలకు నమస్కరించి చీరకొంగు కన్నుల కద్దుపెట్టుకొని వెక్కి వెక్కి ఏడ్చింది. అప్పుడు భరద్వాజుడు— "ఓయమ్మ, ఎందు కమ్మా! ఏడుస్తావు? నీవు కోరావా ఇది వెట్టిదానా? నీ ద్వారా దేవతల పని జరిగితే నీ వల్ల అయిందని బాధపడ్తావెందుకు అనవసరంగా? సకలము కర్మాధీనము. ఎప్పుడు ఏది ఎలా ఎవరిద్వారా జరగాలో అలా జరిగితీరాల్సిందే. నువ్వా నేను ఆపితేను, ఆపకపోతేను ఆగేది ఆగక పోయేదిగాదు. ఈ విషయం తెలియనివారికి నీ ద్వారా జరిగిన ఈ పని విపరీతంగా తోస్తే తోచవచ్చు. దేవత లీ పనికి హర్షిస్తారు. తెలియని మానవులు గర్హిస్తారు. నీ వేది కోరుకుంటావో నీ యిష్టం ఆపైన" అని ఓదార్చాడు. ముని పాదాలకు నమస్కరించి కైకేయి వడిగా నడచి పుత్రా దుల్ని కలిసికొన్నది.

## భరతుని జాగ్రత్తలు

సైన్యమంతా ఆ రఘురామ దర్శనోత్సాహంతో వడి వడిగా ముందుకు సాగిపోతోంది. చిత్రాల్లో రామచంద్రుడే లగ్నం కాగా పదిరోజులదే విధంగా నడుస్తూ సైన్యమంతా చిట్టచివరకు తాము చేరిన ప్రాంతాన్ని బట్టి తామొక ఆశ్రమ ప్రాంతానికి చేరుకున్నట్లు గ్రహించారు. అప్పుడు భరతుడు వశిష్ఠుని ముఖంచూచి— తాతగారూ! చూడండి, మనం చేరుకున్న ఈ స్థలం ఆనాడు భరద్వాజులు చెప్పిపంపిన గుర్తులకు సరిపోవటం లేదూ! ఇంత రమణీయంగా ఈ ధాత్రీమతల్లి విస్మాత్నవధూటివలె వున్న దంటే అన్నగారు ఈ ప్రాంతాల్లో వుండి వుండవచ్చునన్న కారణం తప్ప మరొక కారణం నాకు తోచదు. నాయనా శత్రుఘ్నా! నువ్వొకపని చెయ్యి. ఈ సైన్యాలన్నింటినీ ఈ ఆశ్రమ ప్రాంతానికి దూరంగా తీసికొని

వెళ్ళు. లేకపోతే అన్నగారు శ్రీరామునికి ఇదంతా గందరగోళంగా తయారై విసుగు రావచ్చు. మనమీద అనుగ్రహం బదులు ఆగ్రహం గూడా రావచ్చు. శ్రీరాముని అనుగ్రహానికి పాత్రులమైన తరువాత గాని ఈ సైన్యం ఆశ్రమ వీధులు త్రొక్కరాదు. ఆ సీతా మహాతల్లి పాదస్పర్శకు పునీతమైన ఈ ప్రదేశం రామానుగ్రహానికి నోచుకోని వారివలన కలుషితం కారాదు." అన్నాడు.

అప్పుడు శత్రుఘ్నుడు ఎల్లసేనను దూరంగా విడిచి, చురుకైన వేగరులను కొందర్ని పిలిచి తాము చేరినది రామచంద్రుని ఆశ్రమమేనా కాదా ? అయితే రామచంద్రుడున్న అసలైన నివాస ప్రదేశం ఎక్కడున్నదీకనుక్కొ రమ్మని పంపించాడు. వెళ్ళివచ్చిన వారిలో ఒకడు "స్వామీ! చూడండి. అటువైపు ఆ కన్పడుతున్న చెట్ల గుబురులపైనుండి పొగ వస్తోంది. అది హోమ ధూమంలా మాత్రం లేదు". అని అన్నాడు. భరతుడు చూచి దాన్ని వంటింటి పొగగానే గుర్తించి "అయ్యో పాపం, వీళ్ళకెంత అవస్థ రోజూ! భూజాత సీతామహాతల్లి ఉండడంవల్ల ఆశ్రమం చుట్టూ చాలా దూరం వరకు ఈ అరణ్య ప్రాంతమంతా ఎండని, కనీసం వాడని మహా రుహాలతోను, మొక్కలతోను నిండివుంది. ఇంక రోజూ పొయ్యిలోకి ఎండు పుల్లలెలా తెస్తున్నాడో, ఎంత దూరం వెళ్ళాల్సివస్తోందో ఆ లక్ష్మణునికి. దొరక్కపోతే ఆ తల్లి ఆ పచ్చి వంటచెఱకుతో పొయ్యి మండక, కళ్ళు మండించే పొగతో ఏం అవస్థ పడ్తోందో, అని బాధ పడ్డాడు.

భరతుడు వేగరి చేత సుయజ్ఞుని పిలిపించి– "అన్నగారికి నీకూ ప్రాణస్నేహం. నాకు అన్నగారు ప్రాణం కాబట్టి నా కోర్కెగూడా నువ్వే మన్నించాలి. ఇప్పుడే జానకీదేవి వంటింట్లోంచి ఎగప్రాకిన పొగను చూచి వచ్చాడు మనవాడొకడు. నేను ముందు వెళ్తే ఏమౌతుందో? నీవు వెళ్ళి

ఇది నిజమౌనో కాదో, అన్నగారు, సీతా లక్ష్మణులు అక్కడున్నారో లేదో, రాముని కంటబడకుండా చూచి రావయ్యా నాకోసం. రామునితో నాకు ముడి. రాముడయోధ్యకు రాకపోతే నేను రాను. ఈ మునిపల్లె లోనే వుండిపోతాను. నా సేవలు తిరస్కరిస్తే ఈ అడవిలోని మృగాల్లాగే నేనూ నివసిస్తాను. ఎలాగూ ఈనెలనాళ్ళూ ఒంటిపూట భోజనాల్తో శరీరం కృశించింది. నిత్య స్నానాలతో తైలసంస్కారం లేక తలగూడా జడలు గట్టింది. ఆరణ్యవ్రతానికి ఇంక ఏమిలోటు ? కాబట్టి తొందరగా వెళ్ళి అసలు సంగతి తెలుసుకొనిరా" అన్నాడు.

సుయజ్ఞుడు నవ్వుతూ "ఈ చిత్రకూటంలో లేకపోయినా నీ అన్నను నీకు చూపిస్తే నాకేమిస్తావు?" అనంగానే- "నీవు అన్నకిచ్చే చనువు నాకూ ఇస్తున్నావు. మరి నీకు ఏమి ఈయిగలనో?" అన్నాడు భరతుడు. సుయజ్ఞుడు పొగవచ్చే ప్రదేశానికి వెళ్ళివచ్చి– "అది నిశ్చయంగా మనవాళ్ళున్నచోటే" అన్నాడు. అలా అన్నాడో లేదో వెంటనే భరతుడు ఉన్న పళాన లేచి సుయజ్ఞుని కౌగలించుకొని "అయితే నీవు అన్నగారితో మాట్లాడావా ? మా వదినగారు కన్పడిందా ? ఏమన్నారు వాళ్ళు?" అన్నాడు. అందుకు సుయజ్ఞుడు– 'ఎంత వైదికుణ్ణయితే మాత్రం అన్నగార్కి కన్పడతానా ? ఆయనగారు అడవికొచ్చేటప్పుడు నా మాట విన్నాడా? నా సంగతి ఏమన్నా పట్టించుకున్నాడా ? నాకు చాలా కోపంగా వుంది. ముందు నువ్వే వెళ్ళి కనపడు. కాస్త కోపం చల్లారాక చూస్తాను ఆపైన". అనగానే భరతుడు "వాళ్ళు నిన్ను చూడకుండా, నీవు వాళ్ళని చూడకుండా మరి ఇంక ఎలా గుర్తుపట్టావయ్యా అది మనవాళ్ళ ఆశ్రమమేనని ?" అన్నాడు. అప్పుడు సుయజ్ఞుడు—

"ఆనాడు జానకి దాల్చిన ఆ చీరే చెట్టుకొమ్మకు ఆరవేసివుంది. తెరిచిన సింహం నోరులా ఒక ప్రక్క సౌమిత్రి క్రూర చాపం వ్రేలాడుతోంది

చెట్టుమీదనుండి. ఇంకొక చెట్టుమీద వివాహ సమయంలో రామునిచే ధరింపబడిన పాదుకల మణికాంతులు తళుక్కుమన్నాయి. వాకిటముందు ఆ వైదేహి పెట్టిన రంగవల్లులు కన్పడ్డాయి. నిర్మించి మాసంగూడా కాలేదేమో పర్ణశాల గోడల మట్టిముద్దల్లో పచ్చి ఇంకా ఆరలేదు. ఇవి చాలా? ఇంకా ఏమైనా గుర్తులు కావాలా?" అన్నాడు. అప్పుడు భరతుడు "తల్లి ముగ్గుకట్ట దగ్గర్నుంచి నీకేమి గుర్తయ్యా? అబ్బా! మీ చెలిమి ఎంతలోతు! అందు కనే అన్నగార్కి అంతటి నేస్తుడవయ్యావు. అది సరే! రాముణ్ణి కనుగొని వస్తే ఏమిస్తావు? అని అడిగావుగదూ! జాము జాముకు చేపుతూ చక్కని చిక్కని పాల నిచ్చే కపిల నిస్తాను. అయోధ్యకు వెళ్ళగానే నీ ఆవు నీకు తోలిస్తాను" అప్పుడు సుయజ్ఞుడు "ఏమిటి కపిలనిస్తావా? సాక్షాత్తు శ్రీరామచంద్రుణ్ణే ఇచ్చావు గదయ్యా" అంటూనే ఇద్దరూ ప్రేమాతిశయంతో కౌగిలించుకోవడంతో ఇద్దరి యజ్ఞోపవీతాలు పెనవేసుకుపోయి ఆనంద బాష్పాలతో తడిసిన ఇద్దరి చెక్కిళ్ళు కలిశాయి.

భరతుడు గుహునికి కబురు పంపాడు. గుహుడు రాగా తనప్రక్క కూర్చుండమని వసిష్ఠులవారితో "తండ్రీ! ఇప్పుడే మన సుయజ్ఞుడు. ఆశ్రమం మనవారిదేనని తెల్సుకుని వచ్చాడు. మరి మనం ఇక ఆలస్యం చేయ కుండా రాముణ్ణి చూడ్డానికి వెళ్ళాలి. మీరు వెనుకగా తల్లుల్ని తీసుకురండి. నేను ముందుంటాను." అంటూనే గుహుని వైపు తిరిగి "ఓ మిత్రమా! నువ్వూ రాముణ్ణి చూద్దామనే ఆతృతగా వున్నావు గదా! నీవు ముందుపో. ముందు నిన్ను చూస్తే రాముని చిత్తం కొంత ప్రసన్నత చెందవచ్చు. ఆపైన నాకు చక్కని త్రోవ ఏర్పడుతుంది రాముణ్ణి చూడ్డానికి." అని గుహుని పంపించి వశిష్ఠులవారు ముగ్గురు తల్లులతో వచ్చిన తరువాత – "తండ్రీ! ముందు నేను వెళ్తాను. మీరు వెనుక రండి" అని తను, శత్రుఘ్నుడు, సుయ జ్ఞుడు, సుమంత్రుడు గుహునికి వెనుకగా దూరంగా వుంటూ ముందుకు బయల్దేరారు. ఆశ్రమ వాతావరణం చూచుకుంటూ కొంతదూరం వెళ్ళగానే

సుయజ్ఞుడు "అదే! మన వాళ్ళుండేదదే!!" అనగానే భరతుడు "అయ్యో! చివరికిదా శ్రీరాముడుండే ఇల్లు? నల్గురూ ఒక తండ్రికే జన్మించాము. ఈనా డింత చేసింది ఈ పాడు నిర్ణయం. తెల్లని రఘువంశ కీర్తికి నలుపుచార పెట్టబడింది ఈనాటితో– కైకమ్మ బుద్ధి పుణ్యమా అని. పూర్వ పుణ్య ఫలమువల్ల దీన్ని చెరపగలిగితే చాలు" అంటూ ఆవేదనతో భారంగా ప్రక్కలగ్గూడా చూడకుండా, మనస్సులో రాముణ్ణే లగ్నంచేసి నడుస్తూ వుండగా రఘురాముని పర్ణకుటీరం ప్రదేశం రానే వచ్చింది– చలితోను, కటిక చీకటితోను నిండిన రాత్రిపోయి తొలిసంజ లేవెలుగు విచ్చినట్లు, రాముని పాదుకలు ముందుగా కొట్టవచ్చినట్లు కనబడ్డాయి కైకేయి గర్భజుడైన భరతునికి. మణులతో పొదగబడినవగుటచేత పాదుకలను పర్ణశాల లోపలకు తీసుకొని వెళ్ళలేదో, లేక భక్తసంతతికి ప్రథమ దర్శనం కలిగించడం కోసమో అన్నట్లున్నాయి— వాకిట్లో వెలుగుతున్న పాదుకలు. వాటిని చూడం గానే ఎందుకనో రాముణ్ణి చూడాలన్న ఉద్వేగం సన్నగిల్లింది. హృదయ మంతా అగ్రజునిపై శుద్ధమైన భక్తిభావం నిండిపోయింది. పాదుకలే— కన్ను లలో, మనస్సులో— రాముని రూపంలో సాక్షాత్కరిస్తున్నాయి. వాటినే స్మరిస్తూ, స్తుతిస్తూ వళ్ళు స్థితెలియనితిలో వుండగా వంశకర్త భాస్కరుని దివ్యతేజస్సుతో – వనవాస క్లేశంతో ఒకింత సడలిన రామచంద్రుని దివ్యమంగళ స్వరూపం ఎదురుగా దర్శనమైంది.

గండిపడ్డ చెరువు నీటిలా – దుఃఖ భారంతో పూర్తిగా నిండినచిత్తం విచ్చుకుని భరతుని నోటినుండి 'అన్నా' అని రావడం, తెలీకుండానే సాష్టాంగపడటం, తల రామచంద్రుని పాదపద్మాలకు కొట్టుకోడం, వెలు వడిన చల్లని కన్నీళ్ళ వరదల్లో రామచంద్రుని చరణకమలయుగళం కలగ బారడం ఒక్కసారిగా జరిగాయి. భరతుడువచ్చి పాదాలమీద వ్రాలిఉన్నా డని లక్ష్మణుడు పల్కడం, ఎదురుగా గుహుడు కన్పడడం, హఠాత్తుగా

తమ్ముని చూడడం జరగటంతో ప్రాణం ఎక్కడికో పోయి మతి వశం తప్పటం జరిగాయి రామునికి.

## అనురాగ వచనాలు

"ఒకవేళ నాపట్ల ఏదైనా దోషం ఉంటే నాకు తెలియపరచటంపోయి అనవసరమైనవాళ్ళెవరిమాటో పట్టించుకుని, నిన్నే నమ్ముకున్న ఈ తమ్మునిపై కొంచెమైనా దయ చూపించ లేకపోయావుగదా! తోడబుట్టిన లక్ష్మణుణ్ణి తీసుకురాగలిగినా ఆ నమ్మిక ఇంకొక తోబుట్టువునైన నాపై కలగలేదా ? లేదా క్లేశసంక్లిష్టమైన చిత్తములో ప్రేమకు చోటే లేకుండా పోయిందా ? నీ ధర్మాన్ని నువ్వు చూసుకున్నావు గాని నీ తమ్ములేమౌతారో, వాళ్ళ ధర్మాల మాటేమిటో ఆలోచించలేదుగదా! సర్వ ధర్మాధీనమైన నీ చిత్తంలో నా మాట గుర్తుకు రాలేదా? లేదా క్లేశపూరిత మవడంతో నా స్పృహే మరుగున పడిపోయిందా?" అని భరతుడు నేలకు ముఖం దించుకొని పలుకుతున్న మాటలకు మహీతలం రెండై – ధరణీజాతఅయినసీత కను తామరలనుండి వెలువడిన బాష్ప బిందువుల్ని నిల్చిన– ఆమె రెండు బుగ్గలుగాదాల్చినట్లయింది. అప్పుడు ఆమె–

"ఓ బిడ్డా! ఇలా జరగడంలో మీ అన్నగారి తప్పు ఏమీ లేదయ్యా! నిజానికి అలాంటి సమయంలో ఆయనకు నీ గురించి నేను గుర్తుచెయ్యాలి. ఏమిటో, ఆ సమయంలో ఎవరికన్నా ఏమన్నా మనసు పనిచేసేట్టుందా ! సుడిగుండంలో పడ్డవానికి మల్లే అయిందిఅందరికీ ఆసమయంలో" అన్నది. అప్పటికి రాముడు తెలివిపొంది భరతుని రెండు బాహువులతోను ప్రేమగా పట్టుకుని "ఓయీ తమ్ముడా! ఎంతో అలసిపోయి వచ్చావు నాయనా ఇక్కడకు! నాకెంతో నీకూ అంతేగదా ధాత్రీపతి వాక్య పరిపాలన! ఆ ధాత్రీపతి మన తండ్రే అయితే ఆ ఆజ్ఞ నీకో రకంగాను, నాకో రకంగాను అన్యాయి

స్తుందా చెప్పు ? ఆ తండ్రి మాటగా నేను అరణ్యానికి వచ్చాను. ఆ తండ్రి మాట సుంతగూడా పొల్లుపోకుండా ఉండాలంటే, అసత్య దోషం అంటకుండా ఉండాలంటే నువ్వు పరిపాలిస్తున్న రాజ్యాన్ని వదిలి ఇలా రావచ్చా ? అయినా నువ్వు అవతల ముసలి తండ్రిని వదిలి ఇలా వచ్చావేమిటి ? నీవిలా వస్తానంటే నాయనగారు సమ్మతించారా? ఒకవేళ సమ్మతించినా రాజ్యభారాన్ని వయోవృద్ధులైన నాయనగారిపై ఉంచి సమయం చేసుకుని నీవిలా రావటం నీకు సమంజసమని తోచిందా ? మన ఇక్ష్వాకు రాజులు చేసుకున్న పుణ్యఫలమైన మన కులబ్రహ్మ వశిష్ఠులవారి ఆశీస్సులు పొందినవాడవైనావా? అగ్నిహోత్రుడు, పితరులు, దేవతలు సంతృప్తి చెందుతున్నారా? మంత్రిజనుల సహకారంతో, ధర్మబద్ధంగా, నీతిబద్ధంగా పరిపాలన కొనసాగుతోందా ? మనకు కల్పతరువైన గౌతమ స్మృతిననుసరించి సకల రాజ్యాంగ తంత్రము జరుగుతోందా ?" అన్నాడు రాముడు. అప్పుడు భరతుడు-

## దశరథుని మరణవార్త

"ఆహా! అన్నా నేను రాజునైనట్లు మాట్లాడుతున్నావే! నేను రాజేమిటయ్యా? సరే! తండ్రి సుఖంగా వున్నాడా అంటావా? ఏం చెప్పను? ఎలా చెప్పమంటావు ఆ సంగతి? నీవు తిరుగులేని ధర్మమార్గానువర్తిగా అటు అడవికి పోవడం, పుత్రప్రేమ అవధులు దాటి తట్టుకోలేక తండ్రి ఇటు ఈ నేలను వీడటం ఒక్కసారే జరిగాయి. ఇక మిగిలిన నాకు పితృవధ ప్రకటాఘపథాన్ని పట్టడం మిగిలింది."

తనదే దోషం అంటూ మాట్లాడిన తమ్ముని మాటల్లో తండ్రి చావు మాట విన్నంగానే దుఃఖం పెల్లుబికింది. ఇంతలోనే తల్లులు అచ్చటకు చేరారు. "ఓ అయ్యా! ఎందుకు ఇలా చేశావయ్యా? మా గుండెల్లో చిచ్చు

పెట్టి పోయావుగదయ్యా!" అంటూ తూలిపోతూ రాముని మీద పడ్డారు. రాముని గుండె చెరువ్వు గండిపడి దుఃఖజలం గొట్టంకొట్టినట్లు తీవ్రంగా ప్రవాహాలు గట్టింది. కుమిలి కుమిలి ఏడ్చే తల్లుల దుఃఖం కొంత సేపటికి తగ్గగా గుండె లోంచి ఎక్కణ్ణుంచో నెట్టుకుంటూ వస్తున్నట్లుగా—

## రాముని వేదన

"బాగా వయస్సు వచ్చిన తర్వాత నీవు కన్న పసిపాపలం మేము. మేము బ్రతికి బట్టకట్టేందుకై బ్రతికావు. కన్నులు గూడా ఇంకా పూర్తిగా తెరవని పసి కందుల్ని విడిచి ఎలా పోగలిగావు తండ్రీ! దశరథాత్మజుల మని అందరిచేత గౌరవం పొందటానికి నీవు లేవు గదా ఈ భూమ్మీద. ఇంక నీవులేని మమ్మల్ని ఏ విధంగా చులకనగా చూస్తారో! ఈ కఠినమైన గుండె నిన్ను స్వర్గానికి పంపి తనకు దూరం చేసుకుంది. తండ్రి చివరి చూపుకూడా నోచుకోలేదు ఏం చేశానోగాని. నేను లేకపోతే నీవుండ లేకపోయావు, నేను మాత్రం ఇంకా నువ్వు లేకపోయినా జీవించే వున్నాను. ఆహా! తండ్రులు— కొడుకులు అంటే ఇలా వుంటారు గావును, నాయనా భరతా! పితృ వధకు నీవు, నీ తల్లి కారణం ఎలా అవుతారయ్యా? ఆ కైకమ్మతల్లిని అందరూ ఆడిపోసుకుంటారుగాని, తండ్రి నిలా పోయేట్టుగా చేసిన నన్ను ఒక్కమాట గూడా అనరే! ఆహా! ఏం మనుష్యులు? ఏం ప్రపంచం? లోకువైన చోటే నిందవేస్తుంది గదా ఈ ప్రపంచం.... ఆహా! కస్తూరీ తిలకంతో నిత్య సౌభాగ్యంతో విరాజిల్లే తల్లుల ఎలాంటి ముఖాలకు మారుగా, నవ్వులేక వెల్లబారిన ముఖాల్ని చూడవలసి వచ్చింది? తమ నాథుని చంపిన నన్ను పదునాలుగేళ్ళ వనవాసానంతరం అయోధ్యకు రానిస్తుందా ఈ ప్రజ! వీడే చంపింది మన నాథుణ్ణి అంటూ చూస్తారేమో నా ముఖం" అంటూ వేదన చెందాడు.

కౌసల్య గుండెకుహత్తుకుని ముఖాన్ని స్పృశించింది. కౌసల్య లాలనతో కొడుకు శిరస్సును కొంత తాపం ఉపశమించింది రామునికి.

చీర చెంగు కళ్ళ కడ్డం పెట్టుకుని, దుఃఖం పొంగి పొర్లి బయటకు రానీయకుండగా ఉసూరుమంటున్న కోడలు. సీతను దగ్గఱకు తీసుకొని కౌసల్య "ఎందుకమ్మా తల్లీ ఈ విధంగా కడుపు చెరువయ్యేలా ఏడుస్తావు, నీ భర్తతోపాటే నువ్వూ వనవాసిని వైతివి గదా! కొడుకు, కోడలు చిలకా గోరింకల్లా ఇంట్లో మసులుతూంటే చూచుకునే భాగ్యానికి నోచుకో లేదు గదా మీ మామగారు? ఇంక నాకు మాత్రం ఏం కోర్కెలుంటాయే తల్లీ! ఇంక మిగిలింది నీ వొక్కదానివి నాకు. అల్లాంటి నీవు కంటనీరు పెట్టుకుంటే నే చూడలేనే తల్లీ! నామీద దయచూపి ఏడవకమ్మా! నా మీద ఒట్టు! నువ్వు ఏడవకూడదు. చూడు, అవతల తండ్రి పోయి గంపెడు దుఃఖంతో కొడుకు విలవిలలాడి పోతున్నాడు. వాడు తేరుకునేలా చూడాలి. అంతేగాని నువ్వే ఇల్లా దుఃఖిస్తే ఎట్లా చెప్పు". అంటూనే దుఃఖావేశంతో— 'ఆనాడెప్పుడో కుమారస్వామి సర్వ సైన్యాధిపతియై ముందుండి నడిపించాడు సర్వ దేవతా సేనావాహినిని. అల్లాంటి దేవతా సైన్యాన్ని మీ మామగారు ముందుండి నడిపించారు గదమ్మా! నా దైవం ఎక్కడకెళ్ళాడో ఏమోనే తల్లీ! నన్ను పట్టుకో అమ్మా నన్ను పట్టుకో— నిలబడ లేకుండా వున్నాను' అంది— అంతే కుటుంబ సభ్యులందరూ ఒక్కసారి గొల్లుమన్నారు. అప్పుడు వశిష్ఠుడు సుమిత్ర! దగ్గరికెళ్ళి— "ఏమమ్మా! సుమిత్రా! నీక్కూడా ఇలా చెయ్యడం న్యాయమని తోచిందా చెప్పు. ఏమిటిదంతా?" అన్నాడు.

"క్షమించండి ప్రభూ! ఇన్నాళ్ళబట్టి ఈ దుఃఖం ఎలాగో లోపల అణిగివున్నది. పెద్ద కోడలి దుఃఖం చూసిన తర్వాత ఇంక ఆగలేకపో యింది. అణుచుకోలేకపోయాను. నా అదుపు తప్పింది. ఏం చెయ్యను?

సమస్త రాఘవ కుల పవిత్రయైన కౌసల్యాదేవికా ఇంతటి దుఃఖం?" అంటూ మళ్ళీ ఏడుస్తూనే వుంది. ఇంక లాభం లేదు అనుకున్నాడు వశిష్ఠుడు. చూడలేక పోయాడు. యోగశక్తి చేత శోకం ఉపశమింపచేయ దలిచాడు. ఈ వంశానికి తనకు పురోహితత్వంలో ఇంతకు మున్నెన్నడూ చేయగలిగి కూడా చేయనిది – ఈ రోజున పరమ ప్రశాంత గంభీర చిత్తంతో తన బ్రాహ్మీమయమైన తేజోరూప శాంతిని యోగ ప్రసారరేఖగా వెలువరించాడు. రామునితో సహా అందరూ ఒక్కసారిగా ఆ హఠాచ్ఛాంతానికి ఉక్కిరి బిక్కిరై వశిష్ఠుని ముఖాన్నే చూస్తూ నిల్చుండిపోయారు. దుఃఖంమాట గుర్తుకే రాలేదు ఎవ్వరికీ!

## కర్తవ్య నిర్వహణ

అప్పుడు వశిష్ఠుడు "నాయనా రామా! నీవు పెద్ద కుమారుడవు. నిజానికి నీవు చెయ్యవలసిన పితృకర్మ మీ తమ్ముడు భరతుడు చేశాడు ఆ రోజున. అందుకనే నేమో ఇంకా ఆ ప్రేత భావాన్ని వదలకుండా వున్నాడు మీ తండ్రి దశరథుడు. కాబట్టి నాయనా రామా! నీ విపుడు చేయవలసింది చాలా వుంది. అందరూ గంగా నదీ తీరానికి రండి" అన్నాడు. అందరూ గంగాతీరానికివెళ్ళారు. శ్రీ రాముడు కాలాతిపాత సమూఢ విశేష స్నానాదులు గావించాడు. బొడ్డులోతు నీటిలో నిలబడి దక్షిణ దిక్కుగా తిరిగి జలాంజలినిస్తూ అటుపైన నివాపవారిని తండ్రికి వదిలాడు. కావలసిన వస్తువుల్ని తమ్ముడు లక్ష్మణుడు తెచ్చి ఇవ్వగా తన కాంత సీత నిస్తిలక వదనంతో ఆ వస్తువుల్ని అందిస్తూ వుండగా పితృ కర్మల్ని రాముడు చేశాడు. గారపండ్ల గుంజు కలిపిన రేగుగుజ్జును ఉండలుగా చేసి పిండ ప్రదానం చేస్తూ ఖిన్నపడ్తూ, వుండగా–భూదానాలు గోదానాలు లేని పితృకర్మలు చేసే కొడుకుని చూస్తూ ముగ్గురు తల్లులు మొదళ్ళు నరకబడిన వృక్షాల్లా అయ్యారు. వారిలో కౌసల్య—

"ఆహా ఏం గతి పట్టింది ఈ రాచరికానికి? ఎక్కడో స్వర్గలోకంలో వున్న ఆ రాజు గారముద్దరుచి చూద్దామనిపించి వస్తున్నాడా! ఎంత దయనీయమైన స్థితి? ఈ కొడుకిక్కడ ఇంగుదీ పిణ్యాకాలివ్వడం కోసం ఆ తండ్రిని పిలవడం, ఆ తండ్రి ఆత్రంతో రావడం— ఆహా ఏం చిత్రం? ఏం చెప్పగలం, ఈ తండ్రి కొడుకుల మధ్య అనురాగం అలాంటిదేమో!.... అయ్యో! నా చెల్లెలా! సుమిత్రా! నా కారణంగా ఈ పసివానికూ్కడా ఎంతటి కష్టం వచ్చిందే నా తల్లీ! అయ్యో బిడ్డా! ఏంగతి పట్టిందర్రా మీకు. చివరకు సమస్త పృథ్వీ రాజ్యాన్ని ఎక్కడి దక్కడే వదిలి దిక్కులేని చోట బ్రతుకుతూ చివరకు రెక్కలమీద ఆధారపడి బ్రతకాల్సి వచ్చిందా? ఆజానుబాహువులై సమస్త ఆభరణా లతో రఘువీరుల్లా తులతూగ పలసిన మీరిలా అయ్యారా? ఈనాడు అడవుల పాలై లేళ్ళు, కుందేళ్ళ మాంసం తనకు తానుగా వండి మొగుడికిపెట్టి, తను మరిది తినాల్సి వచ్చిందా— ఈ ఇక్ష్వాకు వంశపు కోడలికి? ఔరా! విధి ఎంత బలీయం"? అని అంటూండగానే కర్మ పూర్తయింది. దాదాపు పొద్దు వాలిపోయే సమయమైంది. అందరూ పర్ణశాలచేరారు. నల్గురు అన్నదమ్ములు ఒకళ్ళ నొకళ్ళు కౌగలించుకుని దుఃఖించారు. పితృ శేషం భుజంచే వేళకు పూర్తిగా పొద్దు క్రుంకింది.

## భరతుని ఔచిత్యం

'ఎప్పుడు తెల్లవారుతుందా' అనే ధ్యాసతో రాత్రంతా కళ్ళు మూతలు పడని భరతుడు కోకిలతో పాటు లేచి కుతకుత లాడే ఎదతో తెల్ల వారుఝామునే అన్నగారిని కలుసు కోవాలని పర్ణశాల వైపుగా బయలు దేరాడు. కాని— 'ఇంత పొద్దున్నే ఏమిటి అన్నగార్ని— లేచి కాలకృత్యాలన్నా తీర్చుకోనీకుండా' అని ఆ తెల్లవారు ఝామున వెళ్ళడం విరమించు కున్నాడు. ఉదయకాలంలో వెళ్దామనుకుని 'ఇప్పుడెందుకులే

అన్నగారు అగ్నిహోత్ర విధిలో వుంటారు' అని అప్పుడూ విరమించాడు. "మరీ భోజనం చేసే సమయంలో వెళ్తే ఏం బావుంటుంది" అని ఆ భోజన కాలంలో గూడా వెళ్ళడం విరమించు కున్నాడు. 'అన్నగారికి నిన్నల్లా పితృ కర్మలతో వళ్ళు బడలి ఉంటుంది. ఇప్పుడే గదా విశ్రాంతి తీసుకొనేందుకు కాస్త సమయం చిక్కింది, ఇపుడెందుకు వెళ్ళడం' అని ఆ మూడుజాముల వేళల్లోనూ వెళ్ళలేదు. ఇంక కొద్దిగా పొద్దుందనగా వెళ్ళడానికి నిశ్చయించుకుని శకునం చూసుకొని అన్న గారిని కలుసు కోడానికి బయలు దేరాడు. అతనివెంట వచ్చిన అయోధ్యా పుర జను లందఱూ బయలు దేరారు.

## రాముని పలకరింపు

పర్ణశాల వద్ద మద్ది చెట్టు నీడలో సీతా లక్ష్మణులతో కూర్చుని ఉన్న రఘురాముణ్ణి— చూసి శరత్కాలపు పున్నమి వెన్నెలకు సాష్టాంగపడిన వరి చేలలాగా; పాటల కిరణోదయ సూర్యుని గాంచి— కించిద్వికసిత సహస్ర పద్మ కోరకంబైన సరోవరంలాగా పర్యాచరణము చేశారు వచ్చిన యావన్మంది. తనకు బాగా పరిచయమున్న ఆ పడి వేల ముఖాల్ని చూసి హృదయం ద్రవించి పోయింది రామునికి. గుండె ల్లోంచి బయటకు వచ్చిన అప్యాయత వాక్కై "మీరందఱూ క్షేమమేనా? అబ్బా! మిమ్మల్ని చూసి యుగాలైనట్లుంది. మొత్తానికి అయోధ్య కయోధ్యంతా వచ్చినట్లుందే! ఈ అందమైన అరణ్యం— ఎక్కడో నగరాంతః పురాల్లో నివసించే వారిని గూడ తన అందంతో ఆకర్షింపజేసి కొని తన దగ్గరకు లాక్కుంటుంది గదా!" అన్నాడు రాముడు. రాముని హృదయంలోని ఆ లౌకిక వాక్చమత్కృతి వచ్చిన వారి చిత్తాల్లోకి తగిలింది. జనమందఱూ భరతుని వంకచూశారు. భరతుడు వశిష్ఠ సుమంతులను, సుయజ్ఞ, గుహులను, ముగ్గురు తల్లుల్ని యోగ్యమైన ప్రదేశాలల్లో కూర్చునే

ఏర్పాటు చేశాడు. ఎవ్వరూ ఏమీ మాట్లాడరు. వాళ్ళు ప్రారంభిస్తారని వీళ్ళు, వీళ్ళు ప్రారంభిస్తారని వాళ్ళు ఒకళ్ళ ముఖాలు ఒకళ్ళు చూసు కొంటుండగా శ్రీరామ చంద్రుడు భరతుణ్ణి చూసి—

"ఏమిటి నాయనా! మీపద్ధతి చూస్తుంటే నాతో ఏదో పని ఉన్నట్లనిపిస్తోంది. ఏదో చెప్పాలనుకుంటునట్లుంది మీ సంజ్ఞలు చూస్తుంటే. నాదగ్గఱ శెలవు తీసుకొని అయోధ్యకు వెళ్ళాలనే ఉద్దేశ్యంతో వచ్చి తీరా వచ్చాక 'సంగతి ఎలా చెప్పాలా' అని సంశయిస్తున్నారా? ఏమిటో చెప్పండి మరి నా దగ్గఱ బిడియపడ్తారేం? అన్నట్లు నేను నిన్నడగాలను కుంటున్నాను ఒక సంగతి, సరే ఇప్పుడు చెప్పు. నాయనా భరతా! రఘు రాజ్యనృపాలా! ఆ జుట్టేమిటి అలా జడలు కట్టావు? తండ్రి మాట నిల బెట్టడానికై వ్రతం పట్టిన వాడు నాలాగా ఇలా కావి చీరలు కట్టవచ్చుగాని తండ్రి మాట మీదభూమినే లేవాడు కావినార చీరలు కట్టవచ్చునా? చెప్పు?" అన్నాడు. భరతుడు వెంటనే లేచి అంజలి సమర్పిస్తూ "కాస్త దయచూపించాలి. నీ కోసం యావదయోధ్య కదలివచ్చింది, రాజు లేకుండా ఈ సర్వాయోధ్యని తిప్పి పంపించవద్దు." అనడంతో మిగిలిన వారందరూ "ఆహా! ఆహా! ఏం అన్నదమ్ములు? ఏం లౌక్య వాక్య చమత్కృతి? ఎవరికెవరు తీసిపోతారు గనుక, ఒక చెట్టు కాయలు గదూ! పువ్వులకన్నా మృదువు, వజ్రాలకన్న కఠినం వీరి మనస్సులు" అని అను కున్నారు. అప్పుడు రాముడు చిరు దరహాసంతో "అసలు సంగతి చెప్ప వయ్యా సూటిగా, ఎందుకొచ్చిన డొంకతిరుగుడు" అనంగానే భరతుడంజలి ఘటించి, "పుణ్యమూర్తులు, ధర్మ స్వరూపులు, పరాక్రమవంతులు, వేద విదులు, మహాత్ములు, కోపదుఃఖరేఖా దమనులు, ఆశ్రిత దయాగుణ వర్ధ మానులు, ఆర్తత్రాణ పరాయణులు, ఆసాదిత భక్త కార్యఫల సంగతులు, అట్టి మీకై చేయువిన్నపము...." అనిఅంటూండగానే రాముడు మధ్యలోనే

అన్నాదమ్ముల మధ్య ఈ పొగడ్తలెందుకయ్యా ? అసలు సంగతి సూటిగా చెప్పక" అన్నాడు.

## భరతుని ప్రార్థన

అప్పుడు భరతుడు "అయితే సరే! నా భాగ్యం పండింది. నేను అట్టి అన్నగారి తమ్ముడనే అయితే మరి నాయందు ఇంత దోషం లేదు గదా?" అనగానే "లేదు నీయందు కించిద్దోషం గూడా లేదు" అన్నాడు రాముడు. అప్పుడు భరతుడు–

"నాకేం పాపంతెలియదు. అసలు నేను అయోధ్యకు వచ్చేంతవరకు ఇంత జరిగింది, ఇలా జరిగిందని తెలియనేతెలియదు. ఆ గురువులు నన్ను రమ్మని కబురు పంపగానే ఎంతో సంతోషపడి నిన్ను పట్టాభిషిక్తునిగా చూడవచ్చునేమో అనే తలంపుతో వచ్చాను. అంతే, అంతవరకు నాకేం తెలియదు నిజానికి. హృదయంలోని దీపానివైన నీవు అడవికి పోవడంతో తండ్రి పరలోకగతుడైనాడు. అట్లాంటి సమయంలో నేను అయోధ్యలో కాలుపెట్టవలసివచ్చింది. నావల్ల ఏదైనా తెలియక జరగకూడనిది జరిగితే నన్ను క్షమించు. నిజంగా నా హృదయం నిష్కపటమైనది, నిర్మలమైనది, నిర్మమమైనది అని నీవు చెప్పితే నాతో అయోధ్యకురా, నాకు నీతో ముడి. ఇది నిజం. తండ్రి చెప్పినా వినలేదు, తల్లి చెప్పినా వినలేదు, గురువు చెప్పినా వినలేదు. చివరకు ఎవరో సవతితల్లి కొడుకు భరతుని విన్నపాన్ని ప్రేమతో అంగీకరించాట్ట' అనే కీర్తి నాకు కల్గించే విధంగా నన్ను రక్షించవయ్యా. భక్త రక్షానిధీ! నీదైన నీ రాజ్యాన్ని ఏలుకోడానికి రావయ్యా. నీ పద పద్మాలకు మ్రొక్కి స్తుతిస్తున్నాను. అంగీకరించవయ్యా, తల్లి చేసిన పని–నువ్విప్పుడు కనుక వచ్చేస్తే సత్కృతే అవుతుంది. లేదా నువ్వు రాకపోయావా నల్లని దుఃఖ రేఖలను నాటిన దుష్కృతి అవుతుంది. తల్లి

చేసిన పనిని సత్కృతి చేయదలచావో, దుష్కృతి చేయదలచావో అది నీ ప్రస్తుత నిర్ణయాన్ని బట్టి వుంటుందని లోకమంతా అనుకుంటుంది మరి. ఓ అమృతస్వరూపా! సకల సాకేత పురవాసుల తరపున నీకు నమస్కరిస్తూ ప్రార్థిస్తున్నాను. నేను నీ తమ్ముణ్ణి, శిష్యుణ్ణి, దాసుణ్ణి. ఆశ్రిత జన రక్షా! నన్ననుగ్రహించు" అని శ్రీరాముని పాదాలకు రెండు కళ్ళూ అద్ది బాష్ప వారితో వాటిని కడిగాడు. రాముని హృదయం ద్రవించింది. వెంటనే తమ్ముణ్ణి రెండు బాహువులు ఎత్తి గుండెకు హత్తుకొని–

## రాముని సమాధానం

"నీకు అన్నగారిపై ఎంత ప్రేమవుంటే మాత్రం మన ఇద్దరి ధర్మ మార్గములకు దెబ్బతగిలేట్టుగా మాట్లాడితే ఎట్లా నాయనా! "పాపం పసివాడు తమ్ముడు ఏదో అడిగాడు–పెద్దవాడైన అన్నగారు ఇవ్వలేదుట' అనే అపవాదు నాకు మిగిల్చే విధంగా మాట్లాడుతున్నావు. నాయనగారి ఆజ్ఞానుసారియై నేను అడవికి వచ్చాను. నీవుకూడా మన జనకుని శాసనం ప్రకారం రాజ్యాన్ని ఏలుకో. అంతే! ఆ తండ్రి మాట కాదనటానికి నేనెవరు? నీ వెవరు? నేను చెప్పింది మేలైన పద్ధతి. అటు తండ్రి మాట తు. చ. తప్పకుండా కొడుకులచేత పాటింపబడుతుంది, ఇటు రఘువంశ మర్యాద నిలుస్తుంది. ఈ మూడు లోకాలను ఏలే రాచరికము మనకు వచ్చినా మన తండ్రి మాటనే మనిద్దరం మన్నించాలి. మన్నిస్తాం, ఆదరిస్తాం గూడా! ఈ మాత్రం వంశ మర్యాదను నిలబెట్టలేనపుడు– రఘువంశంలో పుట్టడం దేనికి ?' అన్నాడు. రాముని ఈ సమాధానానికి భరతుడు నిరాశచెందాడు. మిగిలినవారు తలలు వంచుకున్నారు, మరి– అనేది, చేసేది లేక. అంతలో సూర్యాస్తమయకాలము ఆసన్నమై సంధ్యాగ్నికి వేళైంది. అందరూ లేచి వెళ్ళిపోయారు.

# రెండవ ప్రయత్నం

రాత్రంతా నిద్ర పట్టలేదు భరతునికి. ఆలోచనలో పడ్డాడు. బుఱ్ఱ వేడెక్కి కంటిమీద కునుకన్నది పట్టలేదు. తెల్లవారింది. మళ్ళీ శ్రీరాముణ్ణి చూడ్డానికి వెళ్ళాడు. భరతునితోపాటు మిగిలినవారు గూడా వెళ్ళారు. సరిగ్గా నిన్నటిమాదిరిగానే అన్నగారిక్కి అంజలి ఘటించి- "మన్నించాలి మరీ బొత్తిగా మర్యాద తెలియనివాణ్ణి. ఏం లేదు మనస్సాగక ఇలా వచ్చాను మళ్ళీ! నువ్వు చెప్పింది కాదనడానికి కాదుగాని ఇదిగూడా విను మరి. నీవు అడవికి రావడం. నా రాజ్యపాలన సరిగ్గా తండ్రి చెప్పినట్లుగా జరగాలంటావు సరే! ఇపుడు నువ్వుకనక వస్తే తండ్రిని కాదన్నది లేదుకదా. పైగా నామీద దయచూపి నట్లవుతుంది కూడా! నాకా ఈ భూమిని తల్లి ఇచ్చింది. నేను దాన్ని నీకిస్తు న్నాను. అన్నదమ్ముల మధ్య ఇల్లాంటివి చెల్లవంటావా? అయితే నీవుండగా తమ్ములైన మేము భూమిని పరిపాలిస్తామా? నిజంగాచెప్పు. అల్లరి పాలవ డానికి తప్పిస్తే ఇల్లా చెయ్యొచ్చా? ఏం కాలమో పిదపకాలం పిదపబుద్ధులు అని నల్గురు చెప్పుకుని దెప్పరూ? ఒకవేళ నువ్వు ఇది సోదర ధనం సోదర ధనం తీసికోరాదు, అని అంటావా అసలు నిజానికిది ఈ సోదరునిది మాత్రమెలా అవుతుంది? ఏదో తాత్కాలికంగా నావద్ద వుంచమన్న వస్తువులాంటిది, అదైనా నాతల్లి పాపంవల్ల ఇలా నా దగ్గఱనే వుంచవలన అవసర మొకటి వచ్చిపడి నాకు నడమంత్రపు సిరి అయింది గాని నిజానికది నీదేగా! పదునాలుగేళ్ళ తరువాత ఇచ్చే బదులు ఇప్పుడే నీకు ఇచ్చేస్తున్నాను దాచలేక. పృథివీపతిత్వాన్ని ఇవాల్టి నుండే గ్రహించు. 'ఒక ప్రక్క రాజు రాముడుండగా ఈ నడిమి రాచరికమేమిటి మాకు?' అని ప్రజలు లెక్కచేయరుగూడా! ఓ మహితాత్మా! ఎందుకొచ్చిందయ్యా ఇదంతా? స్వీకరించవయ్యా నీ ధాత్రీ వధూటిని. నీయందు మనసుగొన్న ఈ ధాత్రీవధూటి నాయందు వ్యభి చరిస్తుందా చెప్పు. ఎతసేపు నువ్వు తండ్రిమాట మీద నిలబడాలనే

పట్టుదలేగాని నువ్వు ఆ మాట ఎలాంటిదో ఎప్పుడైనా కాస్త ఆలోచించావా? అది మతి పోయినమాట. బాగావృద్ధాప్యంలో కామావిల చిత్తంతో తెలియ కాడినమాట. అవడానికి చాలా మహాత్ముడే! కాని ఏం లాభం? మతికి పొరక్రమ్మిందప్పుడు. ఒకటి చెప్తావిను. అసలు తండ్రి నోరు విప్పి చెప్పాడా? లేక తల్లిమాటకు తాను ఏమీ మారుపల్కకుండా ఊరుకున్నాడా? ఆయనగారి మనస్సు ఆయన ఆధీనంలో వుంటేకదా ఏమన్నా మాటలాడడానికి, మరి అలాంటి తండ్రిగారిమాట పాలించటా నికిక అర్థమేముంటుంది? అయినా మతి మతిలోవుంటే అది ఆజ్ఞ అవు తుంది గాని మతి మతిలోలేదు' అంటే అది ఆజ్ఞ అవుతుందా? మళ్ళీ మతి మాములు స్థితికి వచ్చిన తరువాత ఏదన్నా మాట్లాడితే నిజంగా నువ్వు చెప్పినట్లు అట్లాంటి మాటలు పాటింపవలసినదే! నీవు సర్వజ్ఞు డవు. నీకు ఇంత విడమరచి చెప్పాలా నేను అన్నాడు. అందుకు శ్రీరాముడు–

# రాముని ధర్మ ప్రవృత్తి

"చాలా చెప్పావుగాని నాయనా అసలు ఏం జరిగిందో నీకు సరిగ్గా తెలియాలంటే నువ్వక్కడవుంటే తెలిసేది. నీవా సమయంలో లేవు. ఎవరో ఏదో అంటే అది వినేగదా ఇంత మాట్లాడావునువ్వు. కాని నేను ఆ సమయంలో అటు తండ్రిని ఇటు పినతల్లినిగూడా చూస్తూ వారిరువురి భావాలు కూలంకషంగా అవగతం చేసుకున్నవాడిని. తెలియని వారనే మాటల్నే నువుగూడా అంటే ఎట్లా నాయనా? తండ్రి మాటలాడవలసిన అవసరంలేక పోయినా ఆయన భావం మనకర్తవ్యాన్ని నిర్ణయించదా? అప్పటి ఆయన భావాన్ని పూర్తిగా అవగతం చేసుకున్నవాణ్ణి నేను. ఇప్పుడు ఇదికూడా అధర్మమే అంటే నేనిక ఎప్పుడూ ఎవ్వరిమాటను

వినవలసిన పనిలేదు. వినను. చివరకు నీ మాటను గూడా వినను. ఇప్పుడు ఇది అధర్మమైతే నేను మీమాట వినకపోవడం పాపం. నీ తల్లి వరమడిగింది. రాజు ఇస్తానన్నది ఇచ్చాడు. ఆ వరాన్ని నీవూ నేను సరిగా పాటిస్తే తండ్రిఇచ్చినమాట రెండుప్రక్కలా వరం ఫలించి నట్లౌతుంది. లేకపోతే లేనిపోని అల్లరి, అపవాదు తండ్రికి గూడా కట్టినట్లవుతుంది. నామీద మమకారంతో నిన్ను అగౌరవంగా చూడ్డానికి ఈభూమి ఏమన్నా ఏమీ తెలియని పసిపాపా? అసలు నిజానికి ఆ భూమికి రాజు వ్యక్తిగతంగా చేసేదేముంది? ధర్మశాస్త్ర కోవిదులు, త్రయీమూర్తులు, వృద్ధభూసురులు మంచి తీరుతెన్నులైన వర్తనతో నీ వెనుక నిలబడి నేలను పరిపాలన చేస్తూవుండగా— ఆ నేల అట్టి పరి పాలనను, నిన్ను వదులుకుంటుందా? "అన్నను వదలి తమ్ముని చేరు తుందా ఈ భూమి?" అనే మాటలు కేవలం రూపక సాధువైన అలం కారపు మాటగాని భూమి వేరువేరు కాలాల్లో వేరువేరు నృపాలుర చేత పరిపాలింప బడలేదా?

రాముడు ఇంకా ఇలా అన్నాడు. ఇకముందు రాజ్యం పరిపాలింప బడదా? నేనే వుంటానా ఎల్లప్పుడూ పోనీ ఈమాట కాదనగలవా? ఆ కైకమ్మ తల్లి నాకు ఎన్నో ఉపకారాలు చేసింది ఆ ఉపకృతులకు కృతజ్ఞతా పూర్వక ముగా ఈ వనం చేరాను. ఇంకో విధంగా ఆమె ఋణం తీర్చుకోగలనా? నాతల్లులు ముగ్గురూ రమాదరణీయ మూర్తులే! ముగ్గురికి నేనంటే ప్రాణమే, "కాని నాకు నా పినతల్లి కైకమ్మ దగ్గఱ, ఆయమ్మకు నాయందు వల్ల మాలిన చనువు, ప్రేమ, మరి అలాంటి తల్లి ఋణం తీర్చడంకంటె ముఖ్యమైనది మరోటి ఉంటుందని నే ననుకోను. ఏది చేసినా మన పెద్దలు మన మంచికే చేస్తారు. దాన్ని తెలుసుకోలేక మనం దానికి వ్యతిరేకంగా చేస్తే ఇటు ఇహము అటు పరము రెంటికీ దూరమౌతాము. తండ్రిమాట కొడుకులు జరపడం ధర్మం ఇంకో ఊహచేస్తే దోషమే

అవుతుంది. ధర్మబుద్ధితోచూస్తే ఆ తండ్రి మాటలో ధర్మమే గోచరిస్తుంది. అధర్మ బుద్ధితోచూస్తే అన్నిటి యందు దోషమే కన్పడుతుంది.."

## మరో ప్రయత్నం

భరతుడు, చేసిన వాదనయే మరల చేయడం బుద్ధిమంతుని లక్షణముగాదని ఏమీ మాట్లాడక కన్నీరు కారుస్తూ– "పట్టు జీనులపైని కూర్చుండి పంచ కళ్యాణి నెక్కి స్వారీచేస్తూ పోవలసిన నీవు అడవిలో నడుస్తూ తిరుగుతావా? శత్రుంజయ మెక్కి ఊరేగుతూ, ఇరు వైపులా మంత్రులు నడుస్తూవుండగా రాజసభకు పోయే నీవు అటూఇటూ పులులు సింహాలు పోతూవుండగా అడవిలో మధ్యగా తిరుగుతావా? అతి మృదువుగా పరిచారికలచేత పరిచర్యిలుపొందే నీవు నీ పరిచర్యను నీవే చేసుకుంటావా? నీ కృతజ్ఞతను వెల్లడి చేసుకుంటావా? సరిసరి. మరి అన్నయ్యా! కటిక రాళ్ళ ముక్కల శయ్యాస్థలము సుఖంగావుందా? నా రామచంద్రా! ప్రభాత వేళ పులుల సౌఖశాయనికరవము శ్రవణ పేయంగా వుందా! ఓ దాశరథ ప్రియాత్మజా! తారకాకాశ వితానసీమ బావుందటయ్యా! కందమూలాలకు, చిగురుటాకులకు ఏం రుచి ఏం గిరాకి పెరిగింది" రత్న దీపాలకు రాణింపు పోయె గదా అంటూ 'ముగ్గురు తల్లులు తమ ప్రియ పుత్రుణ్ణిగూర్చి ఇంతగా ఇలా దుఃఖ పడటానికి వాళ్ళు ఏం పాపం చేసుకున్నారో గదా! 'తోటమాలి కష్టపడి చెట్టు పెంచాడు. అది పెద్దదైంది. నలుదిక్కులకు వ్యాపించింది. కాని ఆచెట్టు పువ్వునుగాని, పండును గాని మచ్చుకు ఒక్కటైనా చూడ్డానికినోచుకోని తోటమాలి దుస్థితి ఎలాంటిదో నీవు అరణ్యానికి రావడం అయోధ్యకు అలాంటిది'. చెరువులోని నీటిని ఎన్ని బిందెలైనా తెచ్చుకోవచ్చు. ఆ చెరువు ఎన్నిబిందెల నీటినైనా తనలో ఇముడ్చుకోగలదు. బిందె ముంచితే దాంట్లోకి కనీసం ఆ చెరువులోని పది

అంగుళాల మేర నీ కూడా పట్టదు. నీ ప్రతిభ ఆ కాసారం, నేను ఈ ఏందెలాంటివాణ్ణి. ఈ రాజ్యం పంట కాల్వ లాంటిది. నీవు లేని లోపం అనే ఉపద్రవం వచ్చి పొంగివరదలౌతోంది. దీన్ని బిందె లాంటి నేను నాలో ఇముడ్చుకోగలనా?" అన్నాడు భరతుడు. అప్పుడు రాముడు చిరుదరహాసంతో

## రాముని ధర్మప్రబోధం

"మన రఘువంశ రక్తానికే అమర్యాద గొలిపే విధంగా మాట్లాడితే ఎలా తమ్ముడూ? నా మీద నీకుగల అత్యంతమైన ప్రేమ నిన్నిట్లా అనిపిస్తోంది గాని మన రఘువంశీయులు, నీవు, కాదా మరెవ్వరైనా ఈ భూమిని యేలగలరు! ప్రభువు ఏ త్రోవ పట్టిస్తాడో జనం ఆ మార్గాన్ననుసరిస్తారు. వాళ్ళకన్ని విధాలా ప్రభువే దైవం. ఆటలో పావుల్ని అటూ ఇటూ కదుపుతూ పోరే విధంగా ఈ జీవుల్ని ఆటలుపట్టిస్తాడు పైనున్న ఆ భగవంతుడు. ఈ ఆటలోని గెలుపులు, ఓటములు, ఈ జంతువులు కేవలం అతని ఆట వస్తువులు' అని నీకు తెలిసి గూడా బాధపడ్తావు దేనికి ? ఒక్కటి చెప్పు. ఈ బ్రతికేది ఎంతవరకు? చచ్చేంత వరకే గదా! మఱి ఆ చావనేది వుండి, అంతవరకే ఈ బ్రతుకని తెలిసి గూడా ఈ చావంటే భయపడడమెందుకో? పండిన పండు నేలమీద పడిపోతే ఎవరైనా 'అరె పడిపోయింది' అని లోకంలో బాధపడుతున్నారా? జీవులు వివశత్వంతో ప్రేమ బంధాన్ని అల్లుకొని అటుపైని ఆ అల్లికలో పోగులు వాటంతటవి తెగిపోతే బాధపడ్తూంటారు.

నిజానికి ప్రతి జీవిని అనుక్షణం నడిపించే ఆ పరమాత్మయే ఈ అల్లికలవల తమపై ప్రయోగిస్తున్నట్లుకూడా తెలుసుకోలేరుకదా జీవులు. మన ఇద్దరి మధ్యగల ఈ 'అన్నాతమ్ముల బంధం' ఉన్నంత వరకు మనం ఈశ్వరులమేనని, మన ఇద్దరి మధ్యా ఇది తెగని బంధమేనని అని

పిస్తుం కాని అది తెగి పోయినపుడు కలిగే బాధ మన అనీశ్వరుల లక్షణాన్ని ఎత్తిచూపదూ? ఇదంతా మాయసంతకదా నాయనా! మన తండ్రి సర్వము తెలిసిన జ్ఞానులలో శ్రేష్ఠుడు. అటువంటి ఆయన మరణించాడని మనము దుఃఖించడం కూడా అవివేకమే. ఆయన ఉత్తమ లోక గతుడైనాడు. అటువంటి తండ్రి గర్భాన పుట్టినందుకు నాకెంతో ఆనందముగావుంది. ఆ తండ్రి మనల్ని సత్యమార్గాన నియమించాడు. దాన్ని అనుసరించి తరించాలి గాని వృధాగా బాధపడటం తగదునా నాయనా! నేను అక్షరాలా తండ్రిమాట ప్రకారం చేస్తాను. నీవు చేస్తావు. ఇలా ఇద్దరం చేయడం పితృాణ విముక్తి కలుగజేయడమే కదా! ఒకవేళ తండ్రి బతికే వుంటే ఆయన మాట కాదనేవాళ్ళమా. ఇప్పుడు అయన లేడు కదా అని ఆయన మాటను నిరాదరిస్తామా? ఎందుకొచ్చిన విచికిత్స అనవసరంగా. అయోధ్యకు వెళ్ళి రాజ్యపాలన కొనసాగించు. అదొక్కటే నీకు మిగిలివుంది. వెళ్ళుమరి త్వరగా" అని పలికిన రాముని ధర్మ వచనాలు వశిష్ఠుల వారితో సహా అందరికీ ఆశ్చర్యాన్ని కలిగించాయి.

## మరో ప్రయత్నం

అప్పుడు భరతుడు,

"ఇది దుఃఖం; ఇది సుఖం; ఇది సామ్రాజ్యలక్ష్మి, ఇది ఘోరారణ్యం అనే భేదదృష్టి కలవాడికి 'కటిక చీకటి- కమనీయ కౌముది' అని వుంటాయి గాని జ్ఞానగుహలో వసించే నీలాంటి పురుష సింహాలకు నిరంతరం పండు వెన్నెల గుండెలనిండా నిండి వుండదా! నీవు పరావరములు రెండూ తెలిసిన జ్ఞానివి. జితేంద్రియుడవు. ధర్మావధిభూతుడవు. నీకు సమానమైన వాడుండడు. ఈ అడవిలోని గులకరాళ్ళు, అయోధ్యలోని మణిదీపాలు నీ భావనలో ఒక్కటే! అట్లాంటి నీవు నీభాగమైన ఈ భూమిని నన్ను దొంగి

లించమని చెప్పటం జ్వాలతో మండుతున్న భూమి మధ్య నన్ను ఉంచి చంపినట్లే కదా, ఓ వైశ్వానరమూర్తీ! రామచంద్రా! ఎందుకు నన్నింత ఇబ్బంది పెడతావు? నీ భూమి నీవు తీసుకొని నా దారిన నన్ను పోనీయ రాదటయ్యా! ఏదైనా మొదట్లో పాడుచేయడం తేలికే. కాని మళ్ళీ దాన్ని దారిలోకి తీసుకురావడం అంత తేలిక కాదు. ఓ ప్రభూ! నీవేమో సత్యం కోసం రాజ్యాన్ని వదుల్తానంటున్నావు. నాకంటావా - రాజ్యం సంగతే అయోమయం. ఈ నీ భృత్యుడు రాజై ప్రజల్ని పరిపాలించడం మొదలెడితే ప్రజలే రాజులౌతారు. అంతా అల్లకల్లోలం, అయోమయంగా తయారవుతుంది. ఓ నీతి, నియమాలుండవు. అటు పట్టు విడువకుండా కోరిన తల్లి పాపం, దానికి బదులుగా తండ్రి ఇచ్చిన వరం, ఇటు నీ సత్య మార్గానువర్తనం ఇవి ఒక్కొక్కటి పది బళ్ళ బరువు నా గుండెల్లో నింపాయి. ఇవి చాలక ఇంకా తర్క వాదములు కూడా దేనికి చెప్పు? నీకు కొంచెం దయ రేఖా మాత్రంగా కలిగితే చాలు- ఇదంతా పూర్తిగా సమసిపోతుంది. నువ్వు అయోధ్యకు రాకపోతే నేనూ పోను, అయితే అయోధ్య బీడవుతుందంటావేమో అలా అయితే నీకేం, నాకేం? నీ రాజరికానికి, నా సహోదరత్వానికి భంగ రాదే! నీవు రాజువు- నేను నీ తమ్ముణ్ణి. నీవు మునివి - నేను నీ శిష్యుణ్ణి. నాకున్న ఒక్క ఆశ్రయమల్లా నీ చరణారవిందాలు. ఆ పైన నీయిష్టం వచ్చి నట్లు చేసుకో. కొంచెం అయోధ్యపరంగా మాట్లాడాను అంతే! అంతకంటే ఏమీ లేదు'! అంటూ భరతుడు ఎదురుగా నిలబడ్డ రాముని పాదాలు పట్టు కుని నిశ్చలముఖ నయనాలతో తదేకంగా చూస్తూ వుండిపోయాడు. అయినా రాముడు చలించలేదు. చూచిన వాళ్ళందరికీ 'ఇంతస్థిరమనస్కుడా రాముడు?' అని అనిపించింది. అప్పుడు రాముడు-

## రాముని సమాధానం

"నీవు చెప్పేదానికి చేసేదానికి పొంతన కుదరాలి నాయనా! నేనంతే

నీకు అమితమైన భక్తీ, గౌరవం అంటున్నావు. మళ్ళీ నేను చెప్పినట్లు చేయమంటే చేయవు. ఏమనుకోవాలి?. భక్తి అంటే కేవలం శారీరక సేవయేకాదు. ఆజ్ఞను ఉల్లంఘించకుండా చేయడం కూడా! కొంచెం ఆలోచించు. ఈ సూక్ష్మం నీకే దర్శనమవుతుంది. ఎప్పుడో తన ప్రాణం రక్షించిందన్న కైకకు కృతజ్ఞతా భావంతో భూమిని వరంగా ఇచ్చాడు తండ్రి. దీంట్లో తప్పేముంది? ఎవరో వేస్తారు పుల్ల, వేసి నిన్నిలా తరుముతున్నారు. 'వరం అడగడం ఇలానా'? అని నీకిరోజు అనిపించవచ్చు. 'ఎలాంటి వరాలు అడుగుతుందో?' అని ఏమాత్రము ఊహించనుకూడా లేదు రాజు. నీ ఇష్టము వచ్చినవి అడగవచ్చు అని ఆ రోజు ప్రాణాలు నిలిపినపుడు మాటమీద నిలబడ్డాడురాజు. ఆ చాలారోజులు గడిచి పాతబడిపోయింది గదా అని ఈ రోజు మరోలా జరిగేట్టుగా చూడడం న్యాయమవుతుందా? నువ్వే ఆలోచించు. అనవసరంగా విపరీతార్థాలు తీసి నాన్నగారి సత్యసంధతకు దెబ్బ తగిలేలా చేయకు. ఇంకా అనవసరంగా నేనొకటి అంటే పది బదులు చెప్పకుండా నేను ఏమి చెపితే అది చేయి" అన్నాడు.

రాముడలా అనంగానే కైకేయి మధ్యలో కల్పించుకొని—

## కైకేయి లౌక్యం

'నాయనా రామా! రఘువంశ రాజుల ధర్మపరిషత్తుల్లో అంతఃపుర స్త్రీలు ఏమన్నా వారి అభిప్రాయంగూడా చెప్పవచ్చునో, చెప్పకూడదో నాకు తెలియదుగాని ప్రస్తుత విషయంలోను నా ప్రసక్తి కొంత వుందిగాబట్టి చెప్తాను మరి' అంటూ— 'రాక్షసులు తపస్సులు చేసి సమస్త లోకాలను వినాశం చెయ్యగలగడానికి తగినట్టుగా బ్రహ్మగారిని వరాలు కోరతారట! ఆ బ్రహ్మగారు గూడా తథాస్తు అని అల్లాంటి వరాల్ని వారికి ఇస్తాడు. సరిగ్గా ఆ బ్రహ్మగారి లాంటి వాళ్ళు మీ రఘువంశ రాజులు. నిజం చెప్పు. అటు

ఆ బ్రహ్మగారి కృపగ్గాని మీ వంశీయుల కృపగ్గాని హద్దూ పద్దూ అనేది వుందంటావా? ఈ హద్దు లేకుండా పోవటం ఎంతటిదంటే చెప్తా విను. అగ్నిని 'నువ్వు ఆరిపో!' (అంటే నువ్వు చచ్చిపో) అని వరమడిగితే ఎంతో అంతటిది. గాలిని– 'నువ్వు కదలకుండా వుండి పో !' (అంటే బిగుసుకు చావు) అని వరమడగటం ఎంతో అంతటిది. నిజానికి ఇలాంటి వరమడిగినా గూడా ముందూ— వెనుకా ఆలోచించకుండా ఇచ్చేవాళ్ళున్నారు– ఎవరో తెలు సా! మీ రాఘవులు. మీవారి కృప అంత హద్దులు దాటినది. కాని, రఘువంశంలో పుట్టిన పసివాడైన తమ్ముడేదో - అదే రఘువంశంలో పుట్టిన అన్నగారైన నిన్ను అడిగితే దాన్నేమీ పట్టించుకోకుండా నీవీనాడు త్రోసిపుచ్చుతున్నావు." అంది,

కైక మాటలు పామూ చావకుండా బడితా విరక్కుండా వున్నట్లున్నాయి- "ఎలాంటి వరాలనైనా ముందూ వెనుకా ఆలోచించకుండా ఇచ్చి తమ సత్యసంధతను నిలబెట్టుకొనేవారు మీ రాఘవులు"– అంటే ఏమిటి ? మీ నాయనగారు నా కిచ్చిన వరాన్నిగూడా అలాగే చెల్లుబాటుచేసి మీ నాయనగారి సత్యసంధతను నిలబెట్టండి మీరే కనక రఘువంశీయులైతే అంటే రామా నీవు అరణ్యవాసం చెయ్యి అనే అర్థం. సరే ఇది ఇల్లా వుంచండి.

కైక మళ్ళీ– "రఘువంశంలో పుట్టిన ఒక అన్నగారైన నిన్ను నీ తమ్ముడే ఏదో అడిగితే నీవు ఈనాడు ఏమీ పట్టించుకోకుండా కాదంటు న్నావు" అన్నది. దీని అర్థం ఏమిటి? నువ్వే కనుక రఘు వంశీయుడవైతే నీ తమ్ముడు కోరిన దానిని కాదనకుండా చెల్లించు. తమ్ముడైన భరతుడు ఏమి అడిగాడు? రాముణ్ణి అయోధ్యకు రమ్మనమని అడిగాడు. అంటే 'నువ్వు అయోధ్యకు రా' అనే గదా దీని అర్థం, ఒక ప్రక్క నువ్వు అరణ్య వాసం చెయ్యి అనీ, రెండో ప్రక్క నువ్వు అయోధ్యకు రా! అని పరస్పర

వైరుధ్యం గల మాటలు తాను ఏమి తేల్చిచెప్పేదీ అవతలి వాడికి అంతు పట్టని విధంగా అతి లౌక్యంగా చెప్పగలగడం కైకేయికే తగును. అని దీనిని బట్టి తెలుస్తుంది[

కైక అలా అనంగానే "వశిష్ఠుడు అమ్మా కైకేయీ! మొత్తానికి గట్టి ద్దానవమ్మా ! స్పష్టంగా అనుమానానికి తావు లేకుండా – 'నేను ఆ రెండు వరాలు కోరను, ఒకవేళ ఇదివరకే కోరివున్నా ఇప్పుడు ఆ రెంటినే ఉపసంహరించు కుంటున్నానని నువ్వే చెప్పొచ్చు గదా!" అన్నాడు అప్పుడు శ్రీరాముడు–

"తండ్రిగారూ! ఏమిటండీ! మీరు కూడా అలా మాట్లాడుతారు! ఇప్పుడాయమ్మ– 'వరాలు ఉపసంహరించుకుంటున్నాను' అంటే మాత్రం ఆ వరాలు చెల్లకుండా వుంటాయా చెప్పండి ? ఆ కైకమ్మతల్లీ, తండ్రీ ఇద్దరి సమక్షంలో వరాలు ఇచ్చి పుచ్చుకోడాలు జరిగాయి. అలాంటిది ఇప్పుడు తండ్రి లేకుండా ఈవిడ ఒక్కర్తీ' ఉపసంహరించుకున్నాను' అంటే చెల్లుతుందని మనం మాత్రం ఎలా లెక్కవేస్తుకుంటాము" అన్నాడు. వెంటనే కైకేయి అందుకొని "తెలిసిందా ఇప్పటికయినా 'రాముడంటేనూ, రాముని పంథా అంటేనూ ఏమిటో? ఈ రామచంద్రుని దయచేతనే కన్నబిడ్డల్ని వనాలకు పంపే కీర్తి నా ఒక్కదానికి దక్కింది. నా హృదయాంతరంలో ఉన్న దీపపు వెలుగును ఆధారంగాజేసుకుని ఈ వనాంతరాల్లోనికి రాముడు రావడంలోగల రహస్యం ఇంక విడమరచి నేనెందుకు చెప్పాలి?" అని అక్కడినుంచి వెళ్ళిపోయింది. రాముడు అలా గంభీర నిశ్చల వదనుడై వున్నాడు. చుట్టూ వున్నవాళ్ళందరూ ఎవరికివారు 'ఏది మాట్లాడితే గంభీర వాతావరణము ప్రశాంతంగా మారుతుందోనని ప్రయత్నం చేద్దామనుకున్న వారే! కాని, ఏమి మాట్లాడితే ఏమౌతుందో, రాముడు ఏమనుకుంటాడో, 'సింహంలా గంభీర వాక్కులతో నోరు మూయిస్తాడో' అని మారు పలకకుండా వూరుకున్నారు. జాబాలి మాత్రం ధైర్యం చేసి –

# జాబాలి నాస్తిక వాదం

"ఓ రామచంద్రా! నీ చేజిక్కిన రాజ్యాన్ని నీవు వదలుకోవలసిన అగత్యము లేదయ్యా. ఒక్కటడుగుతాను చెప్పు. జీవితం అంటే ఏమిటి? జన్మించిన నుండే మరణించే వరకు ఉన్నదేగదా ! ఆ మరణం తరువాత ఏమిటో, ఏమౌతుందో ఇంతవరకెవరూ చూడలేదుకదా! 'వాళ్ళలా అన్నారు, ఇలా అన్నారు, ఏది యదార్థం? ఏది కాదు?' అన్నది ఎవడికి తెలుసు? నిజానికెవరిక్కావాలి? మనకు తెలిసింది మనం ఆచరిద్దాం. 'వీడు తండ్రి, వాడు వీడి కొడుకు, వీడు జ్యేష్ఠుడు. అదిగో వాడు వీడి తమ్ముడు' ఇలాంటి మాటలు ఎంతకాలం వుండే మాటలు? బ్రతికున్నంత వరకే గదా ! ఎవడికి ఏది లభిస్తే అది వాడిదానిగా చూసుకోవాలి గాని, ఏదో ధర్మం పేరుచెప్పి తనకొచ్చిన సుఖాన్నిగూడా విడిచేవాడు నిజంగాతనంతతాను సుఖజీవితాన్ని నాశనం చేసుకున్నవాడే అవుతాడు. చచ్చిన తర్వాత ఇంక సౌఖ్యం వచ్చేది ఎవరికి? నన్నడిగితే- జీవిస్తుండగా వచ్చిన సౌకర్యమేదో అదే వాడి ప్రాణానికి సుఖం- ఏదో ముందర- సుఖాన్ని కోరి కన్నుకానని దూరతీర వనాలకు పోయి దుర్భర జీవితాన్ని అనుభవిస్తాననటం త్యాగము, దానము అవుతుందనుకుంటున్నావేమో! అది ముష్టి ప్రమాణము కూడా కాదని గుర్తుంచుకో! సింహాసనం అధిష్టించి కొలువు సాగించటం తక్కువైన భోగమా ? రాజుగా సర్వజనులను పరిపాలిస్తూ సేవలను అందుకోడం తక్కువ వైభవమా? ఏకచ్ఛత్రాధిపత్యంతో చక్రవర్తిగా సమస్త మర్యాదలు, భోగాలు అందుకోవడం తక్కువ సౌఖ్యమా? ఎన్నో యజ్ఞాలుచేసి తేజస్సం పన్నుడవటం తక్కువదా? దానంతటది లభించే ఇలాంటి వైభవము, సంపద వదులుకోడం ఎందుకయ్యా? ధర్మమంటే ఇలా వచ్చినదాన్ని పొందటం గాని, నువ్వు చెప్పే మాటలు ఎవరు పట్టించుకొంటారు" అని అంటూ మళ్ళీ "నీ తండ్రి కోరిన ప్రకారం బ్రతికుండగా అరణ్యవాసాని కొచ్చావు- బాగానే వుంది. ఆ తండ్రి ఇప్పుడు పోయాడు. ఆయన మా

గూడా ఆయనతోటే పోయింది. ఇంక నువ్వు అరణ్యవాసంగూడా చెయ్య వలసిన పనిలేదు. సుఖంగా అయోధ్యకు వచ్చి రాజ్యపాలన సాగించు." అని అర్థం వచ్చేటట్లుగా నాస్తికవాదం చేశాడు.

## రాముని సమాధానం

జాబాలి చేసిన నాస్తికవాదానికి శ్రీరామునికి కోపం వచ్చింది. కళ్ళు ఎఱ్ఱబడ్డాయి. ముందు పళ్ళు సందు లేకుండా కొరుక్కున్నాయి. అధరం కించిత్కంపించగా జాబాలిని చూసి, "ఏమయ్యా జాబాలీ! నన్ను సాకేత పురానికి పట్టిద్దామనే తలంపుతో, ఇలా అన్నావా ? లేదా నీ మనస్సే ఇలాంటి వాదాలకు పుట్టిల్లా ? పొత్తు కుదరని నీ యీవాదం ఎంత అవివేకము, అర్థరహితమూ అయినదో చెప్తావిను. పురుషునికి ఇంద్రియ భోగాలే ముఖ్యమైతే ఉన్న యవ్వనం కాస్తా అయిపోతే నీ లెక్కప్రకారం మరి భోగమే లేదే? ఈ యవ్వనానికి పూర్వము గూడా ఉండకూడదుగదా! మరి నీ వాదన ప్రకారం బ్రతికుండగానే భోగమనుభవించటానికి వీల్లేదుగా! ఏం ఏమంటావ్ ? మాటలు నేర్చిన జంతువు అవడంమూలాన్నే విపరీత వాదాల వెంబడి పడే నిత్యభోగిని తానేననుకుంటాడు మానవుడు. 'తండ్రి బ్రతికున్నపుడడిగిన ప్రకారం వనాలకు వాచ్చావు. ఇప్పుడు తండ్రి మరణించాడు. ఇంక తండ్రెవరు ? కొడుకెవరు ? ఆయన మాట ఆయనతోనే పోయింది. రా అయోధ్యకు. ఇదిగదా నీ వాదం. నువ్వు చెప్పే ఈ వాదం ప్రకారం అయినా ఆ తండ్రి పోవడంతో — మా తండ్రీ కొడుకుల సంబంధమూ పోతుంది గదా! ఇంక ఆయనకు కొడుకుని కానపుడు ఆయన రాజ్యానికి మాత్రం వారసుణ్ణెలా అవుతాను ? వచ్చి ఎలా పాలన చేస్తాను? ఏం? ఇప్పటికైనా తెల్సిందా నీయీ నాస్తిక వాదం ఎంత ఓటిదో ?

[హేతువాదం- అంటే- Logical Reasoning అని అర్థం. ఒక్కొక్కప్పుడు ఈ హేతువాదం ఎంత దయనీయ స్థితిలో పడిపోయిం దంటే అది మనల్ని రక్షించేది పోయి దాన్ని మనం రక్షించుకోవలసిన గతి దానికి పడుతుంది (Logic is such a dirty subject, Some times we may have to protect it more than it protects us). [ప్రస్తుతం జాబాలి హేతువాదానికి రాముని సమాధానంలో అదేగతిపట్టింది]

ఇంతవరకు ఈ ఇక్ష్వాకువంశం పరంపరాగతంగా సత్యా నికి కట్టుబడి వస్తోంది. నేనైనా భరతుడైనా ఆ సత్యానికి కట్టు బడాల్సిన వాళ్ళమే! నేను ఎందుకోసం రాజ్యాన్ని త్యజిస్తునానో, భర తుడు అందుకోసమే రాజ్యాన్ని ఏలుకుంటాడు. ఇదీ మా వంశ మర్యాద. తెలిసిందా? అయినా సమస్త ధర్మ సూక్ష్మాలు తెలియ చెప్పవలసింది బదులు ఇలాంటి నాస్తిక వాదాన్ని కొనసాగించే నిన్ను మా కొలువులో ఎలావుండ నిచ్చారు? వుండడం నీ తప్పు కాదులే! ఉండనిచ్చిన మా తండ్రి కర్మను నిందిస్తున్నాను. బహుశ మీ వంశీయులు శుభ కర్మలు చేసి ఉండడంవల్ల మీ కులానికి ఈ రఘువంశంలో ఆశ్రయం వచ్చి వుంటుబది. కాని నీవు మాత్రము ఈ ఆశ్రయానికి అర్హుడివి కావు." అని జాబాలిపై రోషకషాయత నేత్రుడయాడు. అప్పుడు జాబాలి "రామచంద్రా! అంతకోపం ఎందుకయ్యా! నీవు ఎలాగో అలా అయోధ్యకు రావాలనే కోర్కెతో, 'ఇలా వాదిస్తేనన్నా వస్తావ'ని చెప్పాను గాని నేను నాస్తికుణ్ణి గాదయ్యా" అన్నాడు. వశిష్ఠుడు కల్పించుకుని "నాయనా రామా! అంత తెలియని దాని బ కాదు జాబాలి. సమస్త ధర్మాలు తెలిసినవాడే! నీ రాక కోసం అల్లా అన్నాడన్నది అక్ష రాలా నిజం నాయనా! శాంతించు అని అంటూ మళ్ళీ—

ఇలాంటి చిన్న చిన్న వాటితో అనుగ్రహిస్తాడా? ఎందుకొచ్చిన మాటలు గాని సుమంత్రా ధర్భాస్తరణాలు సేయండి." అంతే! అదొక్కటే స్వామి దయ గల్గాలంటే ఇదే మార్గం. నేను ప్రతీక్షిస్తాను–ఆయన వచ్చేవరకు పరమదరిద్రుడైన బ్రాహ్మణునిలా, పస్తులుంటూ, కడుపుమాడ్చుకుంటూ ప్రాణాలు కళ్ళలో పెట్టుకొని అన్నగారికి నాపై-ఎప్పుడు దయ కలుగు తుందో అంతవరకు ఇక్కడే ఇలా నిరీక్షిస్తామ." అన్నాడు భరతుడు. అన్నదమ్ములిద్దరిని అల్లా చూస్తూ నిలబడ్డాడు సుమంత్రుడు. భరతుడలా కూర్చుండి పోయాడు. రాముడలా కూర్చుండిపోయిన భరతుని జేరి– "అయితే ఇప్పుడు నన్నేమి చెయ్యమంటావయ్యా! ఏమిటీపని నాయనా! లే! లేచి అయోధ్యకు వెళ్ళి ఏలుకో. రాజు బ్రతికిలేడుగదా అని ఆయన మాటకు విలువ లేకుండా చెయ్యకు. ఆయనే బ్రతికి వుండి ఇలా కోరితే కాదనేవాడివా? ఇలా నీలాగ చెయ్యడం ఎవరో బ్రాహ్మణుడైతే చెల్లుతుంది గాని. అవతల పట్టాభిషిక్తునిగా ప్రకటింపబడ్డ నీవు ఇలా చెయ్యనేకూడదు," అనగానే భరతుడు లేవకుండానే తనతో వచ్చిన పౌర జానపదులను చూస్తూ— "విన్నారా? మీ రాజుగారి జ్యేష్ఠపుత్రుని ఆజ్ఞా నిబంధనమెలావుందో? ఏం మీలో ఏ ఒక్కరికీ ఏదైనా చేబుదామనే బుద్ధి పుట్టడం లేదా! అలా చూస్తూ వుండి పోతారేం?" అనంగానే వాళ్ళు—

"నీలిమబ్బులోని మెరుపుతీగను వెలుగుసగా; ఘనశ్యామలత్వం కోమలత్వంగా మార్చుకుని ఒక నీలి మబ్బు నల్ల కలువలా మారిందా' అని అనిపించే పరమ శ్యామల మోహనాంగుడైన రాముని చూడ్డానికి నీ వెంట పడి వచ్చాము. అంత సాధుమర్యాద గుణం గలవాడు, తండ్రిమాటను వేదప్రమాణంగా తీసుకున్నవాడు అయిన రాముని మాటకు ఎదురు ఏం చెప్పగలవారము?" అన్నారు. రాముడు వెంటనే— "ఏం భరతా?! 'మీకేం బుద్ధిపుట్టదా?!' అని వాళ్ళనడిగావుగా. ధర్మసంపత్తులైన వారి బుద్ధి బయట పెట్టారు విన్నావుగా. ఇంక గుండెను పట్టి ఆలోచించు.

నీకూ తెలుసుస్తుంది. సరే! ఇక లేమరి! నీటిని ముట్టుకో! దర్భాస్త్ర రణాలు తీసెయ్యి త్వరగా" అన్నాడు.

భరతుడు జలాన్ని స్పృశించి సుస్పష్టంగా అందరికి వినబడేట్టుగా "ఓ అయోధ్యా పురజనులారా! రాజు గారి మంత్రిలారా. వినండి మీరంతా! మీరే మా సూర్యవంశ సమస్త ధర్మశాఖలకు ప్రమాణం. వితేండి. "నిజానికి ఈ రాజ్యం ఎవరు ఎవర్ని అడిగారో, ఎవరు ఎవరికి ఇచ్చారో నాకైతే, తెలియదు. అందుచేత దాంతోనాకు సంబంధం లేదు. ఇకపోతే అన్నగారు పదునాలుగేళ్ళ అరణ్యవాసం చేసి తీరాలని తండ్రి ఆదేశంగా చెప్పారు. మంచిది, అన్నగారి బదులు నేను ఆ పదునాలుగేళ్ళు ఆడవిలో వుంటాను, తండ్రిమాట పాటింప బడినట్లే గదా!" అన్నాడు. వెంటనే రాముడు ప్రజల్ని చూసి—

## రాముని సమాధానం

"రాజు రాజ్యం ఇచ్చాడు. కైకమ్మ తీసుకుంది· ఇవాళ 'నేను చూడలేదు. కాబట్టి నాకు తెలియదంటే చెల్లుతుందా?' ఇకపోతే నా బదులు తాను అరణ్యవాసం చేస్తానంటున్నాడు భరతుడు. తాను మాత్రం చెయ్యాలా మరొక రెవరన్నా మాత్రం ఎందుకు చెయ్యకూడదూ ? 'ఇంత బంగారం ఇస్తాం ఈ 14 ఏళ్ళ అరణ్యవాసానికి' అంటే మా బదులు అరణ్యవాసం చేసి మా తండ్రిగారి సత్య సంధతను నిలబెట్టడానికి ముందుకు వచ్చే వారేవుండరా? అంతగా ఎవరూ ముందుకు రాకపోతే 'అరణ్యవాసానికి బదులుగా ఇంత సొమ్ము' అని ఏదైవానికో అర్పిస్తే సరిపోదా? ఎందు కొచ్చిన మాటలివి? తండ్రి నన్ను పొమ్మన్నాడు. నన్ను పొమ్మంటే నేను వెళ్తేనే ఆయన మాటకు గౌరవం చెల్లించి నట్లౌతుందిగాని నేను వెళ్ళకుండా ఇంకో రకంగా చేస్తే తండ్రి మాట పాటించి నట్లౌతుందా?

[రామకోటి వ్రాస్తే కలిసివస్తుందనంగానే ఆశపుట్టి క్షణం తీరుబడి లేని ఒక పెద్ద వ్యాపారవేత్త (Business Magnet) అందుకు నలుగురు గుమాస్తాలను పెడితే వారు కార్బన్ కాపీలు తీసి, స్టెన్సిల్ కట్ చేసి డూప్లికేటింగు చేసి లేదా + ఫొటోస్టాట్ కాపీలు తీసి- రామకోటి పూర్తి చేస్తే- ఆ వ్యాపారవేత్తకు ఎంతకలిసివస్తుందో— తనబదులు భరతుడు లేదా మరెవరైనా వనవాసం చేస్తే తండ్రి ఇచ్చినవరం అంతగానే తీర్చినట్లు అవుతుందనే భావనలో రాముడు మాట్లాడాడని అర్థం చేసుకోవాలి]

మా భరతునికీ మాత్రం తెలియదనా? ఏదో నన్ను బలవంతంగా మెత్తని మాటలు చెప్పి సాకేతపురానికి రప్పిద్దామనే వుద్దేశ్యంతో అన్న మాటలు గాని. తప్పకుండా పితృవాక్యాను సారంగానే ప్రవర్తిస్తాడు మా తమ్ముడు. నేనూ అతన్ని, అతని కోర్కెను కాదనేటటువంటి రాతిగుండె గలవాణ్ణి గాను. ఈ భరతునితోనే భూమిని పరిపాలిస్తాను. తండ్రిమాట ప్రకారం సంపూర్తి చేసి అటుపైన సాకేతపురం వస్తాను. రాజ్యాన్ని పరిపాలిస్తాను. ఈ పద్ధతి సత్యభంగం కానిదీ, అందరికీ ఇష్టమయేది. మరి మీరు గూడా సత్యానికి భంగం రానీయకుండా ఇకపైన చెయ్యవలసిన కార్యక్రమం చెయ్యండి" అన్నాడు.

సముద్రంలోని ఆటుపోటుల విధంగా సాగిన ఆ అన్నదమ్ముల సంభాషణలు సాంతం వినడానికి విచ్చేసి పైనున్న దేవతలు, ఋషులు భరతుని చూసి—

"ఓ లోకోత్తర చరితా! మహా ప్రాజ్ఞా! సర్వోన్నతధర్మ! నీ తల్లి ఋణం ఈ విధంగా తీర్చగా నీ తండ్రికి స్వర్గం ప్రాప్తించింది. నీ తండ్రి సత్యసంధత నిలబెట్టడం కోసం ఇంతగా పాటుపడే ఈ రాముని మార్గానికి ఇక మళ్ళీ అడ్డు చెప్పబోకయ్యా! నీ యీ నిర్బంధం కనక రాముణ్ణి

త్రిప్ప గలిగితే ఇంక నీ పుణ్యమా అని ముందింకెవ్వరూ సత్యం జోలికి పోరుగూడా!" అని అన్నారు. తన పక్షాన పలికే ఋషులను చూచి రాముడు-

"సకల కళ్యాణ మూర్తులైన మీరు ఈ మాత్రంగా నైనా నాకు మాట సాయంగా నిలిచారు. నా కదే చాలు." అంటూ ప్రేమతో అర్ఘ్యపాద్యాదులతో వారిని అర్చించాడు. వచ్చిన ఋషులందరూ "సరే! మరి ఇక అల్లా చేయండి సరిపోతుంది" అంటూ తమ దారిన తాము పోయారు. ఋషులు పలికిన పలుకులు భరతుని మరి మాటలాడకుండా చేయడంతో దీనముఖుడై రామునివైపు చూస్తూ-

## తుది నిర్ణయం

"నా తండ్రి ఇప్పుడిక్కడ లేడు. ఉంటే నామాట ఇలా వ్యర్థమయేదా? మీరూ అరణ్యవాసంలో ఆశ్రమ దీక్షతో ఒక్కరైనారు. ఇంక నా మాట వినేదెవరు?- అయినా పిలవక్కరలేదు - పెట్టక్కరలేదు. ఈ ఋషులు వారంతట వారే వస్తారు. అడగకుండానే ధర్మాన్ని చెప్పిపోతారు. ధర్మమే అంత! దాన్ని చెప్పేవారి అధికారమే అంత!! కానీండి రాజు చెప్పినట్లుగానే కానీండి! నేను నంది గ్రామానికి పోయి జటావల్కలాలతో ఉంటాను" అన్నాడు. అప్పుడు రాముడు-

"అదేమిటయ్యా? ఒప్పుకున్నట్లే వుంటావు, మళ్ళీఅంతలోనే ఒప్పుకోవు. రాజ్యాన్ని చూడవా ఏమిటి తండ్రి మాట సగం చేస్తావు, మిగతా సగం చెయ్యనంటావు. ఇదేమిటి? ఈ కోసల సామ్రాజ్యాన్ని సూర్యాంశులైన మన ఇక్ష్వాకులు మనుధర్మ ప్రకారం తీర్చిదిద్దారు. ఇవాళ దాన్ని నువ్వు పట్టించుకోకుండా నంది గ్రామంలోనే వుంటే అదికాస్తా బీడౌతుంది. ఆ పని మాత్రం చెయ్యకు నాయనా!" అని అనంగానే-

"ఈ ధాత్రీ పాలనా ధర్మం నీది. అంతే కాని లేశమాత్రంగా నైనా నాది కాదు. ఇది స్పష్టము. నీవు వచ్చేంతవరకు ఈ భూమిని నీ ప్రతినిధిగా వుండి వహించడం తప్పదని ఆజ్ఞాపిస్తావూ- నీ దాసుణ్ణి కాబట్టి నీ ఆజ్ఞను శిరసావహిస్తాను మరి! సరిగ్గా పదునాలుగేళ్ళు పూర్తవడంతో వ్యవధి లేకుండా మరుక్షణంలో మీ ముగ్గురూ నా దగ్గరకు ఊడిపడాలి. లేకపోతే ఆనాడు ఈ భూమ్మీద నీవల్లే ధర్మాతిక్రమణం జరుగుతుందని గుర్తుంచుకో". అని అన్నాడు భరతుడు. రాముడందుల కంగీకరించాడు- అప్పుడు మళ్ళీ- "ప్రభూ! నేను ఒంటరివాణ్ణి గదా! ఈ భూమిని ఏలడం ఎలాగయ్యా?" అని విన్నవించుకున్నాడు. "అదేమిటి చిత్రంగా మాట్లాడుతున్నావు?" అన్నాడు రాముడు. అప్పుడు భరతుడు-

"నీవు ఈ మణిఖచిత పాదూయుగాన్ని తొడుక్కో" అని రాముని పాదుకలను పాదాల ముందుంచాడు. రాముడు తొడుక్కున్నాడు. అప్పుడు భరతుడు, "వాటిని నా చేతులలో ఉంచు" అనంగానే రాముడు ఉంచాడు. అప్పుడు ఆ పాదుకలను తన నెత్తిమీద పెట్టుకుని భరతుడు- "స్వామీ ! నీవు పదిహేనవ ఏట మొదటి నెల మొదటి దినమున అయోధ్యలో దర్శనం ఇవ్వకపోతే నేను అగ్నిప్రవేశం చేస్తాను. అంతేనా?" అన్నాడు. "అంతే!" అన్నాడు రాముడు. అంతే! భరతుడు ఆ పాదుకలను అలానే తన నెత్తిమీద ఉంచుకొని తనతో వచ్చిన సర్వ అయోధ్యను బయలుదేరమని వెనుదిరిగి పోతూంటే – ఆ సర్వ అయోధ్యా అతనివెంట నడచింది. రాముడు వాళ్ళం దఱూ వెళ్ళిన వైపే చిత్తరువులా నిలబడి చూస్తూ ఉండిపోయాడు. జానకి ఒక కంటితో ఆ వెళుతున్న బంధువులందరి దిశవైపు గాను, రెండవ కంటితో వాలుగా పర్ణశాల వైపుగాను నిరుత్తరయై వెల్లబారిన ముఖంతో అతి దీనంగా చూస్తూ ఉండిపోయింది. పోతున్న వారిలో ముగ్గురు తల్లులకు అడుగులు ముందుకు సాగలేదు. నాలుగడుగులు వెనక్కివేసి, జానకిని చూసి, గుడ్లనీరు నిండగా మాట్లాడలేక, ముందుకు సాగలేక అలా దుఃఖ భారంతో నిలుచుండి

పోయారు. ఇంతలోనే మిగిలిన వాళ్ళందరూ చాలా దూరం ముందుకుపోవడంతో మళ్ళీ వాళ్ళను కలవడం కష్టమని వదలి వెళ్ళలేక మాటి మాటికీ వెనక్కి చూస్తూ వెళ్ళి ముందువాళ్ళని కలసిపోయారు.

# లక్ష్మణుని పశ్చాత్తాపం

అగ్ని గృహంలో ధనుస్సును ఆనుకుని నిలుచున్న రాముణ్ణి చూచి లక్ష్మణుడు, "ఆర్యా! నాకు కొంచెం సెలవిప్పించాలి. అలావెళ్ళి భరతునితో క్షమించమని వేడుకుని ఇప్పుడే వచ్చేస్తాను," అన్నాడు. రాముడు 'అలాగే' అన్నాడు. లక్ష్మణుడు వెనువెంటనే బయలుదేరాడు. వెనుక వస్తున్న లక్ష్మణున్ని చూసి కొంచెం దూరంలో వున్న సేన ఆగింది. భరతుడూ ఆగాడు. లక్ష్మణుడు వారిని చేరుకున్నాడు. "ఏమి? అన్నగారేమైనా చెప్పమన్నారా?" అన్నాడు భరతుడు. "అబ్బెబ్బే! అదేం కాదు. నేనే వచ్చాను. నీవు సేనతో వచ్చావుచూడు, అప్పుడు సన్నధూళి మింటికి తెరచాపఎత్తినట్లు కన్పించింది. దానికితోడు సేన ముందుకు రావడంతో వస్తూనే పెరిగే ధ్వని. దాంతో "ఇదేమీ తుఫానుగాలికి సంబంధించినది కాదుగదా! చూడొక్కసారి". అన్నాడు అన్నగారు. నేను వెంటనే చెట్టెక్కి నీ సేనాసాగరాన్ని చూశాను. అంతే చెట్టుదిగి అన్నగారితో ఏం చెప్పానో తెలుసా?– 'భరతుడు ససైన్యంగా మనపైకి దండయాత్రకై వస్తున్నాడు. ఆ తల్లి అరణ్యాలకు పంపిస్తే ఆ అమ్మ కొడుకైన ఈ భరతుడు అదీ చాలదన్నట్టు నిన్ను చంపడానికి ససైన్యంగా వస్తున్నాడు. చూడు నీ ఎదురుగానే వాణ్ణి చంపి మనం ఇంతవరకూ చేసిన పొరపాటును సరిదిద్దుతాను. నువ్వు 'ఊఁ' అను చాలు. మొత్తం ఈ సైన్యాన్నంతా పెంట ప్రోవులా చేసేస్తాను." అన్నాను అప్పుడు మన అన్నగారు ఏమన్నాడో తెలుసా?

"నీ తలలోపుట్టిన ఊహేనా ఇది. అయినా రాజైనవాడు నిష్కంటకం

ఎందుకు చేసుకోకూడదు? ఎందుకు భరతునిమీద అనవసరంగా కోపం పెంచుకుంటావు ? అన్నదమ్ముల మధ్య లేశమైనా అనుబంధమే లేదా ? నాకంటే నీకు భరతుడు ఎక్కువ విరోధి అవుతాడా ? నా మేలు కోరేది నీ వొక్కడవే అన్నట్లు మాట్లాడతావేమిటి? సరే భరతుడు ఎందుకు వస్తున్నాడో, వచ్చి నీవనుకున్నట్లు చేస్తాడో చెయ్యడో చూచిం తర్వాత నీ వూహలు కొనసాగనీ. మన మధ్య అనుబంధానికి ఒక తల్లికి పుట్టక పోయినా ఒక తండ్రికి పుట్టడం ఒక్కటీ చాలదా ?

[తండ్రి బీజం (విత్తనం) లాంటివాడు, తల్లి క్షేత్రం (నేల) లాంటిది. నేలమీద విత్తనం నాటితే వచ్చే మొక్క తత్త్వం విత్తనం లక్షణాన్ని బట్టి వుంటుంది గాని నేలను బట్టిగాదు. ఒకేరకం విత్తనాన్ని వేరు వేరు నేలలలో పాతిపెట్టినా, లేదా వేరు వేరు రకాల విత్తనాలను ఒకే నేలలో ప్రక్కప్రక్కగా పాతిపెట్టినా గూడా వచ్చేమొక్క– విత్తనం లక్షణాన్నిబట్టే వస్తుందిగాని నేల మారితే మారదు. అలాగే రామలక్ష్మణ భరతశత్రుఘ్నులకు తల్లులు వేరైనా తండ్రి ఒక్కడే! అంటే ఒకరకం విత్తనానికి చెందిన వారే, కాబట్టి నల్గురిలోను సూర్యవంశలక్షణాలే వుంటాయి." అని బీజక్షేత్ర న్యాయాన్ని ఈ సందర్భంలో రాముడు సమర్థించినట్లు అర్థం చేసుకోవాలి.]

నీకంటే కూడా భరతుడు నా యందు ఎక్కువ భక్తుడు తెలుసునా ? ఇలా నిర్ణయించి చెప్పడానికి నాకంటే తెలిసినవాడుండడు గదా! చెప్తా విను ఆ సాధువు ఎందుకు వస్తున్నాడో! "అన్నా ఈ భూమిని నీవు తీసుకో" అని చెప్పడం కోసం వస్తున్నాడు. మరి నువ్వేమో చాపియై కోపియై వెట్టి ఆలోచనలు చేస్తున్నావు." అన్నాడు. అప్పుడు నేను, " మంచివాళ్ళ కందరూ మంచిగానే కన్పడతారు అన్నాను'' అందుకు రాముడు "మరి నీకు భరతుడు చెడ్డగా కనిపించడం ఏమిటి? (అయితే నీవు చెడ్డవాడివా" అని భావము) అన్నాడు.

ఇలా అనంగానే 'అన్నా! క్షమించు' అని అన్నాను- అప్పుడు. మళ్ళీ ఇప్పుడు నిన్ను క్షమించమని అడుగుతున్నాను. లక్ష్మణుడలా అనగానే భరతుడు "నేను నిన్ను అడగవలసింది నువ్వు నన్ను అడుగుతున్నావా? బావుంది. నీవు నా భారాన్ని ఎంతమోస్తున్నావో నీకు తెలియదు. అసలు మీ తల్లీకొడుకల పుట్టుకలే పుట్టుకలు. అటు అమ్మ సుమిత్ర అయోధ్యలో ఎందరికి అండగా నిల్చిందో తెలుసా? అనాథమైన సర్వాయోధ్యకు అండగా నిలిచి, రఘుకుల భారమెల్లా మోసింది. ఇక్కడ ఆమె కొడుకైన నువ్వు, మన అన్నగారు కష్టాల్లో వుంటే మిగిలిన మన ముగ్గురు తమ్ములం సమంగా ఆదుకొని సేవించుకోవలసి యుండగా, మా ఇద్దరి బాధ్యతనూ కూడా నీవొక్కడవూ మోస్తున్నావు. ఇలా మీ తల్లీకొడుకులు అటు ఇంట్లోను ఇటు ఇక్కడ అరణ్యంలోను సర్వభారాన్ని మోస్తున్నారు. ఇక మాతల్లీ కొడుకుల సంగతి విను. మా తల్లి అన్నగారిని అరణ్యాలకు పంపిస్తే, నేను ఆయన్ని అరణ్యాల్లో నిస్సంకోచంగా నడవడానికి కూడా వీల్లేకుండా ఆయనగారి పాదుకలను పట్టుకొచ్చేస్తున్నాను. ఇలాంటి వాళ్ళం మా తల్లీకొడుకులం. మరి నీకు ఋణపడి ఉన్నానంటే ఉండనా? ఈ జన్మకు తీరేదికాదు ఈ ఋణం. వెయ్యిజన్మలకు తీరినా తీరినట్లే. (లక్ష్మణుడు సహస్రశీర్షుడైన ఆది శేషువు అవతారం. వెయ్యి తలలతో భరించే భారాన్ని ఒకే తలగలవాడు భరించాలంటే వెయ్యి జన్మలు పడుతుందని ధ్వని) అన్నాడు. భరతుడలా అనగానే లక్ష్మణుడు మరి చెప్పేది లేక "అవునవును నాకు అప్పుపడ్డావు నీవు." అంటూ తలాడిస్తూ వెనక్కి వెనక్కి వెళ్ళిపోయాడు.

## భరతుని తిరుగు ప్రయాణం

సోదరు లిద్దరినీ వీడలేక వీడలేక విడిచిన భరతునికి లక్ష్మణుడలా అంటూ పోవడం కళ్ళవెంబడి అశ్రువులు వర్షింపగా- అయోధ్య దారి పట్టాడు.

అలా నడుస్తూ ఎప్పుడు వెళ్ళారో సూటిగా భరధ్వాజుని ఆశ్రమం చేరుకు న్నారు. భరతుణ్ణి చూచి భరద్వాజుడు "రాముడు వచ్చాడా?" అని అడిగాడు. "వచ్చాడు స్వామీ!" అని పాదుకలను చూపించాడు భరతుడు. అప్పుడు భరద్వాజుడు—

"అన్నదమ్ములు అంటే మీరే! ఒకరి కొకరు తగినవారు, తీసి పోనివారు. బావుంది అలా వుండాలి. 'రాముడు రాలేదా?' అంటే రాలేదనటానికే వీలులేదు. అయన రాడని వూహించ లేనా? అయినా ఆ రోజున అలా అన్నాను. నువ్వు ఆ రోజు ఆపితే ఆగేట్టుగా వున్నావా? అయితే ఏం? వెళ్ళినందుకు వట్టిచేతులతో రాలేదు, ఫలం పుచ్చుకునే వచ్చావు. ఈ ఫలం ఈ భూమి ఉన్నంతకాలం శిలాక్షరాలుగా నిలిచి వెలుగుతుంది. నీకూ, రామునకూ మా ఋషులంటే ఎంతటి ప్రేమ, భక్తి నిజంగా నాకు చాలా ఆనందంగా వుంది" అన్నాడు.

భరతుడు, సైన్యం శృంగిబేరపురం చేరుకున్నారు. ఇంక ఇక్కడ ఆగి సెలవు తీసికొమ్మని గుహునితో భరతుడన్నాడు. కాదు, నేనూ అయోధ్యకు వస్తానన్నాడు గుహుడు. మళ్ళీ అందరూ బయలుదేరారు. అయోధ్యకు దగ్గఱగా వచ్చారు. గుడ్లగూబలు కూస్తున్నాయి, గబ్బిలాలు వ్రేలాడుతూ దేవాలయాలు పాడుబడ్డాయి. అగ్ని హెూత్రానికి ఆహుతియైన పానశాలలాగా పూరిళ్ళముందు ముగ్గు లేకుండా, ఇండ్లలోనుండి వేద ధ్వనులుగాని, పూజా మంత్రాలు గాని, పిల్లల ఆటలు గాని లేకుండా దొంగలు వూరంతా దోచుకు పోయారా అన్నట్లు బావురుమంటూ వుంది అయోధ్య అంతా. అల్లాంటి అయోధ్యను చూడ్డంతోటే భరతునికి నోట మాట రాలేదు. శోకభారంతో క్రుంగిపోయాడు. శిరస్సు పైని పాదుకలతో అలా నడుచుకుంటూ నగరం ప్రవేశించి రత్నసింహాసనంపై రామచంద్రుని పాదుకలుంచి నేలకూలబడి అతిదీనంగా వెక్కి వెక్కి దుఃఖించాడు. ఆ

విధంగా కలతబారి ఉన్న భరతుణ్ణి చూశాడు సుమంత్రుడు. ఏదో చెప్పా లనుకుంటుండగానే భరతుడు -"తాతా! ధాత్రీపతి అయిన రాముణ్ణి తెచ్చు కునే సౌభాగ్యం నాకు లేకపోయె కదా! ఆ తల్లి మాట తాలూకు బరువంతా నా తలకట్టుకున్నట్లైంది. ఎక్కడెక్కడవారు నా మీద ఎంతో ఆశపెట్టు కున్నారు. రామచంద్రుని తీసుకురాగల ననుకున్నారు. రాముణ్ణి తీసుకు వచ్చానో లేదో తెలుసుకోడానికి వస్తారు. అడుగుతారు. అసలు సంగతి తెలుస్తుంది 'తగుదునని వెళ్ళాడు తీసుకువస్తాడనే అనుకున్నాం. ఆ స్వామి వస్తాడా ? అయనెక్కడ? ఈ భరతుడెక్కడ?' ఇలా అనుకోరూ? దీని కంతకూ కారణం మా అమ్మని అనుకోనా? నే వెళ్ళి అడగంగానే స్వామి రాకపోవడమే అననా? నాతో అంతదూరం వచ్చి తీరా సమయం వచ్చే సరికి మీ అందరూ ఆయన పక్షమే మాట్లాడినందుకు మిమ్మల్ని అననా? నే నెలాంటి కొడుకునో ఆలోచించకుండా సత్యసంధత కోసమై వ్యవహారం ఇంతదూరం తీసుకువచ్చినందు కా తండ్రిని అననా? ఎవరిని ఏమనను? ఇదంతా నా ఖర్మ" అంటూ దుఃఖపడ్డాడు. వశిష్ఠ సుమంత్రులు స్వాంతన వచనాలలో భరతుణ్ణి ఆదుకొన్నారు. మళ్ళీ భరతుడు—

## భరతుని భక్తి

"ఈ పాడుబడినట్లుగా వున్న, కళావిహీనమైన, జీవచ్ఛవంలా వున్న ఈ పట్టణంలో ఎవడుండగలడు? 'పాదుకలనే పేరేగాని వెళ్ళి మళ్ళీ రాజ్యాన్ని తీసుకువచ్చాడు. దాని భారం మొయ్యవలసినది గూడా తానే, అనేమాట ఉండనే ఉంది గద! శ్రీరాముడులేని ఈ సాకేత పురంలో ఇంక నిలబడలేను, పోదాంపదండి; అ నంది గ్రామంలోనే ఉందాం. ఆర్యపుత్రుడు మరల తిరిగి వచ్చేంతవరకు ఆశ్రమ ధర్మాన్ని పాటిస్తూ ఆ నంది గ్రామంలోనే ఈ పాదుకలను సేవించుకుంటూ కాలక్షేపం

చేద్దాం. పదవయ్యా సుమంత్రా! మా తమ్ముడు శత్రుఘ్నుడు, నేనూ ఆ పాదుకల కిరువైపులా నిలబడి ఒకళ్ళు ఛత్రము, ఒకళ్ళు చామరము పట్టుకుని సేవించు కుంటాం." అన్నాడు. మంత్రులందరూ భరతునికి అన్నగారిపై గల భక్తి గౌరవ ప్రేమాదులకు సంతసించి వెంటనే శంఖాల తోను, భేరీనినాదాలతోను, అలంకరింపబడ్డ రథాలతోను, మహాశ్వముల తోను భరత శత్రుఘ్నులతో నంది గ్రామం చేరి పాదుకా పట్టాభిషేకం చేశారు. ప్రాతః కాలంలోనే లేచి పాదుకల నుద్దేశించి మాగధులవలె మేలుకొలుపులు పాడుతూ, సౌఖశాయనికులవలె పలకరించుచూ, దాసునివలె 'ఏమి ఆజ్ఞ వస్తుందో?' అని కనిపెట్టుకుని వుంటూ, ప్రజల సమస్యలను విన్నవిస్తూ పరిష్కార మార్గాన్ని పొందుతూవున్న భరతునికి – పాదుకా దేవతను స్వచ్ఛమైన భక్తితో కొలవడం దైనందిన కార్యక్రమమైంది. ఉదయమే లేచి పాదుకలను పులికాపుపెట్టి, అభిషేకం చేసి, తడి పోవు నట్లుగా తుడిచి, భక్తితో పీఠం మీద పెట్టి, సేవకులు తెచ్చి ఇచ్చిన పూవులతో అర్చించి, ధూపదీపాలతో యజించి, సహస్రనామార్చన గావించి, నైవేద్యమిడి సాష్టాంగ దండప్రణామంబు లాచరించి, స్తోత్రములు పాడుతూ లీనమై పరమ భాగవత మార్గంలో భరతుడు పాదుకలలోనే రాముణ్ణి సేవిస్తూ వుండిపోయాడు.

[ దేవుడు ఇచ్చిన ఈ దేహమనే రాజ్యానికి అధిపతి దేవుడే! తాను కేవలం ఒక ధర్మకర్త (Trustee) మాత్రమే! అని భక్తి మార్గాన్ని ప్రబోధించేదే ఈ పాదుకాపట్టాభిషేక ఘట్టము ]

# పాదుకాపట్టాభిషేకము - నాటిక

## ముందుమాట

శ్రీమద్రామాయణము నందలి అయోధ్యాకాండలోని పాదుకా పట్టాభిషేక ఘట్టం ద్వారా పాఠకుడు, సాధకుడు తెలుసుకోవలిసిన విషయాలను నాటిక రూపంలోగూడా లోగడ నేను వ్రాయడం జరిగింది. ఆ నాటిక గుంటూరు జనకులం (గురుకుల పాఠశాల) విద్యార్థినీ విద్యార్థులచే చి॥ వావిలాల రామకృష్ణశాస్త్రి పర్యవేక్షణలో, దర్శకత్వంలో విశాఖపట్నంలో జరిగిన గురుపూజలలో ప్రదర్శింపబడి మన మాష్టరు (ఎక్కిరాల కృష్ణమాచార్యులవారు) గారిచే ప్రశంసలను అందుకున్నది. పిల్లలచేత ప్రదర్శించుటకు వీలుగా ఈ నాటిక వ్రాయబడినది. సుమారు 30 ని॥ల కాలమునకు ఈ నాటిక సరిపోవును. సంక్షిప్తముగా సంభాషల రూపములో సందేశములుగల ఈ నాటికనుగూడా పాఠకులు, సాధకులు చదివి పిల్లల చేత ప్రదర్శింపజేసి ఆనందించగలరని విశ్వసించు చున్నాను.

— జి. ఎల్. ఎన్. శాస్త్రి

గ్రంథకర్త

# ఈ నాటికలో వచ్చు పాత్రలు

1. శ్రీరాముడు
2. లక్ష్మణుడు
3. సీత
4. భరతుడు
5. వశిష్ఠుడు
6. జాబాలి
7. సుమంత్రుడు
8. (శత్రుఘ్నుడు)

( చివరి రంగములో భరతునితోపాటు శత్రుఘ్నుని కూడా చూపవచ్చును. )

# పాదుకా పట్టాభిషేకము

(తెరతీయగనే రాముడు, లక్ష్మణుడు నిలబడి వుందురు. వారి వెనుక అరణ్యప్రాంతము, వీలయినచో పర్ణశాల కనపడునట్లు చూపించవచ్చును.)

రాముడు : (ఒకవైపు పైకి తదేకముగా చూచుచు) నాయనా లక్ష్మణా! అటువైపు చూచితివా? వాతావరణము ఒక్కసారిగా మారుచున్నట్లున్నది.

లక్ష్మణుడు : (అటువైపు చూచుచు) అవును. దూరము నుండి పొగమంచు క్రమ్ముచున్నట్లువున్నది. గాలి హోరుమను ధ్వనికూడ వినపడుచున్నది. అసలు సంగతిని తెలిసికొని ఇప్పుడే వచ్చెదను. (దూరముగాపోయి చెట్టెక్కిచూచి మరల వచ్చును). రాముడు లక్ష్మణుని రాకకై ఎదురుచూచుచుండును.)

లక్ష్మణుడు : అన్నా రామా! అది పొగమంచుకాదు. సైన్యముచే రేగిన ధూళి అట్లు కన్పించినది. నేను గుర్తుపట్టితిని. ఆ సైన్యంతో వచ్చుచున్నది ఎవరో కాదు - మన భరతుడే!

రాముడు : (ప్రేమగా) మనలను చూచుటకై పాపము భరతుడు అరణ్యముల బడి వచ్చుచున్నాడు కాబోలు!

లక్ష్మణుడు : (కోపముగా) భరతుడు ఒంటరిగా వచ్చుటలేదు. ససైన్యముగా వచ్చుచున్నాడు. ఆ కోలాహలమునుచూడ నాకేదో అనుమానముగా నున్నది.

రాముడు : ఏమి నాయనా నీ అనుమానము ?

లక్ష్మణుడు : (ఉద్రేకముతో) ఆ తల్లికి పుట్టిన బిడ్డ కాడా యీ భరతుడు. ఆమె నిన్ను అడవులకుమాత్రమే పంపించినది. ఇతడు నిన్ను ఈ భూలోకమునుండియే దూరముచేసి జీవితాంతము నిష్కంటకముగా రాజ్యమును పరిపాలింప దలచెను కాబోలు.

రాముడు : (ఆ ఆలోచననువిని నిర్ఘాంతపోయి, నిదానముగా) లక్ష్మణా! నా సోదరుడవైన నీకు ఇటువంటి ఊహకల్గుట ఆశ్చర్యముగానున్నది. నువ్వు ఊహించినట్లు భరతుడు దుర్మార్గుడు కాదయ్యా. చాల మంచివాడు.

లక్ష్మణుడు : (కోపముగా) అవును మంచివారల కందరును మంచిగానే తోచుదురు.

రాముడు : (నవ్వి) అయినచో మరి నీకేల భరతుడు దుర్మార్గుడుగా తోచెనో!

లక్ష్మణుడు : (అందలి హెచ్చరికను గమనించి నాలిక కరచుకొనును)

రాముడు : నా సోదరుడవైన నీకే మనలోనొక సోదరునిపై యిట్టి ఊహ కల్గుట ఆశ్చర్యము.

లక్ష్మణుడు : (తలవంచుకొనును.)

రాముడు : మనము నలుగురమూ ఒక తల్లికి పుట్టిన వారము కాకపోయినను, ఒక తండ్రికి పుట్టినవారము కదా! సూర్యవంశరక్తము మనందరిలోను సమముగానే ప్రవహించు చున్నది. ఒకరినొకరు గుర్తించుటకు, ఒకరిపై ఇంకొకరికి ప్రేమ కల్గుటకు అది చాలదా?

లక్ష్మణుడు : అన్నగారు అమాయకులు. ప్రేమ వేరు, పదవి వేరు.

రాముడు : నీ మనస్సును నీవు బయటపెట్టితివి.

లక్ష్మణుడు : కాదు. ఇటువంటి సమయములలో ఎవరైనను ఊహించు విష యమును ముందుంచితిని. భరతుడు కచ్చితముగా నిన్ను చంపుటకే వచ్చుచున్నాడు. కాని, ముందు ఈ కాలసర్పమును దాటిన గాని నిన్ను చేరడని తెలియదు. రానిమ్ము. అతనిని అతని సైన్యమును తునాతునకలు చేసెదను. (అని కత్తి నూరుతూ వింటికి నారిని సంధింపబోవుచుండును.)

రాముడు : సరే! భరతుడు ఎందుకు వచ్చుచున్నాడో నేను చెప్పెదను వినుము. రాజ్యమును పరిపాలించుటకు నన్ను గొనిపోవ వచ్చుచున్నాడు. ఒక్కటి చెప్పెదను వినుము. భ ర తు డు నాయందు నీ కంటె ఎక్కువభక్తుడు. ఇదిచెప్పుటకు నాకంటె తగినవారు వుండుదని అనుకొనను.

లక్ష్మణుడు : (కత్తి, విల్లు క్రిందపడవేసి.) క్షమార్హుడను.

రాముడు : ఓర్మి వహించుము. నీకే తెలియగలదు.

## రెండవ రంగము

(భరతుడు సైన్యమును ప్రజలను దూరముగా నుంచి జాబాలి, వశిష్ఠుడు, సుమంత్రులతో పర్ణశాల వద్ద నున్న రాముని చూచుటకు వచ్చెను.)

(రాముడు ఒక రాతిపైన, లక్ష్మణుడు దగ్గరగానే వున్న వేరొక చిన్న రాతిపైన కూర్చుని వుందురు. సీత రాముని వెనుకగా నిలబడి వుండును.)

భరతుడు : (ప్రవేశించి, రాముని పాదములమీద పడును. రాముడు లేవ దీయగా తలవంచుకొని నిలబడి) నాయందు ఏదైనా దోష మున్నచో నాకు తెలియజెప్పవచ్చును కదా! ఎవరి మాటలో విని ఇచ్చటకు వచ్చుట తగునా? నిన్ను నేను నమ్మినను నన్ను నీవు నమ్మలేకపోయితివి. కనీసము లక్ష్మణుని మీద నున్న ఆదరము నాయందు నీకు కలుగలేదే. నీ ధర్మము నీవు చూచుకొంటివి గాని, తమ్ములమైన మమ్ము గూర్చి ఆలోచించలేక పోయితివి గదా! నీకు నేను గుర్తురాకపోవుట నా దురదృష్టము.

సీత : (బాధపడుచూ) బిడ్డా! తప్పంతయూ మీ అన్నగారిదే కాదయ్యా! నా మీద కూడా కొంత వున్నది. నేనైనను ఆ సమయములో ఆయనకు నీమాట గుర్తుచేయవచ్చును కదా! ఏమిటో— ఆ సందర్భములో ఎవ్వరికిని మతులు మతులలో లేవయ్యా ! ఇది నిజము.

రాముడు : తమ్ముడా! నాకోసము ఇట్లు అరణ్యములబడి అలసి సొలసి వచ్చినావు. నాన్నగారి ఆజ్ఞ నాకెటువంటిదో నీకుగూడ అటు వంటిదేగదా! ఆయనమాటపై నేను అరణ్యములకు వచ్చితిని. మరి నీవుగూడ ఆయనమాటపై రాజ్యమును ఏలుకొనవలెను గాని, ఇట్లు నారవస్త్రములు కట్టుకొని రాజ్యమును వదలివచ్చి నచో రాజ్యమేమగునయ్యా ?

భరతుడు : (వెంటనే అందుకొని) ఆ పనిమీదనే సర్వ అయోధ్య నీ వద్దకు కదలి వచ్చినది. కొంచెము కరుణ వహించుము. వచ్చిన అయోధ్యా ప్రజలు రాజు లేకుండా తిరిగిపోకూడదు.

రాముడు : (చిరునవ్వు నవ్వి) అసలు సంగతి ఏమయ్యా !

భరతుడు : వేదవిదులు, ధర్మశాస్త్రులు, దయాగుణ వర్ధమానులు, పరాక్రమవంతులు, మహాత్ములు అయిన మీకు...........

రాముడు : (మధ్యలోనే అందుకొని) చాలు. చాలు. చెప్పవలసినదేదో సూటిగాచెప్పక అన్నదమ్ములమధ్య పొగడ్తలుఎందుకయ్యా?

భరతుడు : మేలు మేలు! ముందు ఒక్కటిఅడిగెదను చెప్పుము. నేను నీ తమ్ముడను. నాయందు దోషమున్నదా ? ముందు నా కిది చెప్పుము.

రాముడు : (ప్రేమతో) పిచ్చి తండ్రీ! కొంచము గూడ నీ యందు దోషములేదయ్యా!

భరతుడు : అమ్మయ్య! నా మనస్సు కుదుటపడ్డది. నేను అయోధ్యకు వచ్చువరకు, నీవు అరణ్యములకు వెళ్ళినట్లుగాని, తండ్రి మరణించినట్లుగాగాని, నాకు తెలియనే తెలియదు. నిజముగా నీవిప్పుడు చెప్పినది నా మీద ప్రేమతోనే అయినచో మరి నాతో అయోధ్యకు వచ్చి వేయుము. తల్లిచెప్పినను వినలేదు. తండ్రి చెప్పినను వినలేదు. చివరకు భరతుని విన్నపము అంగీకరంచినాడను కీర్తి నాకు దక్కించుము. సర్వ అయోధ్య పక్షమున నేను ప్రార్థించుచున్నాను. నేను నీకు తమ్ముడను. శిష్యుడను. దాసుడను. మరి నన్నూ, ప్రజలను మన్నించిఅ నుగ్రహించుము (అని శ్రీరాముని పాదముల పైపడును.)

రాముడు : (భరతుని లేవదీసి) తొందర పడకునాయనా! తమ్ముడు అడిగినాడు. అన్నగారు చేయకలేక పోయినాడు అనుపేరు

నాకు తేవలెనను కొనుచున్నావా? నా నిర్ణయము చెప్పెదనుము. విను ఈ మూడులోకములను ఏలు రాచరికము వచ్చినను, నేను తండ్రి మాటనే మన్నించెదను.

భరతుడు : ఈ రాజ్యమును నా తల్లి నా కిచ్చినది. మరల నేను దానిని నా ఇష్టముతో నీ కిచ్చుచున్నాను. ఏమి? అన్నదమ్ముల మధ్యన యిట్లు చేసుకొనుట కూడదా? అయినను జ్యేష్ఠుడు వున్నప్పుడు వాని సోదరుడు రాజ్యమేలుట ఎక్కడైనను వున్నదా? నీవు తండ్రి మాటనే పట్టుకొని వలదననుచున్నావు. కాని నిజమునకు ఆ తండ్రి మాట మతిపోయిన మాట. కామావిల చిత్తముతో అన్నమాట. బుద్ధికి పొర క్రమ్మగా వచ్చిన మాట. అయినను తండ్రి నిన్ను వెళ్ళమని నోరువిప్పి చెప్పలేదుకదా! మరి ఎందులకయ్యా అట్టి మాటకై నీ కంత పట్టుదల?

రాముడు : అప్పటి తండ్రి స్థితి తెలిసికొనుటకు నీవు అచ్చట లేవు నాయనా. ఎవరో ఏదో చెప్పగా నీవు వింటివి. అంతే కదా! కాని ఆ రోజున అ స్థితిలో నేను తండ్రి దగ్గరనే వుంటిని. ఆయనను – ఆయన మనస్సును కన్నులతో చూచి, మనసారా గ్రహించితిని. అట్టి నాకన్న నీకు ఎక్కువ తెలియునందువా? అయినను తల్లి వరమడిగినది. తండ్రి యిచ్చినాడు. దానిని కుదరనివ్వక, పోవుటకు మధ్య నీవూ నేను ఎవరము?

భరతుడు : తండ్రి తప్పు చేసినచో మనము కూడా చేయవలెనా ? అ తల్లి కోర్కె తీర్చవలెనా ?

రాముడు : మన కిష్టము కానిచో తండ్రి చేసినది తప్పగును. తండ్రిని నరకమునకు పంపించ దలచుకున్నచో తండ్రి మాటను వమ్ము చేయవచ్చును. ఇక తల్లి మాట. ఆ కైకమ్మ తల్లి నా కెన్ని ఉపకారములు చేసినదో నీకు తెలియదు. కనీసము ఈ విధముగానైనను ఆమె ఋణమును కొంత తీర్చుకొనని మ్ము. ఒక్కటి వినుము. మన పెద్దలు ఏమి చేసినను. మన మంచికే చేయుదురు. దానిని గ్రహించక మనము ఎదురు తిరుగుట హానికరము. ఇహమునకు పరమునకు కూడా కాకుండా పోవుదుము.

జాబాలి : రామా! నేనొక్కటి చెప్పెదను. నీవు నిజముగా పితృ వాక్య పరిపాలకుడవే! కాదనను. ఇంతవరకు నీ ప్రవర్తన దానికి భిన్నముగా లేదు. ఇక ముందు కూడా ఉండబోదు. నీ తండ్రి పోయినాడుకదా! ఇక నీ తండ్రి మాటను నీవు పాటించ వలసిన పనిలేదు. సకల జన అభీష్టానుసారముగా అయోధ్యకు వచ్చి పాలించుము.

రాముడు : (కోపముతో) ఏమి ధర్మము చెప్పితివయ్యా! తండ్రి మాట తండ్రి పోవుటతోనే పోవుననికదా నీ వాదన! అయినచో ఆ తండ్రి పోవుటతో– ఆయనతోడి మా సంబంధములు గూడా అట్లే తెగిపోవలెను కదా! అప్పుడు ఆయన తండ్రి— నేను కొడుకు- అన్నసంబంధము కూడ వుండకూడదు గదా! మరి ఆయనరాజ్యమును స్వీకరించుటకు ఆయన కొడుకును కాని నేనెట్లు అర్హుడనగుదును?
(జాబాలి నివ్వెరపడును)

రాముడు : (కోపముతో గుడ్లెఱ్ఱచేసి) ఎందుకు వచ్చిన నాస్తికవాదములు?

ఇన్ని రోజులనుండి మా కొలువులో నీ వెట్లుంటివయ్యా! అయినను నిన్ను అని ప్రయోజనము లేదు. నిన్ను అంగీక రించిన మా పెద్దల కర్మను నిందించవలెను.

వశిష్ఠుడు : (మధ్యలోనే అందుకొని) రామా! తొందరపడకుము. జాబాలి నీ వనుకొనునట్లు ద్రాబ కాదు. సర్వ ధర్మములు తెలిసినవాడు. ఏ విధముగా నైనను నచ్చచెప్పి, నిన్ను అయోధ్యకు తీసుకు వెళ్ళవలెనను తపనతో అట్లు చెప్పినాడు. అంతే! ఇంత వరకు ఈ రఘు వంశములో పెద్ద కుమారుడే రాజ్యార్హుడుగా వచ్చుచున్నాడు. ఈనాడు ఆ ధర్మమును అతిక్రమించుట తగదు.

రాముడు : గురువుల మాట పాటించుట మంచిదే. కాని........

వశిష్ఠుడు : నిజము చెప్పితివి. నీ తల్లి, తండ్రి, నేను నీకు గురువులము. నేను నీకే గాక నీ కులమునకే గురువును. నామాట త్రోసి పుచ్చకున్నంతవరకు నీకు సద్గతులు చెడవు. భరతునిది పాపము పేద గుండె. సాధు బాలుడు. అతనిని ఇంక ఇబ్బంది పెట్టక సాకేత పురమునకు వచ్చి ఏలుకొనుము. నీ తల్లి మాట, నా మాట కూడ అదియే.

రాముడు : నాకు మీరు ఎప్పుడును గురువే. నేను మీకు ఎప్పుడును శిష్యుడనే. ఇది చెరగని అనుబంధము. కాని, చెప్పగల స్థితిలో ఉంటిమని, చెప్పినది చెల్లునని, మెత్తని బలవంత ముతో నా మీద ఒత్తిడి తీసుకువచ్చుట మీకు తగునా? మీరు చెప్పినట్లే గురువులయిన తల్లి, తండ్రి, గురువు ముగ్గురిలో ఇద్దరు ఒక విధముగాను, ఒకరు వేరొక విధము

గాను చెప్పినచో ఏమి చేయమందురు? అందులోనూ ఆ మూడవ గురువు లేని సమయములో మిగిలిన ఇద్దరితో సదుపాయము చేసికొనుట కుట్ర చేసినట్లే గదా!

వశిష్ఠుడు : (ఏమి చెప్పుటకూ మాట లేక నిరుత్తరుడగును.)

భరతుడు : స్వామి ఇటువంటి వాటితో లొంగువాడు కాదు. ఎందు కొచ్చినది? సుమంత్రా! దర్భాస్తరణములను సిద్ధము చేయుము. స్వామి దయ కలుగు వరకు ఉపవసిస్తూ ఇచ్చటనే ప్రతీక్షించెదను.

రాముడు : (కూర్చున్న వానిని తట్టి) నాయనా భరతా! నన్నేమి చేయ మందువయ్యా? ఇదంతా ఏమయ్యా? లే లెమ్ము! లేచి, అయోధ్యకు వెళ్ళి తండ్రి మాట ప్రకారము రాజ్యమును ఏలుకొనుము. ఆయన లేడు గదా అని ఆయన మాట అసత్యము చేయకుము. నా మాటను గూడా లెక్క చేయవా?

భరతుడు : నీ మాట ప్రత్యేకముగా ఏమున్నది? తండ్రి మాటయే గదా! ఒక పని చేసెదను. పదునాలుగేండ్లు నీ బదులు నేను అరణ్యవాసము చేయుదును. నీవు వెళ్ళి రాజ్యమును ఏలు కొనుము.

రాముడు : నా బదులుగా నీవు అరణ్యవాసము చేయుదువా? అది తండ్రి మాటను మన్నించినట్లగునా? బాగున్నదయ్యా! అయినా

నీవు మాత్రము ఎందుకు చేయవలెను? నీ బదులుగా మన ప్రజలలో ఏ ఒక్కరయినా సొమ్మునకు ఆశపడి చేయరా? లేదా అరణ్యవాసమునకు బదులుగా కొంత సొమ్మును ఎవరికైనా దానమిచ్చిన సరిపోదా? ఎందు కొచ్చిన కక్కుర్తి పనులు చెప్పుము? నాన్నగారు వెళ్ళమన్నది నన్ను. నేను వెళ్ళినపుడు మాత్రమే తండ్రి మాట చెల్లునుగాని, మరి ఏమి చేసినను చెల్లదు. నా మాట విని నా అరణ్యవాసము పూర్తగు వరకు నీవు రాజ్యము నేలుము. నేను నీ వెనుక వుందును. ఇంక బయలుదేరుము.

భరతుడు : పెద్దరికము, ధర్మము రెండును అటువంటివి. ఏమి చేయుదును? అట్లే కానిమ్ము. నేను మాత్రము జటావల్కల ధారినై నంది గ్రామములోనే వుందును.

రాముడు : అబ్బా! చెప్పినట్టి పనిని సగము చేసి సగము చేయవు. అట్లయినచో రాజ్యమును రక్షించి, ప్రజలను రంజింప చేయుటకు బదులు దానిని బీడుగాను, వారిని అనాథలుగాను చేయుదువన్న మాట. వెనక నేనుందునని చెప్పినను నీవు అనుమానించుచుంటివి.

భరతుడు : లేదు స్వామీ! నీ అండతోనే నే నుందును. ఏదీ ఒక్కసారి నీ పాదపద్మములతో ఈ పాదుకలను అధిరోహింపుము. (రాముడట్లు చేయగా – వానిని భక్తితో కనులకద్దుకొని నెత్తిన పెట్టుకొని) నీవు పదిహేనవ ఏట మొదటి నెల

మొదటి రోజున నాకు దర్శన మీయకున్న నేను అప్పుడే అక్కడే అగ్ని ప్రవేశము చేసెదను. అంతే కదా!

రాముడు : అవును. అంతే!

— తెర —

## మూడవ రంగము

(భరతుడు, వశిష్ఠుడు, జాబాలి ముందు పోవుచుండగా వెనుకగా లక్ష్మణుడు వచ్చుచుండును.)

లక్ష్మణుడు : అన్నా! భరతా!

భరతుడు : (వెనుకకు తిరిగి) ఇదేమి! నీవు వచ్చుచుంటివి? (ఆశతో) అన్నగా రేమైనా చెప్పమని పంపిరా?

లక్ష్మణుడు : కాదయ్యా! నేనే వచ్చుచున్నాను. నన్ను క్షమింపమని నిన్ను అడుగుటకు వచ్చుచున్నాను.

భరతుడు : (ఆశ్చర్యముగా) నిన్ను నేను క్షమించుటయా?

లక్ష్మణుడు : అవును. నీవు ఇక్కడకు ససైన్యముగా వచ్చునపుడు రేగిన ధూళిని చూచినపుడు నిన్ను అపార్థము చేసుకొంటిని. అన్న గారిని చంపి, రాజ్యమును నిష్కంటకముగా పరిపాలించు

కొనుటకు వచ్చుచున్నావని అభిప్రాయ పడితిని. ఈ విషయమునే అన్నగారితో కూడ చెప్పినాను. అప్పుడు అన్నగారేమనెనో తెలియునా?

భరతుడు : (ఆతృతగా) ఏ మనెను?

లక్ష్మణుడు : "నీ తలకు పుట్టిన ఊహాయేనా ఇది? మన నలుగురము ఒక తండ్రి బిడ్డలము అనిగూడ తోచలేదా? భరతుడు నా యందు నీ కంటె ఎక్కువ భక్తుడు. మరి నీవు అతనిపై కత్తి నూరుచున్నావు" అని అనినాడు. అన్నగారిని క్షమించ మని కోరితిని. ఇప్పుడు నిన్ను కోరుచున్నాను.

భరతుడు : బాగున్నది. నేను నిన్ను క్షమించుటయా? నీకు నేనెంత ఋణపడివుంటినో నీకు తెలియదు.

లక్ష్మణుడు ; అదేమి? నీవు నాకు ఋణపడి వుండుటయా?

భరతుడు : అవును. అసలు మీ తల్లి – కొడుకుల ప్రవృత్తియే వేరు. మా తల్లి – కొడుకుల ప్రవృత్తియే వేరు. మా అమ్మ అన్న గారిని అడవులకు పంపించినది. నేను ఆ అడవులలో గూడ అన్నగారు నిస్సంకోచముగా నడుచుటకు వీలులేకుండా ఆయన పాదుకలను ఎత్తుకొని పోవుచున్నాను. ఇది మా ప్రవృత్తి. ఇక అటు మీ తల్లి– కొడుకు దూరమై బాధ పడుచున్న పెద తల్లి కౌసల్యకు, తండ్రి పోగా అనాథ లయిన ప్రజలకు, రాజ్యమునకు అంబగాను, అండగాను

నిలిచినది. ఇటు నీవు- వదిన ఉర్మిళను అయోధ్యలోనే విడచి — అన్నగారిని కష్టకాలములో కంటికి రెప్పలా కాపాడుచున్నావు. నిజమునకు అన్నగారి కష్టమును మిగిలిన మన ముగ్గురు సోదరులము పంచుకొనవలెను. కాని మా ఇద్దరి భారము గూడ నీవు మోయుచుంటివి. నన్ను శత్రుఘ్నుడు సేవించుచున్నాడు. ఈ మీ తల్లీ కొడుకుల ఋణము ఒక జన్మలో తీరునది కాదు. అందుచే నీవే నన్ను క్షమించవలెను.

లక్ష్మణుడు : నీవు నాకు అప్పుపడి వుంటివా? అప్పుపడి వుంటివా ? (అనుచు పామువలె తల ఆడించుచు) అటులనే కానిమ్ము. (అని వెనుదిరిగి పోవును. భరతుడు ముందువారిని కలుసు కొనును.

— తెర —

## నాల్గవ రంగం

(సింహాసనముపై శ్రీరాముని పాదుకలు వుండును. పూజాద్రవ్యములు సింహాసనము క్రిందుగా నుండును. చక్కగా పూజాద్రవ్యములతో అలంకరించి— అగరువత్తులు— దీపములు వెలిగించి— వుండును.

భరతునికి అటు ఇద్దరు ఇటు ఇద్దరు నిలబడివుందురు.)

భరతుడు : వేదాహ మేతం పురుషం మహాన్తమ్ ।
ఆదిత్య వర్ణం తమసస్తుపారే ।
సర్వాణి రూపాణి విచిత్య ధీరః ।
నామాని కృత్వా అభివదన్ యదాస్తే ।
ధాతాపురస్తాత్ యముదాజహార ।
శక్రః ప్రవిద్వాన్ ప్రదిశశ్చతస్రః ।
త్వమేవం విద్వాన్ అమృత ఇహభవతి ।
నాన్యః పంథా అయనాయవిద్యతే ।

(హారతి త్రిప్పుచూ)

మంగళం కోసలేంద్రాయ మహనీయగుణాత్మనే
చక్రవర్తి తనూజాయ సార్వభౌమాయ మంగళమ్

రామచంద్ర మహారాజ్ కీ జై

— తెర —

(సమాప్తం)